వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

హైడ్రా అధికారాలు ఏమిటి?
అన్ని చట్టాలను రద్దు చేయండి
హైడ్రా చట్టమే తీసుకురండి
హైకోర్టు ఘాటు వ్యాఖ్య

రైస్ మిల్లర్ల వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించండి 10

సంపుటి 29, సంచిక: 36 | శనివారం | 25-07-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## ప్రధాని మోదీ అర్ధరాత్రి వీడియో

‘నీట్’ పేపర్ లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని సందేశం



పరీక్షా పత్రాల లీకేజీ (పేపర్ లీక్) ఘటనలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లును వచ్చేవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం అర్ధరాత్రి ప్రకటించారు. శుక్రవారం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు సంబంధించిన ముసాయిదాపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మోదీ ఒక వీడియో సందేశంలో తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో పేపర్ లీక్ అంశంపై తరువాయి 8లో

## పార్లమెంటులో కాకుండా ‘ఎక్స్’లో ప్రకటనలా?

ప్రధాని మోదీ తీరుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ



పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో, సభలో కాకుండా సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. నీట్ పరీక్షా పేపర్ల లీకేజీ, విద్యార్థుల ఆందోళనలపై మోదీ స్పందించిన తీరును ఆయన ‘ఏకపక్ష మన్‌కీ బాత్’గా అభివర్ణించారు. పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం మోపడానికి ఒక ప్రత్యేక బిల్లును ప్రవేశపెడతామని గురువారం రాత్రి ‘ఎక్స్’లో మోదీ ఒక వీడియో పెట్టడంపై స్పందించిన ఖర్గే, పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో, సామాజిక తరువాయి 8లో



## వాంగ్‌చుక్ నిరశన విరమణ

- డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీనివ్వడంతో దీక్షను ముగించిన పర్యావరణ కార్యకర్త
- భవిష్యత్ పోరాటాల కోసం జీవించడమే ముఖ్యమని వ్యాఖ్య
- ప్రధాన్ రాజీనామా చేసే వరకు శాంతియుత నిరసన : సిజెపి

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలపై జవాబుదారీతనం ఉండాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) జంతర్ మంతర్ వద్ద గత నెలలో నిరసన చేపట్టింది. అయితే ఈ నిరసనలకు సంఘీభావంగా పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధి నిరాహారదీక్షకు దిగారు. అయితే 26 రోజుల తరువాత గురువారం అర్ధరాత్రి ఆయన దీక్ష విరమించారు. తన డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాత ఆయన తన నిరవధిక నిరాహార దీక్షను విరమించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్ వాంగ్‌చుక్‌ను కలిసి ప్రభుత్వ హామీలను తెలియజేసిన తర్వాత, ఆయన తన దీక్షను ముగిస్తున్నట్లు ప్రకటించారు. ‘కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్, లేహ్‌—లఢాఖ్ ‘అపెక్స్ బాడీ’కి చెందిన సీనియర్ నాయకుల సమక్షంలో 26 రోజుల తర్వాత నా దీక్షను విరమించాను’ అని వాంగ్‌చుక్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తాను ఎందుకు దీక్ష విరమించాల్సి వచ్చిందో వెల్లడించారు. ‘నా దగ్గర రెండే దారులున్నాయి. ఒకటి నిరాహార దీక్ష కొనసాగించడం లేదా దీక్ష ముగించి ఉద్యమాన్ని కొనసాగించడం. వేలాది మంది నేను దీక్ష విరమించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రాణాన్ని పణంగా పెట్టడంకంటే ఉద్యమాన్ని కొనసాగించడమే ముఖ్యమని చాలామంది సూచించారు. భవిష్యత్ పోరాటాల కోసం నేను జీవించి ఉండటం చాలా ముఖ్యం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయనంతమాత్రాన ఈ ఉద్యమం విఫలమైనట్లు కాదు. ఆయన తరువాయి 8లో

## ధర్మేంద్ర రాజీనామాపై

# రాజీ ప్రసక్తే లేదు

- విద్యార్థులపై దాడులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాల్సిందే
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం
- నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ
- తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెగేసి చెప్పిన సిజెపి ప్రతినిధులు

**నేడు మరోసారి చర్చలు**



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్ ఘటనలతో దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) మధ్య చర్చలు జరిగాయి. శుక్రవారం ఢిల్లీలోని విఠల్‌భాయి పటేల్ హౌస్‌లో జరిగిన చర్చలకు కేంద్ర తరుపున మంత్రులు జెపి నడ్డా, జితేంద్రసింగ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో నీట్ పేపర్ లీక్, పరీక్షా విధానంలోని ఇతర అక్రమాలపై జరుగుతున్న నిరసనలకు సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం జరిగింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ విషయంలో ఎలాంటి రాజీ లేదని, ఈనెల 20న దారుణం దాడికి గురైన నిరసనకారులైన విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిజెపి ప్రభుత్వానికి స్పష్టం చేసింది. మే 3న నీట్ పరీక్ష రద్దయిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేసినట్లు సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ తరువాయి 8లో

## కేంద్రానికి వీకెండ్ టెన్షన్!

జంతర్‌మంతర్‌కు భారీగా జనం వస్తారని ఆందోళన

17 మెట్రో స్టేషన్‌ల మూసివేత

కేంద్రానికి వీకెండ్ టెన్షన్ పట్టుకుంది. నేడు, రేపు (శని, ఆదివారాలు) సహజంగా సిబిఎస్ఇ పాఠశాలలకు, విద్యా సంస్థలకు సెలవులు ఉంటాయి. అలాగే సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే వారికి కూడా ఆ రెండు రోజులు హాలీడేస్. దీంతో జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ధర్నా శిబిరం వద్దకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత వస్తారని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో వారిని ఎలా నిలవరించాలనే ఆందోళనలో ఉంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి కిక్కిరిసి వస్తున్న రైళ్ళను తరువాయి 8లో






## ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల్లోనే..

**వివిధ శాఖల పరిధిలోని నిరుపయోగ స్థలాలను గుర్తించండి**
**క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్

‘క్యూర్’ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లపై సిఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు సిఎం సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల వివరాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట సంబంధిత శాఖలకు స్థలాన్ని కేటాయించాలని సిఎం ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే తరువాయి 8లో

**ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరో** 12

## ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై

# దాడి అమానుషం

- ఎన్‌టిఎను రద్దు చేయడంతో పాటు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కాక్రోచ్ జనతా పార్టీకి వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు
- విద్యాసంస్థల బంద్ సక్సెస్
- హైదరాబాద్‌లో విద్యార్థి నాయకులు, యువత భారీ ర్యాలీ
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

గత కొద్ది రోజులుగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషమని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని, మరణించిన విద్యార్థుల కుటుంటాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌కు మద్దతుగా విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తమ పాఠశాలలకు, కాలేజీలకు సెలవు ప్రకటించాయి. పలు విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ఈ మేరకు తరువాయి 8లో

## ఇంటర్నెట్ షట్‌డౌన్ చట్ట విరుద్ధం : డి.రాజా



**న్యూఢిల్లీ :** విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసేందుకు ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో విధించిన ఇంటర్నెట్ షట్‌డౌన్ పూర్తిగా చట్టవిరుద్ధం, అహేతుకమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఖండించారు. ఈ చర్య సమాచారం పొందే పౌరుల హక్కును ఉల్లంఘిస్తుందని, నిరసనకారులు,సంస్థల మధ్య సమాచార మార్పిడికి అంతరాయం కలిగిస్తుందని,గందరగోళం, అరాచకాన్ని సృష్టిస్తుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చదువు, యుపిఐ చెల్లింపులు, రవాణా, పని, అత్యవసర సమాచార మార్పిడి వంటి నిత్యావసర సేవల కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడే సామాన్య ప్రజలను కూడా ఇది ప్రభావితం చేస్తుందన్నారు. కన్నాట్ ప్లేస్ కూడా ప్రభావితం కావడంతో, వేలాది మంది పౌరులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇంటర్నెట్ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడటానికి బిజెపి ప్రయత్నిస్తున్నందుకు ఢిల్లీ ప్రజలను శిక్షించకూడదని ఎద్దేవా చేశారు.

## 27న కలెక్టరేట్‌లు, లోక్ భవన్ వద్ద నిరసనలు

ఆగస్టు 6 నుండి 14 వరకు పాద యాత్రలు, ప్రచార యాత్రలు, సెప్టెంబరు 1వ తేదీన ఛలో ఢిల్లీ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా, శాంతియుత విద్యార్థి ఆందోళనపై క్రూరమైన అణచివేతకు నిరసనగా సిపిఐ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, హైదరాబాద్‌లో గవర్నర్ కార్యాలయం లోక్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తరువాయి 12లో

## రూ.1,000 కోట్ల సైబర్ మోసాలపై సిట్

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు దర్యాప్తు బాధ్యతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖమ్మం జిల్లాలో సంచలనం సృష్టించిన రూ.1,000 కోట్లకు పైగా విలువైన సైబర్ మోసాల కేసుల దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఆదేశాల మేరకు ఈ కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, దర్యాప్తు బాధ్యతలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అప్పగించినట్లు సమాచారం. అందిన వివరాల ప్రకారం, వీఎం బంజారా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుతో పాటు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసును సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్వాధీనం తరువాయి 12లో

## కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్రానికి సమగ్ర నివేదిక

రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణ పట్ల కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదికను పంపించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలను ప్రారంభించాలా?, వద్దా ?అనే విషయంలో కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా? పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖిత పూర్వక సిఫారసుల ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. అనంతరం పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కూడా సమీక్షించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాల కారణంగా తరువాయి 8లో



## కేంద్రం వల్లే సింగరేణికి

# కొత్త గనులొస్తలేవ్!

- సంస్థలో ఆదానీ, అంబానీ రూపంలో దొంగలు పడ్డారు
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కూనంనేని విమర్శ

ప్రజాపక్షం/పెద్దపల్లి

సింగరేణి సంస్థలో ఆదానీ, అంబానీల రూపంలో దొంగలు పడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వల్ల సింగరేణికి కొత్త గనులు తరువాయి 12లో

# కొండంత నిర్లక్ష్యం

ఉన్నత విద్యను తమ చెప్పుచేతల్లో ఉంచుకునేందుకై, సమాఖ్య స్ఫూర్తిని భగ్నం చేస్తూ అఖిల భారత ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణకు 'జాతీయ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఎ)ని 2017లో నెలకొల్పిన నరేంద్రమోదీ ప్రభుత్వం అసమర్థ నిర్వహణ దుష్ఫలితాలు అనుభవిస్తున్న విద్యార్థులు, వ్యంగ్యాత్మకమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఆకస్మికంగా ఆన్‌లైన్‌లో ఉద్భవించి విద్యావ్యవస్థపై నవతరం (జన్‌–జీ)లో కుతకుతమంటున్న అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తీకరిస్తూ ప్రభుత్వానికి ముచ్చెమటలు పోయిస్తున్నారు. నెలన్నరరోజులుగా జంతర్‌మంతర్ వేదికగా గాంధేయమార్గంలో నిరసన వ్యక్తం చేస్తుండగా చీమకుట్టినట్లు లేని ప్రభుత్వం సోమవారంనాడు విద్యార్థుల 'పార్లమెంట్ మార్చ్'పై మహాకర్కశంగా వ్యవహరించింది. పోలీసు క్రౌర్యం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు, నిరసన వ్యక్తం కావటం, రెండోవైపున, విద్యార్థి ఉద్యమానికి ప్రతిపక్షాల క్రియాశీల మద్దతుతో సోమవారంనుంచి పార్లమెంటు ఉభయ సభలు ప్రతిష్టంభనలో పడటంతో – పరువు నిలుపుకునే ప్రయత్నంగా ఈ బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం నిద్రలేని రాత్రులు గడుపుతూ హడావుడి ప్రయత్నాలు మొదలుపెట్టింది. నీట్ తదితర ప్రశ్నాపత్రాల లీకేజి విద్యార్థిలోకంలో కలుగజేసిన క్షోభకు జవాబుదారీగా విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలన్న ఉద్యమకారుల, ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గకుండా ఇతరత్రా కోర్కెల ఆమోదానికి ముందుకు వచ్చింది. హక్కుల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహారదీక్షను విరమించారు. ఉద్యమకారుల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం అర్థరాత్రి (తెల్లవారితే శుక్రవారం) 12 గంటలకు విద్యార్థి నాయకులకు వీడియో సందేశం పంపటమే ప్రభుత్వంలో బయలుదేరిన బెదురుకు నిదర్శనం. 'పరీక్షా పత్రాల లీకేజి లక్షలాది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో బాధాకరమని అంటూ, లీకేజి మాఫియాలపై కఠిన చట్టం, చర్యలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు' వాగ్దానం చేశారు. పార్లమెంటు సమావేశం జరుగుతుండగా విధాన ప్రకటనలు సభలో చేయకుండా సభవెలుపల చేయటం పార్లమెంటరీ సంప్రదాయాలపట్ల మోదీకున్న అగౌరవాన్ని తెలియజేస్తుంది. లేదా తన అర్థరాత్రి సందేశానికి విద్యార్థులు చలించిపోయి వెంటనే ఉద్యమం విరమిస్తారని భావించి ఉండాలి. ఉద్యమంలో సంఘ వ్యతిరేక, విద్రోహశక్తులు, దేశద్రోహులు ప్రవేశించారని, విదేశీ ప్రమేయం ఉందని బిజెపి నాయకులు దేశం నాల్గుదిశలా తమకు అలవాటైన దుష్ప్రచారం చేయటం వారి నిస్సహాయతకు నిదర్శనం. మోదీ 12 ఏళ్ల పాలనలో ఇటువంటి ఉద్యమాన్ని వారు కలలోకూడా ఊహించలేదు. ఒక పక్క రామాలయంలో భక్తుల కాన్కల దొంగతనం, ఇటేమో తమకు కోటలాంటి హిందీ బెల్టునుంచి జన్–జడ్ తరం తిరుగుబాటు బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

ఉన్నత ఆశయాల ప్రకటనతో నెలకొల్పిన ఎన్‌టిఎ సెంటర్‌ను ఎంత అధ్వాన్నంగా నిర్వహిస్తున్నారో విద్యాశాఖ సహాయమంత్రి సుఖాంత మజుందార్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం వెల్లడించింది. ఎన్‌టిఎలో ఏర్పాటు చేసిన 39 పోస్టుల్లో 15ఖాళీగా ఉన్నాయి. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖకు చెందిన ఈ పరీక్షల నిర్వహణ సంస్థలో ప్రస్తుతం ఉన్న 24 మంది ఉద్యోగులూ వివిధ సంస్థల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చినవారే. ఎన్‌టిఎ ఎక్కువగా బయటివారిపై ఆధారపడుతున్నది. కమ్యూనికేషన్ జనరల్ మేనేజర్, సీనియర్ సలహాదారులు, కన్సల్టెంట్స్ సహా 73మంది అధికారులు కాంట్రాక్టుపై, 124మంది పొరుగుసేవల ఉద్యోగులు ఉన్నట్లు సిపిఐ(ఎం) సభ్యుడు వి.శివదాసన్ ప్రశ్నకు మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం తెలియజేస్తున్నది. కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో 16 పోస్టులు ఏర్పాటు చేశారు. కాని పర్మినెంట్ స్టాఫ్‌ను రిక్రూట్ చేయకుండా డెప్యుటేషన్‌లతోనే సరిపెట్టారు. యూనివర్శిటీ ఎంట్రన్స్, మెడికల్, ఇంజినీరింగ్, ఫెలోషిప్ వంటి 24 ఉన్నతస్థాయి పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించబడిన ఎన్‌టిఎ నిర్మాణం, నిర్వహణ ఇంత దారుణంగా ఉంటే ఆ శాఖను నిర్వహించే మంత్రి సమర్థుడని ఎవరైనా అంటారా? అతను రాజీనామా చేయాలి లేదా ప్రధాని బర్తరఫ్ చేయాలన్న 'బొద్దింకల' డిమాండ్ న్యాయం, ధర్మం, సమంజసం కాదా?

నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల తదుపరి ఆ ఏజన్సీ అధికారులు కొందరిని బదిలీ చేశారు. ఇప్పుడు – ఇంతటి ఆందోళన తర్వాత విద్యామంత్రిత్వ శాఖలో ఉన్నత విద్య కార్యదర్శిసహా ఇద్దరు–ముగ్గురు ఉన్నతాధికారులను బదిలీ చేశారు. నీట్‌లీక్ ఆరోపణలపై 47మందిని సాయంత్రం తొలగించారు. విద్యాశాఖమంత్రి ఇన్నాళ్లు నిద్రపోతున్నారనే అర్థం కాదా? ఈ ఉద్యమం గూర్చి నోరువిప్పటానికి ప్రధానమంత్రే నెలన్నరరోజులు తీసుకున్నారు. ఆయన మంత్రులనుంచి మెరుగైన పనితీరు ఊహించగలమా?

నీట్ పరిణామాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వరుసక్రమంలో పెట్టిన తీరు సమస్యను సూక్ష్మంగా సుబోధక పరుస్తున్నది. ''పరీక్షల నిర్వహణకై మోదీ ప్రభుత్వం ప్రత్యేకించి ఎన్‌టిఎ ఏర్పాటు చేసింది....అంతకుముందున్న వ్యవస్థ రద్దు చేసింది...ఎన్‌టిఎ నిర్వహణలో కనీసం 9పేపర్లు లీక్ అయినాయి... సంస్కరణలు సీరియస్‌గా అమలు జరిపే బదులు ప్రధాని అడ్డుపడుతూ వచ్చారు...నీట్–యుజిసి 2026 లీక్ అయింది... ఎన్‌టిఎ, ఉన్నత విద్య డిపార్టుమెంట్ వారు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీముందు, సిగ్గుమాలినతనంతో, ప్రశ్నాపత్రం లీక్ కాలేదని బుకాయించారు... ప్రధానికి సత్యం కన్నా తన ప్రతిష్ట ప్రధానం...పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు కూడా ఉన్నారన్న మిషతో సిఫారసులు అమలు చేయలేదు''. అందువల్ల నీట్–యుజి 2026 పేపర్ లీక్ రోగలక్షణం మాత్రమే; జబ్బు చాలా లోతుగా ఉంది అన్నారు రమేశ్. ఆ రోగాన్ని క్షుణ్ణంగా పరీక్షించి, భవిష్యత్ పరీక్షలకు భద్రత కల్పించాలంటే విద్యామంత్రి తొలగింపు అవసరం. ఆ పని చేయకపోతే తమ డిమాండ్ 'ప్రధాన్' నుంచి 'ప్రధాని'కి విస్తరిస్తుందని 'బొద్దింకల' పేరుతో ఉన్న జన్–జడ్ తరం, ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.

ఎన్‌టిఎని సక్రమంగా నిర్వహించ చేతగాని మోదీ ప్రభుత్వం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్, ఉపాధ్యాయ విద్యా జాతీయ కౌన్సిల్ చట్టాలను రద్దు చేసి – ఆ అధికారాలతో ఒకే సంస్థ ఏర్పాటు చేసేందుకై ''వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్'' బిల్లు తెచ్చింది. అది జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు ఆగింది. ఎందుకీ విద్య కేంద్రీకరణ తపన !

## ఎన్‌టిఎలో భారీ ప్రక్షాళన

**జెఇఇ, నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)లో ప్రభుత్వం భారీ ప్రక్షాళన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీతో ఈ ఏజెన్సీ పదేపదే వివాదాల్లోకి రావడంతో అందుకు కారకులుగా గుర్తించిన 47 మంది అధికారులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురిపై లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. లీకులకు అస్కారం లేకుండా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.**



# వీధులు మాట్లాడితే... అధికారం వినాల్సిందే!

ప్రశ్నలు పుట్టని సమాజంలో ప్రజాస్వామ్యం బతకదు.. ప్రశ్నించనివ్వని వ్యవస్థలో స్వేచ్ఛ నిలవదు. చరిత్ర చెబుతున్న అసలు పాఠం ఇదే. భారతదేశంలో మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం నుంచి జంతర్ మంతర్, రైతు ఉద్యమాల వరకు.. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా వర్ణవివక్ష వ్యతిరేక పోరాటం నుంచి నేపాల్ ప్రజాస్వామ్య ఉద్యమాలు, టియాన్మెన్ స్క్వేర్ విద్యార్థి నిరసనలు, అరబ్ స్ప్రింగ్, ఇరాన్ మహిళల ఉద్యమాలు, శ్రీలంక ప్రజా నిరసనలు, అమెరికా పౌర హక్కుల ఉద్యమాలు, ఆస్ట్రేలియాలో ఆదివాసీ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం జరిగిన శాంతియుత ఉద్యమాల వరకు ప్రపంచ చరిత్ర ఒక విషయాన్ని గుర్తుచేస్తోంది. ప్రజల ఆకాంక్షలను దీర్ఘకాలం అణచివేయడం ఏ వ్యవస్థకూ సాధ్యం కాదని అనేక చారిత్రక అనుభవాలు సూచిస్తున్నాయి. భారత రాజ్యాంగం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల హక్కుల ద్వారా ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని రక్షిస్తోంది. ఈ సమతుల్యతను సుప్రీంకోర్టు మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (2018), రామ్‌లీలా మైదాన్ (2012), అమిత్ సాహ్నీ–షాహీన్ బాగ్ (2020) వంటి కీలక తీర్పుల్లో పునరుద్ఘాటించింది.

**ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలు.. ఒకే బాధ్యత**

ప్రజాస్వామ్యంలో ప్రజలు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, మీడియా పరస్పర ప్రత్యర్థులు కాదు, రాజ్యాంగ విలువలను పరిరక్షించే బాధ్యతాయుత భాగస్వాములు. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగా మాత్రమే కాకుండా విధానపరమైన హెచ్చరికగా స్వీకరించి పారదర్శక సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పౌరులు తమ రాజ్యాంగబద్ధ హక్కులను శాంతియుతంగా, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వినియోగించాలి. చట్టపాలన, ప్రజా ఆస్తుల పరిరక్షణ, పరస్పర గౌరవం ప్రజాస్వామ్య సంస్కృతికి అంతర్భాగాలు. హక్కులు, బాధ్యతలు సమతుల్యంగా నడిచినప్పుడే ప్రజాస్వామ్యం పై విశ్వాసం మరింత బలపడుతుంది.

**చైతన్యంతోనే నిజమైన మార్పు**

డిజిటల్ యుగంలో నిరసనలు కేవలం వీధులకే పరిమితం కావడం లేదు, సామాజిక మాధ్యమాల ద్వారా క్షణాల్లో ప్రపంచవ్యాప్త చర్చగా మారుతున్నాయి. దీనితో పాటు తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రచారం, సందర్భంలేని ప్రచార కంటెంట్ వంటి సవాళ్లు కూడా పెరిగాయి. అందువల్ల డిజిటల్ అక్షరాస్యత, వాస్తవ నిర్ధారణ,బాధ్యతాయుత సమాచార వినియోగం, నిష్పాక్షిక మీడియా ధోరణి ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యవసరం. సినిమా, సాహిత్యం, కళలు సమాజానికి తుది తీర్పు ఇవ్వవు, కానీ ఆలోచింపజేసే ప్రశ్నలను లేవనెత్తుతాయి. 'జవాన్' కూడా ఆ కోణంలో ప్రజాస్వామ్యం, మంచి పాలన, పౌర బాధ్యతపై సంభాషణను విస్తరించిన చిత్రంగా నిలిచింది. చరిత్ర చెబుతున్న శాశ్వత పాఠం ఒక్కటే.. స్థిరమైన ప్రజాస్వామ్య మార్పు హింసతో కాదు, రాజ్యాంగబద్ధ సంభాషణ, చైతన్యవంతమైన పౌర భాగస్వామ్యం, స్వేచ్ఛాయుత ఎన్నికలు, జవాబుదారీతనంతో కూడిన పాలనతోనే సాధ్యమవుతుంది. ప్రభుత్వాలు ప్రజల స్వరాన్ని వినాలి. ప్రజలు చట్టాన్ని గౌరవించాలి, మీడియా సత్యాన్ని కాపాడాలి, న్యాయవ్యవస్థ రాజ్యాంగ విలువలను సంరక్షించాలి. విప్లవం హింసతో కాదు.. చైతన్యంతో రావాలి. ప్రజాస్వామ్యం నినాదాలతో కాదు.. బాధ్యతాయుతమైన పౌరులతో బలపడాలి. ప్రశ్నించే హక్కు ఎంత పవిత్రమో, వినే బాధ్యత కూడా అంతే పవిత్రం.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# విద్యారంగ పతనం యువ భారతానికి గాయం



సోనియా గాంధీ
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్

పరీక్షా పత్రాల లీకేజీలకు, విద్యా వ్యవస్థలోని సాధారణ పతనానికి వ్యతిరేకంగా భారతదేశం నలుమూలలా యువ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు ఊపందుకుంటున్నాయి. భారత ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని, విద్యా సంస్కరణలు చేపట్టాలనే వారి డిమాండ్లు సూటిగా, స్పష్టంగా ఉన్నాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం వారి ధైర్యానికి పిరికితనంతో, విచక్షణారహిత క్రూరత్వంతో సమాధానమిచ్చింది. వారిని భవిష్యత్తు వారసులుగా కాకుండా దేశ శత్రువులుగా పరిగణించింది. ఒక అపఖ్యాతి పాలైన రోజు 2026 జూలై 20న ఢిల్లీ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిఎపిఎఫ్) క్రూరమైన లాఠీచార్జీలు, భాష్పవాయువును ప్రయోగించి అనవసరమైన హింసతో వారిని అణచివేయడానికి ప్రయత్నించాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిలో చాలా మంది గాయపడ్డారు. ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులను కూడా వదల్లేదు. వారి వీపులపైనా, తలలపైనా లాఠీల వర్షం కురిసింది.పెల్లెట్ల వాడకంతో శరీరాలు గాయపడిన యువత వంటి అత్యంత విచారకరమైన దృశ్యాలను దేశం చూసింది. ఇందుకు కేంద్ర హోం మంత్రి స్వయంగా ఆమోదించి ఉంటారని నిస్సందేహం గా చెప్పగలం. ఆనాటి వీడియోలు మన జ్ఞాపకాలలో చెరగని ముద్ర వేసి, మన సామూహిక మనస్సాక్షిని కదిలించాయి. ప్రభుత్వం, దాని ఆధీనంలో ఉన్న మీడియా మాత్ర మే, ఆకస్మికంగా పెరుగుతున్న ఈ నిరసనల వెల్లువ చుట్టూ కట్టుకథలు అల్లుతున్నాయి. ఇకనైనా ఆపండి అని గట్టిగా, స్పష్టంగా చెప్పాలి. వీరు మన కొడుకులు, కూతుళ్లు, మన యువతీ యువకులు.

మోదీ ప్రభుత్వం చర్చలకు బదులుగా హింసను సర్వసాధారణంగా ప్రయోగిస్తుంది. రైతుల నుండి ఉద్యమకారుల వరకు ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. కానీ ఈ వారం, నిరంకుశ పాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన సున్నితత్వం లేని ప్రభుత్వం మరింత నీచ స్థాయికి దిగజారింది. మన భవిష్యత్ వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, పారిశ్రామికవేత్తలు, దేశనిర్మాతలను అర్థం చేసుకుని వారి పట్ల సానుభూతితో వ్యవహరించడానికి బదులుగా, వారిపై ప్రభుత్వ అణచివేత శక్తిని ప్రయోగించింది. దీనిని క్షమించలేము, మరచిపోలేము.ప్రతీ అసమ్మతిని దేశద్రోహంగా ముద్రవేసే పాత అస్త్రాన్ని, విద్యార్థి ఆందోళనపై బురద చల్లడానికి మళ్ళీ ప్రయోగించారు. నిరసనలకు ప్రేరణగా నిలిచిన తన విధానాలపై ఆత్మపరిశీలన చేసుకోవలసిన మోదీ ప్రభుత్వం, నిందలు వేయడానికి, కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి తన వద్ద ఉన్న అన్ని కుతంత్రాలను ప్రయోగించింది.

**ప్రభుత్వవిద్య పతనం**

ప్రభుత్వ విద్య విషయంలో మోదీ ప్రభుత్వం వెనకడుగు వేయటమే తొలి మౌలిక అంశం. ఈ ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో పాఠశాల విద్యపై వెచ్చించే వాటాను 50 శాతం, ఉన్నత విద్యపై 33 శాతం తగ్గించింది. ఇంతటి అసంబద్ధమైన వెనకడుగులో ఎవరికైనా ఔచిత్యం కనిపిస్తుందా? గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలను మూసివేయగా, 43,000 ప్రైవేట్ పాఠశాలల ప్రారంభాన్ని పర్యవేక్షించింది. వీటిలో అధిక భాగం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నడపబడుతున్నాయి. యాదృచ్ఛికంగా దాని అనుబంధ సంస్థలతో కలిసి భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్‌కు నేతృత్వం వహిస్తుంది. ఉన్నత విద్యారంగంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విశ్వవిద్యాలయాలకు ఇచ్చే గ్రాంట్లను తగ్గించి, అధిక వడ్డీ రేట్లకు రుణాలు తీసుకునేలా వాటిని ప్రోత్సహించింది. వాటిని తిరిగి చెల్లించేందుకు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తమ ఫీజులను పెంచే మార్గాన్ని ఎంచుకున్నాయి.

అత్యున్నత నాణ్యమైన, సరసమైన ప్రభుత్వ విద్య అందుబాటులో లేకపోవడంతో, భారతదేశంలోని కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం సొంతంగా డబ్బు ఖర్చు చేయవలసి వస్తోంది. కేవలం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) కోచింగ్‌పై కుటుంబాలు ఖర్చు చేసే మొత్తం, మోదీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై మొత్తంగా పెట్టే పెట్టుబడికి సమానం. ప్రైవేట్ విద్యను అభ్యసించడానికి అయ్యే ఖర్చు, నిరుపేద కుటుంబాల నుండి వచ్చి అపారమైన సామర్థ్యం కలిగిన లక్షలాది ప్రతిభావంతులైన విద్యార్థులను నిరుత్సాహపరుస్తోంది. అయితే, అంతే కీలకమైన విషయం ఏమిటంటే, ఈ ఖర్చులు తీవ్రమైన భారాన్ని మన విద్యార్థులపై అసాధ్యమైనంత అధిక అంచనాలను మోపుతున్నాయి. తమ పిల్లల విద్యా, వృత్తిపరమైన విజయాలనే స్వప్నం కోసం వారి కుటుంబాలు ఎంతగా పెట్టుబడి పెట్టాయో భారతదేశ యువతకు బాగా తెలుసు. మన విద్యార్థులలోని ఈ తీవ్ర నిరాశకు విద్యారంగ ప్రైవేటీకరణ, వ్యాపారీకరణే ప్రత్యక్ష కారణం.



**విఫలమైన పరీక్షా వ్యవస్థ**

ఇక రెండవ అంశం, కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, రాజకీయాకరణ ప్రక్రియలకు గురైన భారతదేశ ప్రభుత్వ పరీక్షా వ్యవస్థ నిర్వీర్యం కావడం.విశ్వవిద్యాలయాలు, రాష్ట్రాలు తమ ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సొంత పరీక్షలను నిర్వహించుకునే సాంప్రదాయ పద్ధతి స్థానంలో, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) వంటి కేంద్రీకృత, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించే పరీక్షలు వచ్చాయి. ఎన్‌టిఎ అనేది ఒక అసమర్థమైన, దీర్ఘకాలంగా సిబ్బంది కొరతతో బాధపడుతున్న సంస్థ. ఇది తన పరీక్షలను నిర్వహించడానికి పూర్తిగా ప్రైవేట్ కాంట్రాక్టర్ల సైన్యంపై ఆధారపడుతుంది. ఎన్‌టిఎ నియమించిన ప్రశ్నపత్రాల రూపకర్తలు, అనువాదకులు, నిపుణులు భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన ప్రఖ్యాత విద్యావేత్తలు కాదని, చాలావరకు రాజకీయ అనుబంధం కలిగిన సాధారణ వ్యక్తులేనని అందరికీ తెలిసిన విషయమే. ఈ ప్రక్రియ తుది ఫలితం తీవ్రమైన పరిణామాలకు దారితీసింది. గత 12 ఏళ్ళలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీకులు జరిగాయి. వాటిలో 2017లో ఎన్‌టిఎ ఏర్పడిన నాటి నుంచి స్వయంగా తొమ్మిది పేపర్లను లీక్ చేసింది. అధికారులు తమ నేరపూరిత చర్యలకు ఎలాంటి తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోకుండా, పరీక్షా విధానం నుండి లాభాలు గడించాలనే మార్గం ఎంచుకుంటున్నందున, అత్యంత ప్రతిభావంతులైన, కష్టపడి చదివే విద్యార్థులు కూడా విఫలమవుతున్నారు.

మూడవ అంశం, భారతదేశ విద్యా వ్యవస్థలో విజయం సాధించడం కష్టంగా ఉండటం. ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న గుత్తాధిపత్యం కారణంగా, పట్టభద్రులైన తర్వాత అత్యంత నాణ్యమైన, మంచి జీతాలు ఇచ్చే ఉద్యోగ అవకాశాలు నేడు అరుదుగా లభిస్తున్నాయి. మన యువ పట్టభద్రులలో నిరుద్యోగ రేటు నిలకడగా అధికంగా ఉంటోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇది సగటున సుమారు 40 శాతంగా ఉంది. మిగిలిన కొన్ని ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. వాటికోసం పోటీ పడటానికి మన విద్యార్థులు గతంలో మాదిరిగా సన్నద్ధంగా లేరు. పక్షపాత విధేయత ఆధారంగా ఎంపిక చేసిన అసమర్థ వైస్‌ఛాన్సలర్‌ల నియామకం, దాని పర్యవసానంగా రాజకీయ సంబంధాలు కలిగిన అర్హత లేని అధ్యాపకులను నియమించుకోవడం మన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో బోధన సంక్షోభాన్ని సృష్టించింది. పని ప్రదేశంలో నైపుణ్య అవసరాలు మరింత సవాలుగా మారిన తరుణంలో, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ కాలం చెల్లిన పద్ధతులకు, రాజకీయ ప్రేరేపిత పాఠ్యప్రణాళిక మార్పులకు కట్టుబడి ఉంది. ఇది అభివృద్ధి చెందుతున్న పద్ధతులు, ప్రమాణాలకు ప్రమాదకరంగా దూరంగా ఉండి, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్రపంచం వేగాన్ని అందుకోలేకపోతుంది. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సవాళ్లతో నిండిన, రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్ ఉన్న వ్యవస్థలో విజయం సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.ఇందుకు తగినంత వనరులు లేకపోవడమే కారణం.

కాబట్టి విద్యా వ్యవస్థ రోజురోజుకు ఖరీదైనదిగా, అవినీతికి ఆస్కారం ఉన్నదిగా, అందులో విజయం సాధించడం కష్టంగా మారిపోతోంది. కానీ, జవాబుదారీతనం నుండి తప్పించుకుంటూ, విద్యపై చిత్తశుద్ధితో కూడిన చర్చలను నివారించే మోదీ ప్రభుత్వ స్థిరమైన, ఉద్దేశపూర్వక విధానమే దీనికి చివరి దెబ్బగా నిలిచింది. ఏకాభిప్రాయం కోరకుండా లేదా పార్లమెంటరీ చర్చలకు పెట్టకుండా జాతీయ విద్యా విధానం – 2020 ను ఉద్దేశపూర్వకంగా ఆమోదించింది. ఎన్‌టిఎను అసలు పార్లమెంటు ముందుకు తీసుకురాలేదు. ఎలాంటి జవాబుదారీ యంత్రాంగాలు లేకుండా కేంద్ర మంత్రివర్గం ఏర్పాటు చేసిన ఒక సొసైటీగానే మిగిలిపోయింది. ఎన్‌టిఎను బలోపేతం చేయాలన్న విద్యపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సులలో ప్రతిపక్ష సభ్యులు ఉన్నారనే ఏకైక కారణంతో, ఆ సిఫార్సులను బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా విద్యాశాఖ మంత్రి జవాబుదారీతనం పట్ల తనకున్న ధిక్కారాన్ని నిస్సిగ్గు గా ప్రదర్శించారు. ఇన్ని ఘోర వైఫల్యాలు ఎదురైనా పదవికి రాజీనామా చేయడానికి ఆయన ఇష్టపడకపోవడం ప్రజాభిప్రాయాన్ని మరింత రెచ్చగొట్టింది.

**నిరసన మూలాలు**

పరస్పర సంబంధిత శక్తుల సహజ పర్యవసానమే విద్యార్థుల నిరసనలు. అవి నిరాశను మాత్రమే రేకెత్తించే నేటి నిరాశాజనకమైన విద్యా వాతావరణం, మోదీ ప్రభుత్వానికి అలవాటైన అహంకారం, జవాబుదారీతనం లేదా నిర్మాణాత్మక వైఖరి లేకపోవడం. విద్యార్థి నిరసనకారులపై కేంద్ర హోం మంత్రి ప్రత్యక్ష అజమాయిషీ కింద పనిచేస్తున్న పోలీసు సిబ్బంది ప్రదర్శించిన క్రూరత్వం ఈ ప్రభుత్వ హయాంలో కొత్తేమీ కాదు. 2020లో పౌరసత్వ (సవరణ) చట్టం – జాతీయ పౌర పట్టిక నిరసనల సమయంలో సాయుధ పోలీసులు, పారామిలిటరీ బలగాలు విశ్వవిద్యాలయ ప్రాంగణాలపై ఎలా విరుచుకుపడ్డాయో మనందరికీ స్పష్టంగా గుర్తుంది. భారతదేశ మహిళా రెజ్లర్లపై జరిగిన ఆమోదయోగ్యం కాని దురాగతాలు మన స్మృతుల నుంచి ఎప్పటికీ చెరిపివేయలేము.

మోదీ ప్రభుత్వం భారతదేశ విద్యారంగాన్ని దిగజార్చడమే కాకుండా, శిక్షలపై భయం లేనితనంతో, అపారమైన స్వీయ భ్రమలతో, అత్యంత సున్నితత్వం లేకుండా వ్యవహరించడాన్ని అలవాటుగా మార్చుకుంది. భారతదేశ విద్యార్థులు మోదీ ప్రభుత్వ బూటకపుతనాన్ని బట్టబయలు చేశారు. వారికి అండగా నిలబడి, వారి భవిష్యత్తును కాపాడటం మన నైతిక, రాజకీయ, రాజ్యాంగపరమైన బాధ్యత.

(ది హిందూ – తేదీ: 24/7/2026)

# నిర్మాణం బదులు కూల్చివేత బిజెపి అభివృద్ధి



రాం పునియానీ

ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో జాహర్ యూనివర్శిటీముందు ప్రస్తుతం బైఠాయింపు ఆందోళన జరుగుతోంది. ప్రస్తుతం జైల్లో ఉన్న సమాజ్‌వాదిపార్టీ సభ్యుడు ఆజంఖాన్ ఆ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ట్రస్టు చైర్మన్. యూనివర్శిటీకి చెందిన 40లో 38 భవనాలను కూల్చివేయాలని కోరుతూ రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ జారీచేసిన నోటీసును విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. అది యూనివర్శిటీని మూసివేయటంతో సమానం.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (జులై 20, 2026) ప్రచురించిన వార్తలో, యూనివర్శిటీ లా విద్యార్థి మెహ్‌రోజాఖాన్ ఇలా చెప్పారుః''మా వృత్తి జీవితం, భవిష్యత్ ప్రమాదంలో పడ్డాయి. యూనివర్శిటీని కూల్చివేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరుతూ మేము ఈ బైఠాయింపు జరుపుతున్నాం. మేము ఇతర ప్రదేశాల్లో – కాలేజీలు బహుదూరంలో ఉన్నందున మా చదువులు కొనసాగించలేము. ఇక్కడ ఫీజు రాయితీ పొందటం పెద్ద విషయం. ఎస్‌సి/ఎస్‌టి విద్యార్థులు 50 శాతం రాయితీ పొందుతున్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు కూడా రాయితీ పొందుతున్నారు. ఇక్కడ బి.ఫార్మా, డి.ఫార్మా వంటి కోర్సులున్నాయి, మాలో చాలామంది వాటిని వేరేచోట చదవటం సాధ్యంకాదు.''

రాంపూర్‌లో మహమ్మద్ అలీ జాహర్ యూనివర్శిటీకి 2006 సెప్టెంబర్ 18న శంకుస్థాపన జరిగింది. మహమ్మద్ అలీ జాహర్ ట్రస్టు అనేక సంవత్సరాలలో క్యాంపస్ అభివృద్ధి చేసింది. అయితే వివిధ భవనాల కచ్చితమైన నిర్మాణ సమయం తీవ్రమైన లీగల్, అడ్మినిస్ట్రేటివ్ వివాదానికి గురైనాయి.

రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌డిఎ) ప్రకారం, యూనివర్శిటీ మెడికల్ కాలేజీ, ఒక అకడమిక్ బ్లాక్‌లకు మాత్రమే చెల్లుబాటైన, ఆమోదం పొందిన ప్రణాళికలున్నాయి; క్యాంపస్‌లోని మిగతా 38 భవనాలను అర్హతగల పౌర పాలనాధికార సంస్థనుండి అనుమతులు లేకుండా నిర్మించారు. అయితే యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ వాదన ఏమంటే — అనేక సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ భవనాల ప్రదేశం వాటి నిర్మాణకాలంలో (సింగన్‌ఖెరాగ్రామం) ఆర్‌డిఎ అధికార పరిధిలో లేదు; అప్పుడు స్థానిక జిల్లా పంచాయత్ అనుమతులు ఇచ్చింది.

ఈ 38 భవనాలు అనుమతులు లేని నిర్మాణాలు, భూవినియోగ ఉల్లంఘనలకు ఒడిగట్టి నిర్మించినవీ అయినందున వాటి తొలగింపు లేదా కూల్చివేతకు ఉత్తర్వు చేసినట్లు ఆర్‌డిఎ చెబుతోంది. కాగా వివిధ తరగతుల విద్యార్థులకు, ముఖ్యంగా ముస్లింలు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు విలువైన సేవ చేస్తున్నందున యూనివర్శిటీ భవనాల కూల్చివేత వాంఛనీయం కాదని విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయనాయకులు వాదిస్తున్నారు. ముఖ్యంగా ముస్లింల విద్యను దెబ్బతీయటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని వారంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలక్ష్యం చేసిన రంగాల్లో విద్య ఒకటి. ప్రస్తుత విద్యార్థి – యువజన ఆందోళన చెబుతున్నది ఇదే. మైనారిటీ విద్యాసంస్థలకు ప్రభుత్వం మరిన్ని ఆటంకాలు కలిగిస్తోంది.

మరో అంశం – కట్టడాల కూల్చివేతలు ముస్లిం అస్థిత్వంతో ముడిపడి ఉన్నాయి. కాశీ, మధుర, సంభాల్, అజ్మీర్ దర్గా, సహరాన్‌పూర్ మసీదుల కూల్చివేతలు ఇప్పటికే వరుసలో ఉన్నందున ఆ వరుసలో తాజా లక్ష్యం జాహర్ యూనివర్శిటీ. కమాల్ మౌలా మసీదు వాగ్దేవి దేవాలయం అంటూ ఆ ప్రదేశాన్ని ఇటీవల హిందూ పక్షానికి అప్పగించటం చూశాం. ఇతర మసీదులు బాబ్రీమసీదు మార్గంలో కూల్చివేత ప్రమాదం ఎదుర్కొంటున్నాయి.

రామజన్మభూమి ఉద్యమకాలంలో ఉపయోగించిన ఎత్తుగడలనే ఈ క్లెయిమ్‌లలో వాడుతున్నారు. అవి రాజకీయ, మత లక్ష్యాల కోసం మధ్యయుగాల చరిత్రను ఆయుధంగా మార్చటం. మధ్యయుగాల్లో దేవాలయాలను కూల్చి మసీదులు నిర్మించారనే తప్పు ప్రాతిపదికలనే ఉపయోగిస్తున్నారు. ఈ వాదనలను న్యాయస్థానాలు అనుమతించటం 1991లో పార్లమెంటు ఆమోదించిన 'ఆరాధనా ప్రదేశాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని నేరుగా సవాలుచేయటమే. బాబ్రీ మసీదు కేసు మినహా మిగతా మత ప్రదేశాలకు 1947 ఆగస్టు 15న ఉన్న స్థితిని పరిరక్షించేందుకు ఆ చట్టం ఉద్దేశించింది. 1992 డిసెంబర్ 6న బాబ్రీమసీదు కూల్చివేత బిజెపి పలుకుబడి అమాంతం పెరుగుదలకు, కేంద్రంలో తొలుత 1996లో, తిరిగి 1999లో, అటు తర్వాత 2014 నుంచి అది అధికారంలోకి రావటానికి తోడ్పడింది. ఇది తెచ్చిన మత విభజన హిందూ జాతీయవాదం బలపడేందుకు బాటవేసింది. హిందూ మితవాద మేధావులు ఇప్పుడు ఒక యూనివర్శిటీ కూల్చివేతకు ఎసరుపెట్టారు. ఈ ప్రతిపాదిత కూల్చివేత అదనపు ప్రయోజనం చేకూర్చుతుంది. అది ముస్లిం సమాజాన్ని అప్రతిష్టపాల్జేయటం, వారికి అత్యావశ్యకమైన విద్యను దూరం చేయటం.

ఇదే పద్ధతిలో సహరాన్‌పూర్‌లో కొద్దిపాటి స్థలంలో ఉన్న ఒక పురాతన మసీదుకు కూడా – తగిన అనుమతులు లేవనే కారణంతో ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు. అక్రమ నిర్మాణాలని ముస్లిం కట్టడాలకు ముద్రవేయటం, కూల్చివేయటం నిరంతర ప్రయత్నంగా కొనసాగుతున్నది. నిర్దాక్షిణ్యంగా బుల్‌డోజర్లు ఉపయోగించటం, సమాజంలో మరింత ప్రజాదరణ సంపాదించటం ముస్లిం సమాజాన్ని మూలకు నెట్టటానికి సాధనంగా ఉపయోగిస్తున్నారు. కూల్చివేతలే వారి 'దేశ నిర్మాణం'గా కనిపిస్తున్నది.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి



- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లను కుట్టించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, దీనిపై జిల్లా, మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని ఆయా జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. 'స్కూల్ యూనిఫామ్‌ల తయారీ, పంపిణీ, ఎల్‌నినో' నేపథ్యంలో చేపట్టిన ప్రత్యామ్నాయ ప్రణాళికపై హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐఎండి నివేదికల ప్రకారం దేశంలోనే ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం ఒకటని, ఇప్పటి వరకు రాష్ట్రంలో 27 శాతం లోటు వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. కేవలం 7 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగతా 385 మండల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుకు వివరించారు. వాతావరణ వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నామని, కర్నాటక, మహారాష్ట్రలలో కూడా వర్షాలు ఆశాజనకంగా లేవని, ప్రస్తుతం మేజర్ రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటికి నిల్వ చేస్తున్నామని వారు తెలిపారు. వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించే విధంగా చూడాలని అధికారులకు సంజయ్‌జాజు సూచించారు. ఇప్పటివరకు వరి సాగు 24 శాతం కంటే తక్కువ నమోదైందన్నారు. సెప్టెంబర్ మాసంలోనూ వర్షాలు అతి తక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసిందని, అందుకే వరి పంటకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించే విధంగా వాటి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభిస్తునే విషయాన్ని రైతులను చైతన్య పర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో ఫామ్ పాండ్స్‌ల నిర్మాణం విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతీ 45 రోజులకు ఒక సారి ఖచ్చితంగా మండల సమావేశాలను నిర్వహించే విధంగా సంబంధిత అధికారులు ప్రణాకళిలను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను సంజయ్‌జాజు ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ళు, రెసిడెన్షియల్ పాఠశాలలోని ప్రతి విద్యార్థికీ రెండు యూనిఫాముల చొప్పున నెలరోజుల్లోగా యూనిఫాములను అందజేయాలని ఆదేశించారు. యూనిఫామ్‌లను కుట్టించడానికి 26 వేలమంది స్వయం సహాయక బృందాల మహిళలను గుర్తించామని అధికారులు సిఎస్‌కు వివరించారు. స్కూల్ యూనిఫామ్‌ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, విద్యార్థులకు అందిన స్కూల్ డ్రెస్‌లు, షూస్ తదితర స్కూల్ కిట్స్‌ల నాణ్యతపై నేరుగా పాఠశాల విద్యార్థుల నుండే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సిఎం ఆదేశించిన విషయాన్ని సంజయ్ జాజు గుర్తుచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, దానకిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపీ, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పాల్గొన్నారు.

# దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తాం


- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా :ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు
- వరంగల్‌లో ఘనంగా ఎబి బర్ధన్ భవనం ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ :** దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం వరంగల్ నగరంలోని మార్కండేయ నగర్‌లో నిర్మించిన సిపిఐ కార్యాలయం ఏబీ బర్ధన్ భవనాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని మతోన్మాద శక్తుల నుండి, కార్పొరేట్ అనుకూల పాలకుల నుండి కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. నేడు అవినీతి, అసమర్థ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ యువతరం గళం విప్పుతున్నదని, డిల్లీలో నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ రోజుల తరబడి విద్యార్థి, యువకుల ఆందోళనే ఇందుకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలోని అసమర్థ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోరాడుతాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న భూములలో పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ మహానగరంలో అనేకమంది భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తూ చలామనవుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిలువ నీడ లేని నిరుపేదలు కిరాయి కట్టలేక ప్రభుత్వ భూములు చెరువులలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే పేదల ఇండ్లను కూల్చివేయడం సరికాదని వారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పేదల ఇండ్లను కూల్చడం సరికాదని, తక్షణమే పేదల ఇండ్ల కూల్చివేతను ఆపాలని పేదలు వేసుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదేనని, పేదల ఇండ్ల కూల్చివేతను ఆపడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని, ఎరుపుకు మరణం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ లు ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని తెలిపారు మార్కండేయ నగర్ శాఖ కార్యదర్శి ఎండి అక్బర్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె బాస్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి విజయ్ సారధి, కర్రె బిక్షపతి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, తోట బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

- మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహిస్తున్న శాంతియుత నిరసనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లో పాల్గొనవద్దంటూ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) యాజమాన్యం అడ్వైజరీ జారీ చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, గత 20 రోజులుగా విద్యార్థులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించడం లేదని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంతో తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను వెంట నే ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, వారికి న్యాయం జరిగేలా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, నీట్ పేపర్ లీకేజీ బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# బాధ్యులపై కేంద్రం తక్షణమే కఠిన చర్యలు

- టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్ట పరిహారాన్ని ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'నీట్ పరీక్ష'లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ టిజెఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్, లిబర్టీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో, ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ టిజెఎస్ ప్రతినిధి బృందం శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జరుగుతున్న నిరసనలో పాల్గొని, తమ మద్దతును ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర రావు, సయ్యద్ సలీమ్ పాషా, మాసంపల్లి అరుణ్ కుమార్, అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, ఆశప్ప, పల్లె వినయ్ కుమార్, టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.


# పాత్రికేయులపై దాడులను ఖండించిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్

- సుమోటోగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయవ్యవస్థకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పాత్రికేయులపై జరిగిన దాడులు, బెదిరింపులు, అధిక బలప్రయోగాన్ని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో వార్తలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని పేర్కొంటూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను కవర్ చేస్తున్న టివి రిపోర్టర్లు, ఫీల్డ్ జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఫెడరేషన్ అధ్యక్షుడు గౌతమ్ లహిరి, ప్రధాన కార్యదర్శి సౌరభ్ దుగ్గల్ తెలిపారు. ఫీల్డ్ విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్లను సంపాదకీయ విధానాలకు బాధ్యులుగా చూడటం సరికాదని, మీడియా సంస్థల యాజమాన్యాలు కూడా తమ ఫీల్డ్ రిపోర్టర్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) నిరసనకారులు, జర్నలిస్టులపై షాక్ బాటన్లు, పెల్లెట్ గన్స్, మేకులతో కూడిన బాటన్లను ఉపయోగించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో ఔట్‌లుక్ మ్యాగజైన్‌కు చెందిన ఒక జర్నలిస్టు పెల్లెట్ గాయాలకు గురైనట్లు ప్రకటనలో వెల్లడించారు. అలాగే, సంఘటనల సమయంలో కొందరు ఆర్ఎఎఫ్, ఢిల్లీ పోలీసు సిబ్బంది తమ నేమ్ బ్యాడ్జ్‌లు తొలగించుకున్నట్లు వీడియోలు, ఫోటోలు సూచిస్తున్నాయని, ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ఫెడరేషన్ పేర్కొంది. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనల్లో పలువురు జర్నలిస్టులు గాయపడిన నేపథ్యంలో, న్యాయవ్యవస్థ స్వయంప్రేరితంగా (సుయో మోటో) కేసు నమోదు చేసి, స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తన ప్రకటనలో డిమాండ్ చేసింది.

# ధర్నాచౌక్‌ను ఎత్తేసిన బిఆర్‌ఎస్‌కు అక్కడ ధర్నా చేసే హక్కు ఎక్కడిది?

- కెటిఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలి: టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు అదే పార్టీ ధర్నాల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముందుగా కెటిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ధర్నా చేసే హక్కు గురించి మాట్లాడే ముందు ధర్నా చౌక్‌ను తొలగించిన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేసుకోవాలని, అక్కడ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రస్తుతం ధర్నా చౌక్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు ఎలా జరుగుతున్నాయో కెటిఆర్ అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ వయసులోనూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విద్యార్థుల పక్షాన పోరాడుతుంటే, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. బిఆర్‌ఎస్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకుల పరంపర సాగిందని, ఒక్క నోటిఫికేషన్‌ను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని ఆరోపించారు. గ్రూప్1 పరీక్షలు కూడా లీకుల బారిన పడ్డాయని అన్నారు. బిఆర్‌ఎస్ రాజకీయ డ్రామాల్లో విద్యార్థులు భాగస్వాములు కావద్దని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ధర్మేంద్ర క్షమాపణ చెప్పారు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేపర్ లీక్ వెలుగులోకి వచ్చిన వెంటనే సిబిఐ 11 మంది ఫ్యాకల్టీతో సహా మొత్తం 17 మందిని అరెస్టు చేసిందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పి సిబిఐకి స్వయంగా లేఖ రాశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా 40 రోజుల్లోనే పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని, రేపటి నుంచి కౌన్సెలింగ్ కూడా ప్రారంభం కానుందన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందని, ఈ అంశాన్ని రాజకీయం చేస్తూ విద్యార్థుల ముసుగులో కొందరు అసాంఘిక శక్తులు ఢిల్లీలో అల్లర్లు సృష్టించాయన్నారు. ఈ అలజడికి పాకిస్తాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్‌లను ఢిల్లీ పోలీసులు బ్లాక్ చేశారని, దేశవ్యతిరేక శక్తుల హస్తం ఉందని అనుమానిస్తున్నామని చెప్పారు. గత యుపిఏ హయాంలో, అలాగే రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో అనేకసార్లు పేపర్ లీకేజీలు జరిగినా అక్కడి సిఎంలు ఎవరూ రాజీనామా చేయలేదని, మరి ఇప్పుడు మాత్రం ప్రధానిని రాజీనామా అడగడం ద్వంద్వ ప్రమాణాలేనని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, అంజి రెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, వేముల అశోక్ పాల్గొన్నారు.

# మోదీ ఎందుకు నోరు విప్పడం లేదు

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పరీక్ష పేపర్ లీక్ విషయంలో విశ్వ గురువుగా చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎందుకు నోరు విప్పడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. విద్యార్థుల డిమాండ్ మేరకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపినట్టు చెప్పుకునే వాళ్లు పిల్లల కన్నీళ్లు ఆపలేరా?, ఆ పిల్లలపై జరుగుతున్న దాడిని ఆపలేరా అని అన్నారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టికానికి నిరసనగా విద్యార్థులకు సంఘీభావంగా బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని, విద్యార్థులపై చేసిన దాష్టికానికి అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. యువత ఆందోళన, ఆగ్రహం కేవలం ఒక పేపర్ లీక్ అంశానికే సంబంధించింది కాదని, 12 ఏళ్లుగా కేంద్రప్రభుత్వం చేస్తున్న మోసాలు, ద్రోహాలపైన ఆగ్రహమని అన్నారు. అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్న తీరును యువతరం అర్థం చేసుకున్నదన్నారు. దేశంలో కేంద్రమంత్రుల కొడుకులు అత్యాచారాలకు పాల్పడితే వెంటనే బెయిల్ వస్తున్నాయని, పేపర్ లీకులపై ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎవరితోనైతే పెట్టుకోకూడదో వారితోనే( యువత) ప్రధాని మోదీ పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ జాగ్రత్తపడాలని, దేశ వ్యాప్తంగా యువత స్వరం మారుతున్నదని, ఇక రాజ్యం ఉలికి పడాల్సిందేనని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ, 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేనందుకే యువతరం బయటికి వచ్చిందన్నారు.

మేకిన్ ఇండియా కావాలని అడిగితే, బిజెపి మాత్రం 'లీక్ ఇన్ ఇండియా'ను ఇచ్చిందని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో పోరా టం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీగా తాము విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉండాలని అనుకున్నామన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, ఎజెండాలతో విద్యార్థులు, యువత ఉద్యమాన్ని కలుషితం చేయవద్దని సూచించారు. విద్యార్థులు అడిగిన దాంట్లో అన్యాయం ఏముందని?, వారు కేవలం తమకు న్యాయం చేయాలని, తమ భవిష్యత్తును కాపాడాలని మాత్రమే అడిగారని అన్నారు. నీట్ పరీక్షా పత్రం పేపర్ లీక్‌తో పాటు విద్యారంగంలో సంస్కరణ రావాలని సోనమ్ వాంగ్చుక్ నిరసనకు కూర్చున్నారని కెటిఆర్ గుర్తు చేశారు. ప్రధాని మోదీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్‌ను ఎందుకు పంపించి తనను అడ్డుకుంటున్నారో సిఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.



# 'నీట్' విద్యార్థులకు న్యాయం చేయాలి

- ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, తమ భవిష్యత్తు, విద్యా హక్కుల పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గళాన్ని అణచివేయడానికి పోలీసు బలగాలను వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నీట్ పరీక్ష వ్యవస్థలో పూర్తి పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు ఖండిస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య హక్కు కోసం పోరాడుతున్న విద్యార్థులకు న్యాయవాదులు, ప్రజాస్వామ్య శక్తులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని బొమ్మగాని ప్రభాకర్ స్పష్టం చేశారు.

# సింగరేణి భవిష్యత్‌కు ప్రభుత్వం అండ

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సంస్థ భవిష్యత్ కోసం ప్రభుత్వ సంపూర్ణ సహకారం అందుతుందని ఉప ముఖ్యమంత్రి మలు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్, టిఎస్ జెన్‌కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడం, లాభాల బాటలో నడిపించుకోవడం పోటీ ప్రపంచంలో మరింత బలోపేతం చేయడం అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అధికారులు ఉద్యోగులు కార్మికులు యాజమాన్య సమిష్టి బాధ్యతని భట్టి అన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థను కాలానుగుణంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తి రంగంలో సింగరేణిదే ఏక ఛత్రాదిపత్యమని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడంతో అనేక ప్రైవేటు సంస్థలు రంగంలోకి రావడంతోనే పోటీ తీవ్రంగా పెరిగిందన్నారు. గత దశాబ్ద కాలంలో ఆశించిన పురోగతి లేదని, యాదాద్రి, భద్రాద్రి తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్తబొగ్గు బ్లాకులను గుర్తించి వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 20 ఏళ్లలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోనున్న నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గుకే పరిమితం కాకుండా థర్మల్ పవర్, సోలార్ గ్రీన్ హైడ్రోజన్ బ్యాటరీ స్టోరేజ్ గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కూడా విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇకపై సింగరేణి బోర్డు సమావేశాలు కేవలం పరిపాలనా అంశాలకు పరిమితం కాకుండా సంస్థ విస్తరణ పెట్టుబడులు సాంకేతిక ఆధునీకరణ అభివృద్ధిపై చర్చించే వ్యూహంగా మారాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌సిసిఎల్ చైర్మన్ బుద్ధ ప్రకాష్ జ్యోతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి బొగ్గు ఉత్పత్తి కొత్తగనుల అభివృద్ధి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఆధునిక సాంకేతికత వినియోగం ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణ సంస్థ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్ అంకిత్ వైరా ఎమ్మెల్యే రామ్‌దాస్ నాయక్, ఎస్‌సిసిఎల్ డైరెక్టర్ గౌతం పోత్రు, టిఎస్ జెన్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, జనరల్ మేనేజర్లు డైరెక్టర్లు పాల్గొన్నారు.

**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము, పెద్దపల్లి**
జిల్లా : పెద్దపల్లి - 505172

లేఖ నెం.వ్య.మా.క /పెద్దపల్లి /02/2024-25 | దుకాణా సముదాయం టెండర్ ప్రకటన | తేది: 23.07.2026

ఇందు మూలముగా పెద్దపల్లి పట్టణ వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా, వ్యవసాయ మార్కెట్ కమిటి, పెద్దపల్లి యార్డ్ నందు నిర్మించబడిన మొత్తం (13) వాణిజ్య దుకాణములను రిజర్వేషన్ ప్రాతిపాదికన అద్దె పై BC లకు (02), SC లకు (2) ST లకు (1) మరియు ఇతరులకు (7) దుకాణములను తేది : 03.08.2026 రోజున ఉదయం 11.00 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పెద్దపల్లి నందు ఓపెన్ ఆక్షన్ (Open Auction) ద్వారా కేటాయించుటకు వేలం నిర్వహించబడును.
1. ఒక్కొక్క వాణిజ్య దుకాణముకు ప్రభుత్వం నిర్ణయించిన ధర నెలకి అద్దె **రూ.15462/-**
2. దరఖాస్తు ఫారాల అమ్మకము తేది : 25.07.2026 నుండి 31.07.2026 వరకు
3. దరఖాస్తు ఫారాల స్వీకరణ తేది : 26.07.2026 నుండి 31.07.2026 వరకు మాత్రమే

దరఖాస్తు ఫారము మరియు నియమ నిభందనల కొరకు రూ.3,000/- చెల్లించి సంబందిత కార్యాలయ పనివేళలలో పొందవచ్చును ఇతర సమాచారం కొరకు Mobile. No. 7330733468, 7330733318కు సంప్రదించగలరు.
*గమనిక :- 1. దరఖాస్తు ఫారము రూ.3,000/- తిరిగి చెల్లించబడవు.*
*2. వేలం పాట ప్రారంభ ధర రూ.15462/-*

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి,
వ్యవసాయ మార్కెట్ కమిటీ,
పెద్దపల్లి.

DIPR R.O. No. : 6626-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| క్ర. సం. | NIT No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 1 | NIQ No. 01/ EE/CIR-32/ GZ/GHMC/ 2026-27, Date: 23.07.2026 | వివిధ ఏజెన్సీలు/ సంస్థలు/ సరఫరాదారుల నుండి(Non-SOR అంశాలకుసంబంధించి) సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనవి. (మరిన్ని వివరాలను https://ghmc.gov.in/Tenderspage.aspx లోని టెండర్ నోటిఫికేషన్లలో చూడవచ్చు). | ప్రారంభ తేది: 24.07.2026 ఉ.11:00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 30.07.2026 మ.3:00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-32, జిజెడ్, ఖైరతాబాద్ జోన్. సెల్ నెం. 9989930651 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
సర్కిల్-32, జిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6630-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026

## షాద్‌నగర్ అసెంబ్లీలో 80శాతం సర్‌ప్రక్రియ పూర్తి

### తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతోనే సర్ ప్రకియను 80శాతం పూర్తి చేశామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఇప్పటి వరకు 80శాతం సర్ ప్రకియను పూర్తి చేశామని, ఒక లక్షా99వేల 311మంది ఓటర్లకు మ్యాపింగ్ సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 244426మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయగా 1లక్షా99వేల311మందికి ఓటర్ మ్యాపింగ్ చేశామని వివరించారు. దాంతో ఇప్పటి వరకు 80శాతం సర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండటం, ఓటర్ల వివరాలు తెలియక పోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. సమావేశంలో రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, జాకారం శేఖర్, రమేష్, కుమారస్వామి గౌడ్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో కెటిఆర్ పాత్ర కీలకం

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**పజాపక్షం/షాద్‌నగర్:** రాష్ట్ర అభివృద్ధిలో మాజీ మంత్రి కెటిఆర్ పాత్ర కీలకమైందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కెటిఆర్‌ను కలిసి పూలబోకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్‌లో అనాథలకు, వృద్ధులకు, దుప్పట్లతోపాటుభోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, బిఎస్ సుధీర్, గౌస్‌జానీ, మాజీ కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి (చింటూ), ఈశ్వర్‌రాజు, కానుగు అనంతయ్య, మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి, దినేష్‌సాగర్, సరికొండ మల్లేష్, బాదేపల్లి గోపాల్ గౌడ్, అశోక్, సంతోష్ యాదవ్, వసీం, సురేష్, అరుణ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

### టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో శుక్రవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఆంజనేయులు, దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ సిఐగా లక్ష్మీరెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** షాబాద్ సిఐగా లక్ష్మీ రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండల ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతలు కాపాడుతామని పేర్కొన్నారు. ఇండ్రస్టియల్ ఉన్న ప్రాంతాల్లో గస్తీలు నిర్వహించి ఎలాంటి సంఘటనలు జరగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. గ్రామాల్లో అనుమానితులు ఎవరైన అనుమానస్పందగా తిరుగుతుంటే పోలీస్‌స్టేషనుకు సమాచారం ఇవ్వాలని ఆయప తెలిపారు.

## ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్ పల్లి పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో శుక్రవారం బిఆర్‌ఎస్ నేతలు రాష్ట్ర బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శంకర్‌పల్లి మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి నాయకత్వంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఏఎంసి చైర్మన్లు మాణిక్ రెడ్డి, రాజు నాయక్, కౌన్సిలర్లు వసంత మహేందర్ రెడ్డి, భానూరి కృష్ణ యాదవ్, సర్పంచులు నివేదిత ఇంద్రసేనారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అర్చన ప్రభు గౌడ్, న్యాయవాది ఉపేందర్ రెడ్డి, నాయకులు వి.వాసుదేవ్ కన్నా, లక్ష్మీ నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యాదగిరి, గోసాడ నరసింహారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,సుధాకర్,శ్రీకాంత్,మాజీ కౌన్సిలర్లు గండేటి శ్రీనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** కెటిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖజాగూడ బిఆర్‌ఎస్ కార్యలయంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో కెక్ కట్ చేసి కెటిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ సెంటర్‌కు సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, అంగన్‌వాడీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వరద ముప్పు లేకుండా చర్యలు వేగవంతం

### డీసిల్టింగ్ పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరద ముప్పు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అన్నారు. నగరంలో వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో చేపడుతున్న వరద కాలువల పునరుద్ధరణ, డీసిల్టింగ్ పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదట గచ్చిబౌలి చౌరస్తా సమీపంలోని ఖాజాగూడ చెరువుకు వెళ్లే వరద కాలువలను కమిషనర్ పరిశీలించారు. ఈవర్షాకాలం ప్రారంభంలో ప్రిస్టన్ ప్రైమ్ మాల్ ఎదుట నీరు నిలిచిన ప్రాంతాన్ని సందర్శించి, ప్రస్తుతం పరిస్థితిని సమీక్షించారు. ఖాజాగూడ చెరువుకు వెళ్లే బాక్స్ నాలాలో ఒక వెంట్ పూర్తిగా పూడుకుపోయినట్లు గుర్తించి, అక్కడ డీసిల్టింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే బాక్స్ డ్రైన్‌కు అనుసంధానంగా ఉన్న వరద కాలువలను కూడా తనిఖీ చేశారు. ఇప్పటికే చేపట్టిన ముందస్తు చర్యల కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు ఆప్రాంతంలో ఎక్కడా నీరు నిల్వ కాలేదని అధికారులు కమిషనర్కు వివరించారు. ఓల్డ్ బొంబే హైవే కిందుగా వెళ్లే బాక్స్ డ్రైన్‌లలోని రెండు వెంట్లలో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగిస్తే భవిష్యత్తులో వరద ముప్పు ఉండదని తెలిపారు. కొం డాపూర్ చౌరస్తాలోని ఎఎంబి మాల్ ఎదురుగా ఉన్న అండర్‌పాస్‌ను కమిషనర్ పరిశీలించారు. ఇటీవల వర్షం సమయంలో అక్కడ నీరు నిలవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్‌పాస్‌లో ఏర్పాటు చేసిన రెండు ఆటోమేటిక్ పంపులు పనిచేయకపోవడంతోనే సమస్య తలెత్తిందని అధికారులు వివరించగా, వెంటనే వాటిని మరమ్మతు చేసి పనిచేసేలా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమైన అండర్‌పాస్‌లో నీరు నిలిస్తే ఐటి కారిడార్ అంతటా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అలాంటి పరిస్థితి మళ్లీ తలెత్తకుండా ముందస్తుచర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించేందుకు 25 హెచ్‌పి సామర్థ్యమున్న పంపులను సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. వరద కాలువలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోటచర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. పర్యటనలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు ట్రాఫిక్, సిఎంసి,జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు



### -రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిర్ణీత గడువులోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అధికారుల సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ,పంటల సాగు, సీజనల్ పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న పాఠశాలలు గురుకులాలలో 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్య అభ్యసించే విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు ఆగస్టు 25వ తేదీలోగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అధికారుల సమన్వయంతో పని చేయాలని ప్రతి మండలంలో పాఠశాలల వారీగా యూనిఫాం తయారీ పనులకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా సాధించాలన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా సాధించాలన్నారు. యూనిఫాం తయారీలో నాణ్యత తో పాటు లక్ష్య సాధన కూడా సమానంగా క్వాలిటీ కూడా ముఖ్యమని తెలిపారు. వస్త్రాల స్వీకరణ, బల్క్ కటింగ్, విద్యార్థుల కొలతల ప్రకారం వ్యక్తిగత కటింగ్, కుట్టింపు,పరిశీలన, పాఠశాలలకు అప్పగింత వరకు ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సి హెచ్ కృష్ణారెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు,జిల్లా వ్యవసాయ అధికారి సుజాత,పిడి మెప్మా వెంకట నారాయణ,సంబంధిత ఆర్‌సిఒలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొకిలా పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్

### మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన ఉండాలి - చేవెళ్ల ఎసిపి బి.కిషన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి/శంకర్‌పల్లి:** ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ తరుణ్ జోషి, ఆదేశాల మేరకు, చేవెళ్ల డిసి పి యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో మొకిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్ ఫేజ్II ప్రాంతంలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో సుమారు 100 ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా గుట్కా ప్యాకెట్లు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ చలాన్లను చెల్లించేలా చర్యలు చేపట్టారు. పాపిలాన్ బయోమెట్రిక్ పరికరం ద్వారా అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను పరిశీలించి వారి వివరాలను ధృవీకరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ అనంతరం చేవెళ్ల ఎసిపి బి.కిషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒటిపిలు, బ్యాంకు ఖాతా వివరాలు,ఎటిఎం పిన్ లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసుశాఖ అందిస్తున్న అత్యవసర సేవలు, భద్రతాచట్టాలపై అవగాహన కల్పించి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మొకిలా ఎస్‌హెచ్‌ఓ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ మీర్ ముదాసిర్ అలీ, మొయినాబాద్ డిఐసిహెచ్. ఉపేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై ప్రధాని, విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలి

### బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ సహా ప్రశ్నపత్రాల లీకేజిల అంశంపై బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజికి నిరసనగా బిఎస్‌పి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 26 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, వారిపై ఎన్‌ఎస్‌ఏ ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని అన్నారు. తెలంగాణలో టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీకి అప్పటి బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. పేపర్ లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులను సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## టిఒఎటి అధ్యక్షుడిగా కార్తికేయన్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (టిఓఏటి) నూతన కమిటీ ( 2026–2028 కాలానికి) ఎన్నికైంది. దిపు కార్తీకేయన్ అధ్యక్షుడుగా, సాయికిషోర్ ఉపాధ్యక్షుడిగా, సయ్యద్ ముర్తజా అలీ జాతీయ కార్యదర్శిగా, ఎండి.రియాజ్ కోశాధికారిగా, కృపామణి సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు శుక్రవారం టూర్ ఆపరేటర్స్ ఆఫ్ తెలంగాణ అసోసియేషన్ ప్రకటించింది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి టిఓఏటి నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలోకి నడిపించడంలో నూతన కమిటీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణను ఒక ప్రముఖ పర్యాటక గమ్యస్థలంగా ప్రచారం చేయడం వంటి దిశల్లో గుణాత్మక, ఉత్సాహభరితమైన పదవీకాలాన్ని పూర్తి చేయాలని అభిలషించారు. ఎన్నికల సంఘం అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు మిర్ లియాకత్‌అలీ ఎన్నికల ప్రక్రియను అత్యున్నత వృత్తిపరమైన, నిష్పక్షపాతతత్వంతో, సామర్థ్యంతో నిర్వహించినందుకు టిఓఏటి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## రేడియల్ రోడ్డు భూనిర్వాసితులకు పరిహారం అందజేత : ఆర్‌డిఒ



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కొల్పోతున్న రైతులకు రూ.2కోట్ల పరిహారం చెల్లించినట్లు షాద్‌నగర్ ఆర్‌డిఒ ఎన్ఆర్ సరిత తెలిపారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని చుక్కమెట్ గ్రామానికి రైతులకు రూ.2కోట్ల పరిహారం బ్యాంక్ ఖాతాలో జమచేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ సరిత మాట్లాడుతూ రేడియల్ రోడ్డు నిర్మాణంలో చుక్కమెట్టు గ్రామానికి చెందిన రైతుల నుండి తొమ్మిది ఎకరాల భూమి తీసుకోవడం జరిగిందని, అందుకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం కింద రూ.2కోట్ల నిధులను రైతుల బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అదేశాల మేరకు రైతుల ఖాతాలో నగదు జమ చేసినట్టు వివరించారు.

## విదేశీయుల కుట్రలతోనే దేశంలో అల్లర్లు, హింసలు

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భారతదేశంలో విదేశీలు చేస్తున్న కుట్రల కారణంగానే అల్లర్లు, హింసలు సాగుతున్నాయని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ఏబి కాంప్లెక్స్‌లో జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న దేశంలో అల్లర్లు, విధ్వంసం సృష్టించేందుకే విదేశీయులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అల్లర్లు చేసే వ్యక్తులకు పూర్తి స్థాయిలో ఆర్థిక వనరులు కల్పిస్తున్నారని వివరించారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకొని దేశంలో శాంతిభద్రలకు విఘాతం కలిగించే విధంగా రాహుల్‌గాంధీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం లక్ష్యం లేకుండా పక్కదారి పట్టించారని, ఈ ఉద్యమాన్ని ఎవరు దారి మళ్లీస్తున్నారో స్థానికంగా ఉన్న మీడియా కెమెరాలను చూస్తే అర్థమవుతుందని వివరించారు.

### రేవంత్‌రెడ్డి, కెటిఆర్‌లు రాజకీయ డ్రామాలు అడుతున్నారు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌లు కలిసి రాజకీయ డ్రామాలు అడుతున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో గ్రూప్..1, ఇంటర్ పరీక్ష పత్రాలు లీకేజీ కాలేదా..అందుకు రాష్ట్ర వ్యాప్తంగా 27మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోలేదా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై కెటిఆర్ ఎందుకు స్పందించలేదని, రాజీనామా ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. యువత జీవితాలతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ చెలగాటం అడుతున్నాయని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి రఘునాథ్, మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెవిఎస్ రత్నం, మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కొప్పుభాషా, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, అర్జున్‌రెడ్డి, శ్రీధర్, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్ గుప్తా, నర్సింహాగౌడ్, మల్లారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.


## వామపక్ష విద్యార్థి సంఘాల విద్యాసంస్థల బంద్ విజయవంతం





**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, ఎన్‌ఎస్‌యుఐ, బీసి జనసేన విద్యార్థి విభాగం నేతలు విద్యాసంస్థల బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలపై సమాగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సభ్యుడు ఆకాష్‌నాయక్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డ శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యుఐ నాయకుడు బిలాల్, బిసి జనసేన విద్యార్థి విభాగం నేత అఖిల్, నాయకులు అదిల్, చరణ్, శివ, రాంచరణ్, రోహిత్, సృజన్, వంశీ, రహన్, ప్రవీణ్, వికాస్, నాయకులు నూతన్, హర్షిత్, గణేష్, పవన్, సాయి, చవాన్ పాల్గొన్నారు.

**హయత్‌నగర్:** నీట్ అవకతవకలకు, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామాచేయాలని ఎఐఎస్‌ఎఫ్ సరూర్‌నగర్ మండల కార్యదర్శి వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీ లో విద్యార్థులపై పోలీసులు అరాచకంగా లాఠీఛార్జ్ చేయడాన్ని ఖండిస్తూ సరూర్‌నగర్ మండలంలో నిర్వహించిన కళాశాలలు విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్.బాలు నాయక్, శివ పాల్గొన్నారు..



## 'సర్'ను సమీక్షించిన డిసిసి అధ్యక్షులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఓటరు నమోదు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి వార్డు కార్యాలయం, ఎస్‌వి నగర్ కాలనీలలో నిర్వహించిన సర్ ప్రక్రియను పరిశీలించి ఇప్పటివరకు జరిగిన ఫారాల పంపిణీ, ఓటర్ల నుండి సేకరించిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటరు ఫారాలను నింపి తప్పని సరిగా బిఎల్‌ఓలకు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు నమోదుపై పోచారంలో ఫోకస్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పోచారం డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ అన్నోజిగూడలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఎస్ఐఆర్ సహాయ కేంద్రాన్ని కమ్యూనిటీ హాల్‌ను సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు పూర్తయ్యేలా బూత్‌స్థాయి ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ ఇన్‌చార్జి దుర్గా, మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బూత్ ఇన్‌చార్జి కొంతం శంకర్ రెడ్డి, కె సురేష్ చరణ్ నాయక్,పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్రె రాజేష్ పిలుపునిచ్చారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వర్లు మృతి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సింగరేణిలో అండర్ మేనేజర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన కె.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా మృతి చెందారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలో చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఆయన గతంలో గోదావరిఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు 3 గనిలో విధులు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మృతి వార్త తెలిసిన వెంటనే సింగరేణి పదవీ విరమణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పదవీ విరమణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, కొట్టే మల్లయ్య, ఎస్ లక్ష్మీ నారాయణ, ఎం. రాజా, నర్సు, తదితరులు వెంకటేశ్వర్లుకు ఘనంగా నివాళులర్పించారు.




## నకిలీ స్థిరాస్తి పత్రాలతో బ్యాంకులకు టోకరా : 8 మంది ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** భూ యజమానుల పేర్లు సేకరించి వారి పేర్లతో నకిలీ స్థిరాస్తి పత్రాలు సృష్టించి వాటిద్వారా బ్యాంకుల నుండి అందినకాడికి రుణాలు తీసుకొంటున్న ముఠా కటకటాలపాలైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలో మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, ఎసిపి చక్రపాణి, సిఐ ఆంజనేయులు, డిఐ రమేష్‌లతో కల్సి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు తెలియచేసారు. అరెస్టయిన నిందితులు ఎనిమిది మంది ఓ ముఠాగా తయారై నకిలీ సేల్ డీడ్లు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, అగ్రిమెంట్ ఆఫ్ సేల్ పత్రాలు, మెమొరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ తదితర నకిలీ పత్రాలను కంప్యూటర్ ద్వారా తమ పేర్లతో తయారు చేస్తుంటారు. వాటిని బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలకు వెళ్లి రుణాలు కావాలంటూ వెళ్లి నకిలీ పత్రాలు సమర్పించటం ద్వారా ఎంత వస్తే అంత మొత్తం రుణం తీసుకొంటుంటారని, ఈ విధంగా ఇప్పటివరకు నిందితులు వివిధ బ్యాంకుల నుండి రూ.4.11 కోట్ల రుణాలు పొందినట్లు తేలిందన్నారు. మరింత లోతుగా కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సహించం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వైద్య సేవల్లో నిర్లక్ష్యం కనపరిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామంటూ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరించారు.శుక్రవారం ఆయన కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ ఉన్న రోగులతో నేరుగా మాట్లాడి ఏ మేరకు వైద్య సేవలందుతున్నాయని, ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన అక్కడి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, మాతా శిశు ఆరోగ్య సేవలు,క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం, ఔషధాల లభ్యత తదితర విషయాలను రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణీలను క్రమం తప్పకుం డా పరీక్షిస్తూ ప్రభుత్వం అందించే పోషకాహారాలను అందిస్తుండాలన్నారు.



### సిఎంసి స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయాలు..

# ప్రజా సంక్షేమానికి గ్రీన్ సిగ్నల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) 6వ సాధారణ స్థాయీ సంఘం సమావేశంలో నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సేవల బలోపేతం, ప్రజా సంక్షేమం, సుస్థిర పట్టణాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఎంఏయుడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ డాక్టర్ జి.సృజన, జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నగర రహదారి మౌలిక వసతుల విస్తరణలో భాగంగా ఎన్‌హెచ్ 65 నుంచి అమీన్‌పూర్ వరకు ప్రతిపాదిత మోడల్ రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్‌లు, డిటిఆర్‌ల మార్పిడికి ఆమోదం లభించింది. ఖైతలాపూర్ ఫ్లైఓవర్ నుంచి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వరకు ట్విన్ బాక్స్ బ్యారెల్, సిసి రోడ్డు నిర్మాణం, అంబీర్ చెరువు నుంచి శ్రీనివాస కాలనీ వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, మయూరి నగర్‌లో బ్యాలెన్స్ బాక్స్ డ్రెయిన్ పనులకు పరిపాలనా అనుమతి మంజూరైంది. అలాగే చందానగర్‌లోని పిజెఆర్ స్టేడియం, అథ్లెటిక్ ట్రాక్ అభివృద్ధికి కూడా కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టణ జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా శేరిలింగంపల్లిలోని అశోక వనం పార్కులో సైబరాబాద్ అర్బన్ బయోడైవర్సిటీ సెంటర్ ఫర్ అవేర్నెస్, రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద ఘన వ్యర్థాల నిర్వహణను బలోపేతం చేసేందుకు పలు కీలక నిర్ణయా లు తీసుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్2027 సన్నద్ధత, బల్క్ వేస్ట్ జనరేటర్ నిబంధనల అమలు, ఐఈసి కార్యక్రమాలు, సామర్థ్యాభివృద్ధి, థర్డ్ పార్టీ మానిటరింగ్ కోసం ఏఎస్‌సిఐ సాంకేతిక సహకారానికి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన అన్ని అజెండా అంశాలకు ఆమోదం తెలుపుతూ తదుపరి చర్యలు చేపట్టాలని కమిటి నిర్ణయించింది.

## రహదారుల ఆక్రమణలు తొలగించాలి

### ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి హయత్ నగర్ సర్కిల్14 పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్యం, పచ్చదనం, రహదారి నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల అమలుపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన అదనపు మట్టి, వ్యర్థాలను వెంట నే తొలగించి రహదారి మార్జిన్‌లను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, పారిశుద్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. రహదారుల వెంట ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్స్‌లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని, మొక్కలు లేని, నిర్వహణ లేని ప్లాంటర్ బాక్స్‌లను తొలగించాలని ఆదేశించారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా రహదారులను ఆక్రమి స్తూ నిర్మించిన అనధికార ర్యాంపులను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాదచారులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా రహదారులను ఆక్రమణల రహితంగా నిర్వహించాలని సూచించారు. అన్ని వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, ఇప్పటికే లైసెన్స్ పొందిన వ్యాపారులు తమ దుకాణాల్లో స్పష్టంగా కనిపించే ప్రదేశంలో లైసెన్సును ప్రదర్శించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పరిశుభ్రమైన రహదారులు, ఆక్రమణల రహిత ప్రజా ప్రదేశాలు, పచ్చదనం, నిబంధనల కచ్చితమైన అమలే మెరుగైన పట్టణ పాలనకు పునాది అని, క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు కొనసాగించాలని సూచించారు.

### వనమహోత్సవం 2026

## లక్ష కుటుంబాలకు ఉచిత పండ్ల మొక్కలు పంపిణీకి హెచ్‌ఎండిఎ ప్రణాళిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం2026లో భాగంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏ) నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ప్రతి ఇంటా పండ్ల మొక్క – ప్రతి కుటుంబానికి పోషకాహారం, నగరానికి పచ్చదనం' అనే నినాదంతో హైదరాబాద్‌లోని లక్ష కుటుంబాలకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణి చేయాలని నిర్ణయించింది. ఇంటి ఆవరణలు, పెరటి తోట లు, టెర్రస్ గార్డెన్‌లలో పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలను పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు అధికారులు సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచేందు కు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి, జా మ, సపోటా, సీతాఫలం, అంజీర్, బొప్పాయి, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు తులసి, కలబంద, కరివేపాకు వంటి ఔషధ మొక్కలను కూడా పంపిణీ చేయనున్నారు. రసాయన రహిత ఆహారం అందుబాటులోకి రావడంతో పాటు కుటుంబ ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా నగరంలో పచ్చదనం పెరిగి జీవవైవిధ్య పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రోటరీ క్లబ్‌లు, లయన్స్ క్లబ్‌లు, ఎన్‌జిఓలు, కాలనీ అసోసియేషన్‌లు భాగస్వామ్యం కావాలని అధికారుల కోరారు. ఈ కార్యక్రమ విజయవంతానికి నగర ప్రజలు సహకరించాలని కోరారు.



## తుది దశకు వంతెన పనులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసారాంబాగ్ అంబర్‌పేట్ మధ్య మూసీనదిపై నిర్మిస్తున్న వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. అంబర్‌పేట్ వైపు పనులు పూర్తి కావడంతో సెంట్రింగ్ తొలగించారు. వచ్చేనెల మొదటి వారంలో బ్రిడ్జిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రిడ్జి పనులను జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్ శుక్రవారం పర్యవేక్షించారు.

## ఆలయ చైర్మన్‌పై హైడ్రాకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/బోడుప్పల్:** మేడ్చల్ జిల్లా ఎంఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 262లోసుమారు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్థానిక బంగారు మైసమ్మ దేవాలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి కుటుంబీకులు కబ్జా చేసారంటూ హైడ్రా అధికారులకు పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డిలు శుక్రవారం ఫిర్యాదు చేసారు. కబ్జాదారులు తమ రాజకీయ పరపతితో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఆ స్థలంలో పదేళ్ల క్రింతం పెద్దపెద్ద షెడ్లు నిర్మించి వాటిని అద్దెకివ్వటం ద్వారా అక్రమంగా సొమ్ము చేసుకొంటున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమి అంటూ స్పష్టంగా ఉందంటూ వాటికి సంబంధించిన పత్రాలను ఫిర్యాదులో జతపరిచారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని కాపడటంతో పాటు కబ్జాదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

## సిసి కెమెరాలు ప్రారంభం : ఎస్‌పి స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండలపరిధిలోని మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి స్నేహమేహ్రా సందర్శించి, మాట్లాడుతూ నేరాలు అదుపునకు సిసి కెమెరాలు దోహదపడుతాయిని జిల్లా ఎస్‌పి అన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభిచారు. సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచు రామేశ్వర్‌ను శాలువతో సత్కరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో మొక్కలు నాటారు. కేసులు పెండింగ్ లేకుండా అన్‌లైన్ లో అప్డేట్ చేస్తు ఉండాలని అదే విధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని సైబర్ నేరగాళ్ల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలనితెలిపారు. ఈకార్యక్రమంలో డిఎస్‌పి అంజయ్య, సిఐ వెంకటేశం, ఎస్ఐ అబ్దుల్ రాహుప్ ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో ఎక్కువ ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగు

### రైతులకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ సూచన



**ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందచేస్తున్న వివిధ రకాల స్కీంల సబ్సిడీపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని ఉద్యాన పంటలసాగుపై దృష్టిపెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల స్కీంలపై అవగాహన కల్పించుకోవాలని కూరగాయలు, పూలు, ఆర్గానిక్ పంటలు వేస్తే ఆదాయం ఎక్కువ వస్తుందని,పెట్టుబడి పెట్టి లాభసాటి పంటలు పండించే విధంగా సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తారని అన్నారు. మదన్‌పల్లిలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనీ సంబంధితఅధికారులకు ఆదేశించారు. ఉద్యాన శాఖ ఎంఐహెచ్ పథకం ద్వారా సెర్ప్‌డి ఆర్‌డిఓ వారి సహకారంతో 400చ.మీ వైశ్యాలంలో అలివేలు అనే మహిళారైతు షెడ్ నెట్‌లో సాగుచేస్తున్న చామంతి పంటను కలెక్టర్ పరిశీలించారు. షెడ్‌నెట్‌లో సాగు చేసే పంటలకు చీడ సమస్యలు రాకుండా బయట పంటలతో పోలిస్తే అధికదిగుబడులువచ్చే అవకాశముంటుందన్నారు. అనంతరం మండలంలోని మదన్‌పల్లి ప్రభుత్వహైస్కుల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ లో భాగంగా పదవ తరగతి భౌతికశాస్త్రంలోని పాఠ్యాంశానికి సంబంధించిన అంశాల ను ఐఎఫ్‌పి ప్యానెల్‌లో ప్రదర్శిస్తూ విద్యార్థుల ద్వారా సమాధానాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు లేనందున వాటిని మంజూరు చేయడానికి ప్రపోజల్ పంపించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, ఉద్యానవనశాఖ అధికారి సత్తార్, ఎండిఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, సర్పంచు విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి, అబ్దుల్‌గని, తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వ చెలగాటం

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ఎఐవైఎఫ్, ఎన్ఎస్‌యుఐ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో పాటు నిరసనలు తెలిపే వారిని అక్రమ అరెస్టులు చేయటాన్ని నిరసిస్తూ ఎఐవైఎఫ్, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లు శుక్రవారం సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా అధ్యక్షులు సల్మాన్ బేగ్, ఎన్ఎస్‌యుఐ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు బి.కిషోర్‌లు మాట్లాడుతూ ఏడాదిపాటు వ్యయప్రయాసలతో కష్టపడి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల ద్వారా తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో ఉన్న లక్షలాదిమంది విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వ తమ అసమర్థతతో చెలగాటమాడుతోందన్నారు. తమ తప్పిదానికి బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రను వెనకేసుకొని రావటం మరింత శోచనీయమన్నారు. ఢిల్లీతో సహ వివిధ రాష్ట్రాల్లో విద్యా మంత్రి బర్తరఫ్ డిమాండ్‌తో ఆందోళనలు చేస్తుంటే వారిపై పోలీసు జులుం ప్రదర్శిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతూ నిరంకుశంగా వ్యవహరిస్తుండటాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా మంత్రిని బర్తరఫ్ చేయటంతో పాటు ఎన్‌టిఎ ఏజన్సీపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, వికాస్‌రెడ్డి, మల్లేష్, ఎన్ఎస్‌యుఐ నేతలు ప్రేమ్‌గౌడ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## నీట్ లీక్‌పై విద్యార్థులు ఆందోళన

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నీట్ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఢీల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్ కేంద్ర ప్రభుత్వ విద్యావిధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల బంద్ విజయవంతమైందని ఎన్ఎస్‌యుఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి నానావత్ శివాజీ నాయక్ తెలిపారు. ఎన్ఎయుఐ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌కు విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజలు మద్దతు తెలిపారని చెప్పారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నీట్ లీక్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కోరారు. బంద్‌లో భాగంగా ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామల అమరేందర్, విశ్వనాథం, ఉదయ్ కుమార్ రెడ్డి, సామల నవీన్,వాలుక లక్ష్మ య్య,కృష్ణ మణి శరణ్, తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్‌కు యత్నించిన యువకుడి అరెస్టు



**ప్రజాపక్షం/ఉప్పల్ :** మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడు లాక్కొని పరారయ్యేందుకు యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఉదంతం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్ నేతాజీ నగర్ ప్రాంతానికి చెందిన డొంకన విమలమ్మ(50) శుక్రవారం ఉదయం పనికి వెళ్లేందుకు నడుచుకొంటూ వెళుతుండగా మార్గమధ్యంలో గోఖలేనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో బైకుపై వెనుక నుండి వేగంగా వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు పుస్తెల తాడు లాక్కొనేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె భయంతో అరవటంతో స్థానికులు అతడిని వెంబడించి పట్టుకొన్నారు. ఈ మేరకు స్థానికుల ద్వారా సమాచారం అందుకొన్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుడు పెయింటర్‌గా పనిచేస్తూ నేతాజీనగర్‌లో నివసిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోటిపల్లి గ్రామవాసి అని,అప్పులతో సతమతమవుతూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని విచారణలో ఒప్పుకోవటంతో అతడిని రిమాండ్‌కు తరలించారు.

## 10కిలోల ఎండు గంజాయి స్వాధీనం

### పోలీసులకు పట్టుబడ్డ మైనర్ బాలుడు



**ప్రజాపక్షం/తాండూరు:** గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయానికి తరలిస్తున్న ఓ మైనర్ బాలుడి వద్ద తాండూరు పోలీసులు 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరు టౌన్ సిఐ పరమేశ్వగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తాండూరు రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. పక్కాప్లాన్‌తో పోలీసులు మైనార్ బాలుడిని పట్టుకున్నారు. ఆ బాలుడి వద్ద ఓ బ్యాగులో 10కిలోల ఎండు గంజా యి పట్టుబడినట్లు తెలిపారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన 17యేళ్ళ బాలుడు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా చేస్తూ తాండూరులో విక్రయించడానికి తాండూరు రైల్వే స్టేషన్‌లో దిగారు. అప్పటికే తాండూరు పోలీసులు రేల్వేస్టేషన్‌లో కాపుకాస్తున్నా రు. విశ్వసనీయమైన సమాచారంతో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అనుమానాస్పందంగా బ్యాగ్ తీసుకు వెళ్తున్న ఆ బాలుడిని తనిఖీ చేయగా బాలుడి వద్ద 10కిలోల్ల ఎండుగంజాయి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పూర్తిలో స్థాయిలో పంచనామా నిర్వహించిన పోలీసులు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు స్థానికుల వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి రామాలయం ముందు నిత్యం మురుగు పారుతున్న అధికారులు,ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి రామాలయం ముందు ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ చిన్నదిగా ఉండడంతో ప్రతి రోజు మురుగునీరు పొంగి దేవాలయంలోకి వెళ్లే భక్తులు, రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన ప్రయోజనం లేకుండా పోతుందని, శాశ్వత పరిష్కారం చూపడంలేదు. ఇకనైన సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు రామాలయం ముందు ఉన్న చిన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

# 'క్యూర్' బిల్లుపై నిపుణుల ఆందోళన

- ఆస్తి పన్ను నిబంధనలకు నిపుణుల అభ్యంతరం
- పారదర్శకత, స్థానిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ అందచేసిన డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు–2026 (క్యూర్ బిల్) లోని ఆస్తి పన్ను విధింపు నిబంధనలపై ప్రజా విధాన నిపుణులు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులోని సెక్షన్–76కు సంబంధించి పలు కీలక సవరణలను సూచిస్తూ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఎయుడి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు సమీక్షా లేఖను అందజేశారు. ఆస్తి పన్ను విధింపు ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ నిర్ణయాలపై ఆధారపడకుండా, పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండేలా తగిన రక్షణలు కల్పించాలని ఆయన లేఖలో తెలిపారు. ప్రజలపై అదనపు భారం మోపే విధానాలకు బదులుగా, పన్నుల ద్వారా సమకూరే ఆదాయం స్థానిక మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించే విధంగా నిబంధనలు ఉండాలని సూచించారు.

**తెలంగాణ స్టేట్ ప్రాపర్టీ ట్యాక్స్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి..**

తెలంగాణ స్టేట్ ప్రాపర్టీ ట్యాక్స్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. 2019 తెలంగాణ మున్సిపాలిటీల చట్టంలోని సెక్షన్–105 ప్రకారం ఈ బోర్డు ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని గుర్తుచేశారు. బోర్డు సిఫార్సులు లేకుండా ప్రభుత్వం గైడ్‌లైన్ విలువలను మార్చే అధికారం వినియోగించకూడదని, ఆరు నెలల్లోపు బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవనాల ఆస్తి పన్ను లెక్కింపులో కేవలం రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే గైడ్‌లైన్ విలువలనే ఆధారంగా తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. భూమికి మాత్రమే గైడ్‌లైన్ విలువలను వర్తింపజేసి, భవనాల విషయంలో వాటి వయస్సు, నిర్మాణ నాణ్యత, క్షీణత (డిప్రెషియేషన్) వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే విధానాన్ని కొనసాగించాలని సూచించారు.

**ఎక్కడి అక్కడే ఖర్చు పెట్టాలి..**

అదనపు ఎఫ్ఏఆర్ (ఎఫ్ఏఆర్) లేదా నిర్మాణ సాంద్రత పెరగడం వల్ల వచ్చే అదనపు పన్ను ఆదాయంలో కనీసం 50 శాతాన్ని అదే వార్డు లేదా జోన్‌లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రహదారుల అభివృద్ధికి వినియోగించేలా ప్రత్యేక వార్డు, జోన్ మౌలిక వసతుల నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే ఒక వార్డు లేదా జోన్ నుంచి వసూలైన పన్నులను ఇతర ప్రాంతాలకు అధికంగా మళ్లించకుండా పరిమితులు విధించాలని, వార్డుల వారీగా పన్ను వసూళ్లు, వ్యయ వివరాలను ప్రతి ఏడాది ప్రజలకు వెల్లడించే నిబంధనను బిల్లులో చేర్చాలని సూచించారు.

**ఆస్తిపన్ను అదనపు భారం మోపేదిగా ఉండొద్దు..**

గతంలో కేవలం క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తి పన్ను విధించిన సందర్భాల్లో అధికార దుర్వినియోగానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా స్పష్టమైన చట్టబద్ధమైన రక్షణలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్తి పన్ను విధానంలో మార్పులు చేసే ముందు కనీసం 30 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం తప్పనిసరి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఆస్తి పన్నుల విధానం ప్రజలపై అదనపు భారం మోపేదిగా కాకుండా, వారు చెల్లించే పన్నులకు అనుగుణంగా స్థానిక మౌలిక వసతులు మెరుగుపడేలా ఉండాలన్నారు. నామమాత్రపు ఆదేశాలతో పన్నుల విధానాన్ని మార్చడం పారదర్శకతకు విఘాతం కలిగిస్తుందని నరసింహారెడ్డి అన్నారు.

## నకిలీ జనన ధ్రువీకరణ పత్రంతో పాస్‌పోర్ట్ యత్నం భగ్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నకిలీ జనన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి పాస్‌పోర్ట్ పొందేందుకు చేసిన ప్రయత్నాన్ని హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు భగ్నం చేశారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ సందర్భంగా పత్రాల్లో అనుమానాస్పద అంశాలు గుర్తించడంతో దర్యాప్తు చేపట్టిన అధికారులు, నకిలీ పత్రాల తయారీ వెనుక ముఠా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్పెషల్ బ్రాంచ్‌లో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న గుస్కా విజయ్‌కుమార్‌కు ఫిబ్రవరి 18న షేక్ మహ్మద్ ముస్తఫా ముజఫర్ పాస్‌పోర్ట్ దరఖాస్తు వెరిఫికేషన్ బాధ్యతలు అప్పగించారు. ఫిబ్రవరి 26న ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించి, దరఖాస్తుదారు సమర్పించిన జనన ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించగా పలు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి.

## పోలీసుల దాడి దుర్మార్గం



**ప్రజాపక్షం/చార్మినార్:** ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి దుర్మార్గమని.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం చార్మినార్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. నిరసన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ధర్మ నాయక్, అబ్దుల్ సత్తార్, కృష్ణ నాయక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం బాలు నాయక్, సీఐటీయూ కిషన్, డివైఎఫ్ఐ నాయకులు ఆంజనేయులు, గోవింద్ నాయక్, నికిత, అక్షిత, ఫెరోస్, ఆవాజ్ కమిటీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## ఢిల్లీలో విహెచ్ మౌన దీక్ష



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** అయోధ్య రామ మందిర విరాళాల చోరీకి బాధ్యత వహిస్తూ రామజన్మ తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు రాజీనామా చేయాలని మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీ తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు హనుమంతరావు ఆధ్వర్యంలో విరాళాల చోరీకి నిరసనగా మౌన దీక్ష చేపట్టారు. మౌన దీక్షలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, కార్యదర్శి లక్‌పతి యాదగిరి గౌడ్, అడంరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## అనాధలకు అల్పాహారం పంపిణీ

**ప్రజాపక్షం/నల్లకుంట:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ నల్లకుంట డివిజన్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్బీనగర్‌లోని ఏవిజీ అనాధ బాలుర వసతి గృహంలో ఆమె పిల్లలకు అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత అమర్‌నాథ్ గౌడ్, నైతిక గౌడ్, పార్టీ నాయకులు పూజ, స్వప్న, వర్ష, పార్వతి, ప్రసన్న, విజయ, అభిషేక్, మనోహర్, నిత్యానంద్, విశ్వాస్, నానీ, సౌరవ్, మనన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాపార్క్‌కు తరలిన గులాబీ దండు




**ప్రజాపక్షం/కవాడీగూడ:** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడికి నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో అంబర్‌పేట్ నుంచి పెద్ద సంఖ్యలో గులాబీ దండు పాల్గొనడం జరిగింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు లిఖిత గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

## కెటిఆర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని గోషామహల్‌లో ఆ పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బిఆర్ఎస్ గోషామహల్ ఇంచార్జి మహేందర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ డివిజన్లలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమాల్లో మాణిక్, లత, అనిల్, టోపీ సాయి, యాదగిరి, మొహమ్మద్ ఈసా, రవికుమార్, సందీప్ పాల్గొన్నారు.

## ఫీజు లడాయి సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఆధ్వర్యంలో యువ మోర్చా, మహిళా మోర్చా సంయుక్త సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అధ్యక్షత వహించగా.. బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డం వెంకటస్వామి, ఎడెల్లి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండె సంరక్షణలో ఆధునిక విధానాలు




**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** గుండె సంరక్షణలో తాజా పురోగతులపై చర్చించేందుకు ప్రపంచంలోని ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు ఫ్యాకట్స్ ఫౌండేషన్, ఏసీవీఎస్ ఇండియా భాగస్వామ్యంతో నిర్వహించిన ఏసీవీఎస్ ఇండియా 2026 17వ ఎడిషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫ్యాకట్స్ ఫౌండేషన్ ఫౌండర్ డైరెక్టర్, అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డైరెక్టర్, కార్డియాలజీ క్లినికల్ రీసెర్చ్ డాక్టర్ ఏ.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు ఒకరి నుంచి ఒకరు నేర్చుకోనేందుకు ఏసీవీఎస్ ఇండియా2026 భారతదేశంలోనే అత్యంత గౌరవప్రదమైన అకడమిక్ కాన్ఫరెన్స్‌లలో ఒకటిగా రూపాంతరం చెందిందన్నారు.

## ప్రెస్ క్లబ్ సభ్యులకు నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ఉద్దేశించిన ప్రత్యేక మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరాన్ని నిమ్స్‌లో శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ పర్యవేక్షణలో డీన్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పరంజ్యోతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ చరణ్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మాట్లాడుతూ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఈ మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నిరంతర పని ఒత్తిడితో చాలా మంది జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ఈ శిబిరం వారికి సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకునే మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శిబిర ప్రారంభ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, వనం నాగరాజు, అశోక్ దయ్యాల, రచన ముదుంబై, నిమ్స్ పిఆర్ఓ సత్యం గౌడ్‌తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. హెల్త్ కార్డు కలిగిన జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్లు నిమ్స్ వైద్యాధికారులు తెలిపారు. అలాగే ప్రెస్ క్లబ్‌లో నమోదు చేసుకున్న సభ్యులకు మాత్రమే ఈ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రెస్ క్లబ్ కార్యవర్గం వెల్లడించింది.

## నకిలీ యుఎఇ వీసాలతో షార్జాకు వెళ్లే యత్నం భగ్నం..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నకిలీ యుఎఇ వీసాలతో షార్జాకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఇద్దరు భారతీయులను రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జిఐఎ) ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఈ కేసులో నకిలీ వీసాలు సమకూర్చినట్లు అనుమానిస్తున్న ట్రావెల్ ఏజెంట్‌పై కూడా కేసు నమోదు చేయగా, లోతైన దర్యాప్తు కోసం కేసును హైదరాబాద్ సిసిఎస్ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్‌కు బదిలీ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం షార్జాకు వెళ్లేందుకు జి9 468 విమానంలో ప్రయాణించేందుకు వచ్చిన గంగన్న సల్లా, ప్రశాంత్ కాసరపు అనే ఇద్దరు ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద యూఏఈ టూరిస్ట్ వీసాలను సమర్పించారు. పరిశీలనలో ఆ వీసాలు నకిలీవని అధికారులు గుర్తించారు. అసలు ఎంప్లాయ్‌మెంట్ వీసాగా ఉన్న వీసా కేటగిరీని టూరిస్ట్ వీసాగా మార్చి, విదేశీ ఉద్యోగాల కోసం తప్పనిసరిగా ఉండే ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ (పిఒఇ) నమోదు నిబంధనలను తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఇద్దరు ప్రయాణికులను షంషాబాద్ ఆర్జీఐ ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. నకిలీ వీసాలు సమకూర్చినట్లు అనుమానిస్తున్న జహీర్ అనే ఏజెంట్‌పై కూడా కేసు నమోదు చేశారు. సిసిఎస్ ఎస్ఐ నారాయణ్‌సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ వీసాల ముఠా, విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల కోణంలో విచారణను కొనసాగిస్తున్నారు.

## నిర్మాణ, కూల్చివేత ఘన వ్యర్థాల... సమగ్ర నిర్వహణ రూల్స్ అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నిర్మాణ, కూల్చివేతల ఘన వ్యర్థాల సమగ్ర నిర్వహణ రూల్స్ 2025ను సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఎంఎయుడి) జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సహకారంతో ఇఎస్‌సిఐ సెంటెనరీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్మాణ, కూల్చివేతల ఘన వ్యర్థాల నిర్వహణ సామర్థ్యం పెంపుదల కోసం ఒక రోజు వర్క్‌షాప్ జరిగింది. వర్క్‌షాప్‌ను టిజిపిసిబి సభ్యకార్యదర్శి జి.రవితో కలిసి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఎంఎయుడి) జయేష్ రంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, నిర్మాణ, కూల్చివేత ఘన వ్యర్థాల తరలింపు నిబంధనలు సమర్థవంతంగా అమలు చేసేందుకు కొత్త శక్తిని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతలో పనితీరును మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. సరైన సి అండ్ డి వ్యర్థాల నిర్వహణ, సరస్సుల మనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమించిన అక్రమ డంపింగ్ నుంచి వాటిని కాపాడేందుకు కూడా సహాయపడుతుందని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా టిజిపిసిబి సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ.. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణను నిర్ధారించడం.. రీసైక్లింగ్, పునర్వినియోగం ద్వారా వలయాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు పట్టణ స్థానిక సంస్థలు, అభివృద్ధి సంస్థలు, కాలుష్య నియంత్రణ బోర్డులు, నిర్మాణ రంగం మధ్య సమన్వయ చర్యల ఆవశ్యకత తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశాలలో సి అండ్ డి వేస్ట్ మేనేజ్‌మెట్ రూల్స్2025 కింద నియంత్రణ చట్టం, వాటాదారుల బాధ్యతలు, విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత, సిపిసిబి ఆన్‌లైన్ పోర్టల్ సంసిద్ధత, పట్టణ స్థానిక సంస్థల ద్వారా అమలు వ్యూహాలు, రీసైక్లింగ్ సాంకేతికతలు, ఎంఏయూడి, జీవో నెం626లోని నిబంధనలపై చర్చించారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల శాస్త్రీయ సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, వినియోగాన్ని నిర్ధారించడంలో వివిధ భాగస్వాముల పాత్రలపై పాల్గొనేందుకు అవగాహన కల్పించారు. నగర స్థాయి కార్యాచరణ ప్రణాళికల తయారీ, సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా కొనసాగుతున్న పట్టణాభివృద్ధి కార్యక్రమాలలో సి అండ్ డి వ్యర్థాల నిర్వహణను ఏకీకృతం చేయడంపై ఈ ఇంటరాక్టివ్ ప్యానెల్ చర్చ దృష్టి సారించింది. ప్యానెల్‌లో జీహెచ్ఎంసీ ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి, రీస్టెయినబిలిటీ ప్రతినిధి నీలేష్ గుప్తా, ఎస్ఎస్ఆర్ఈసీ ప్రతినిధి రఘురామ్, బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వినాయక్ కుమార్, తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఎస్ఇఇ సుజనశ్రీ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి




ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జరిగిన దేశవ్యాప్త బందులో భాగంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బంద్ పాటించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మెట్టెల చైతన్య యాదవ్ మాట్లాడుతూ, ఇప్పటికైనా నరేంద్ర మోడీ కళ్లు తెరవాలని.. దేశంలో ఉండేటటువంటి పేద వర్గాల పిల్లలు, వారి భవితవ్యానికి ఒక మార్గదర్శకం చేసే విధంగా వ్యవహరించాలని సూచించారు. మంత్రి ధర్మేంద్రతో రాజీనామా చేయించాలన్నారు. సీజేపీ పేరు మీద 20వ తేదీన జరిగిన దాడిని ఖండిస్తూ లాఠీలు, తూటాలు ఉద్యమాలను ఆపలేవన్నట్లు, బంద్ కార్యక్రమం చేసి ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. అదే క్రమంలో 25 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనంకు సంపూర్ణ మద్దతు తెలియపరుస్తూ దేశంలో ఉండేటువంటి ప్రజలు ప్రజా ఉద్యమాన్ని నిర్మాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే ఉద్యమాన్ని ఉగ్గుపాలతో ఉరకలెత్తిస్తామని.. ఉద్యమ నాయకత్వాన్ని దేశస్థాయిలో విస్తరించే విధంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని హెచ్చరిక జారీ చేశారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘం నాయకులు మహేష్, కళ్యాణ్, అనిల్, వీరబోయిన మహేష్, వంశీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'మదలస – స్పేస్ ఫర్ డివైన్ ఆర్ట్' వార్షికోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ సాంప్రదాయ నృత్య కళలను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇస్తున్న 'మదలస – స్పేస్ ఫర్ డివైన్ ఆర్ట్' సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో ఘనంగా జరిగాయి. ప్రముఖ నాట్యాచార్యులు మదాలస సంస్థ వ్యవస్థాపకురాలు సౌజన్య శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆమె శిష్యురాళ్లు శిష్టా వైష్ణవి, ఎం.లక్ష్మి ప్రసన్న, విష్ణు శ్రియ ఏచూరి, వాహిని క్రిష్ణ చేసిన నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. పుష్పాంజలి, అలరిపు, గణపతి స్తుతి, నటేశ్వర కౌత్వం వంటి అంశాలపై చక్కగా నర్తించి మెప్పించారు.సాంప్రదాయ నృత్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నట్టు సౌజన్య శ్రీనివాస్ తెలిపారు.

## టెక్ మహేంద్రలో మహిళా ఉద్యోగి తొలగింపు అన్యాయం:వి.ఎస్.బోస్


**ప్రజాపక్షం/హైదరాబాద్:** టెక్ మహేంద్రలో పనిచేస్తున్న భావన అనే మహిళా ఉద్యోగిని అక్రమంగా తొలగించడం అన్యాయమని, ఆమెకు వెంటనే న్యాయం చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.యస్. బోస్ ప్రభుత్వాన్ని కోరారు. ఐటి పరిశ్రమల్లో ఉద్యోగులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఐటి పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, కొన్ని యాజమాన్యాలు ఉద్యోగులను మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. భావన తన చిన్నారి కుమార్తె ఆరోగ్య పరిస్థితిని వివరించినప్పటికీ, యాజమాన్యం కనీస మానవతా దృక్పథం చూపకుండా ఉద్యోగం నుంచి తొలగించడం తీవ్రంగా ఖండనీయమన్నారు.ఐటి రంగంలో ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, ఉద్యోగులను తొలగించే సమయంలో చట్టబద్ధమైన నిబంధనలు పాటించకపోవడం, తొలగించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన చట్టబద్ధమైన బకాయిలను కూడా ఇవ్వకుండా ఎగవేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దీంతో ఐటి సంస్థల యాజమాన్యాలు మరింత నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని బోస్ విమర్శించారు.

## వర్షపు నీటి సంరక్షణలో ఆదర్శం




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాల పరిరక్షణ, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో నాగోల్‌లోని కోఆప్ బ్యాంక్ కాలనీలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ, సమావేశం నిర్వహించారు. నాగోల్ పరిధిలో మూసీ నదికి దక్షిణంగా ఉన్న కోఆప్ బ్యాంక్ కాలనీలో 80 శాతం గృహాల్లో రూఫ్ టాప్ వర్షపు నీటిని రీచార్జ్ నిర్మాణాల్లోకి మళ్లించే వ్యవస్థలు ఏర్పాటు చేశారు. దీంతో వర్షాకాలం అనంతరం బోర్వెల్లలో నీటి లభ్యత గణనీయంగా పెరగడంతో పాటు భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగుతోంది. జలమండలి భూగర్భ జల నిపుణుల సూచనల మేరకు కొత్త బోర్వెల్లను 60 మీటర్ల కంటే ఎక్కువ లోతులో తవ్వకుండా కాలనీ వాసులు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకుని ఇప్పటికీ అమలు చేస్తున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) సత్యనారాయణ, డైరెక్టర్(రెవెన్యూ) కిరణ్‌కుమార్, చీఫ్ జనరల్ మేనేజర్ నాగేంద్రకుమార్, జనరల్ మేనేజర్ మహేంద్ర నాయక్, గ్రౌండ్ వాటర్ ఎక్స్‌పర్ట్ జాల సత్యనారాయణ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, కార్యదర్శి లవకుశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి మహంకాళి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** లష్కర్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకాంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో అమ్మవారితో పాటు గర్భాలయాన్ని దాదాపు 500 కిలోల వివిధ రకాల తాజా కూరగాయలతో ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తలు, ఆలయ వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రూ.8.07 కోట్ల బంగారం కుంభకోణం

జ్యువెలరీ వ్యాపారిని నమ్మించి బంగారంతో పరార్..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నగల వ్యాపార రంగాన్ని కుదిపేసే భారీ మోసం వెలుగులోకి వచ్చింది. బ్రోకర్‌గా నమ్మకం సంపాదించి కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు తీసుకెళ్లిన అనంతరం కుటుంబ సభ్యులు, ఉద్యోగులతో కలిసి పరారైన జ్యువెలరీ వ్యాపారులపై నమోదైన కేసును సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఈ కేసులో మొత్తం రూ.8.07 కోట్ల మేర మోసం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. హైదర్‌గూడలోని మాలిక్ జ్యువెలర్స్, షంషీర్ జ్యువెలర్స్ యజమాని సుకూర్ అలీ మాలిక్ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2018 నుంచి కెవి జ్యువెలర్స్, నితిన్ జ్యువెలర్స్ పేరుతో సోమాజిగూడ బాబుఖాన్ మాల్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న నితిన్ రమేష్ గులాబానీతో వ్యాపార సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, నితిన్ గులాబానీ తన భార్య దివ్య గులాబానీ, సోదరుడు విపిన్ రమేష్ గులాబానీతో పాటు సంస్థలోని కీలక ఉద్యోగుల సహకారంతో పథకం ప్రకారం మోసానికి పాల్పడ్డాడు. బ్రోకర్‌గా నమ్మకం పొందిన అనంతరం విక్రయాల కోసం ఇచ్చిన బంగారు ఆభరణాలను తిరిగి ఇవ్వకుండా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపించారు. ఈ ఏడాది జూన్ 10, 16 తేదీల్లో మొత్తం 1,594.567 గ్రాముల బంగారు ఆభరణాలు (22 క్యారెట్, 18 క్యారెట్) విక్రయాల కోసం అప్పగించగా, వాటి మార్కెట్ విలువ రూ.2.31 కోట్లుగా ఉందని తెలిపారు. అనంతరం మరో 700 గ్రాముల బంగారం కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుని, దానికి సంబంధించిన రూ.1.31 కోట్ల లావాదేవీతో పాటు పాత బకాయిల కోసం మొత్తం రూ.5.76 కోట్ల విలువైన ఆరు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చారని పేర్కొన్నారు. చెల్లింపు గడువు ముగిసే సమయానికి నిందితులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో బాధితుడు సోమాజిగూడలోని కార్యాలయానికి వెళ్లగా, ఆఫీసు పూర్తిగా మూసివేసి ఉండటం గమనించాడు.ఇదే తరహాలో మరికొందరు నగల వ్యాపారులు కూడా మోసపోయినట్లు అనంతరం తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తంగా చెక్కుల విలువ రూ.5.76 కోట్లు, అప్పగించిన బంగారం విలువ రూ.2.31 కోట్లు కలిపి రూ.8,07,15,014 మేర మోసం జరిగినట్లు బాధితుడు ఆరోపించాడు. సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగం ఏసిపి ఎస్. రాజు దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, బంగారం తరలింపు, ఇతర బాధితుల వివరాలపై సిసిఎస్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.

# తొలివారం 'వాష్‌ఔట్'

ప్రతిపక్ష ఎంపిల నిరసనలు, ఆందోళనలు
సాగని కార్యకలాపాలు
పార్లమెంట్ ఉభయ సభలో
సోమవారం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20న ప్రారంభం కాగా, తొలి వారం ఎలాంటి కార్యకలాపాలకు నోచుకోకుండా తుడిచి పెట్టుకుపోయింది. నీట్ పేపర్ లీక్ వివాదం, విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ అంశాలపై ప్రతిపక్ష ఎంపిల ఆందోళనలు, నిరసనలతో ఉభయ సభలు అట్టుడికాయి. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు ప్రతిపక్ష ఎంపిలు పట్టు బిగించాయి. అయితే సమావేశాలు ప్రారంభమైన మూడు రోజుల తరువాత నీట్ పేపర్‌లీక్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించినప్పటికీ, సంతృప్తి చెందని ప్రతిపక్షాలు మంత్రి ప్రధాన్ రాజీనామా ముందు, ఆ తరువాత చర్చ అంటూ కొత్త షరతు విధించాయి. ఈ దీంతో ఉభయసభల్లో వారం రోజుల పాటు ప్రతిష్టంభన కొనసాగింది. శుక్రవారం స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ సభలను సోమవారం రానికి వాయిదా వేశారు. కాగా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్, నీట్ పరీక్షా పత్రం లీక్ వ్యవహారం వంటి పలు కీలక అంశాలపై శుక్రవారం నాడు వరుసగా ఐదవ రోజు కూడా లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరగకుండా సాకులు వెతకడం దేశానికి తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, విపక్షాలు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌కు కట్టుబడి ఉండటంతో శుక్రవారం లోక్‌సభ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడుతూ, పేపర్ లీక్ అంశంపై పార్లమెంటులో చర్చ జరగనిచ్చేందుకు ప్రభుత్వం పదేపదే ప్రతిపక్ష పార్టీలను సంప్రదించిందని చెప్పారు. చర్చ జరగాలని పలువురు ప్రతిపక్ష ఎంపిలు భావిస్తున్నారని, చర్చ ఆవశ్యకతను రాహుల్ గాంధీ తన పార్టీ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పాలని ఆయన అన్నారు. చర్చకు ముందే సాకులు చెప్పడం, షరతులు విధించడం దేశానికి తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్‌పై కఠినమైన చట్టం తీసుకురావడం, నిందితుల విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో నిర్వహించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అలాగే కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించారని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల సభ్యులు ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను కొనసాగిస్తూ రాజీనామా చెయ్ వంటి నినాదాలు చేశాయి. సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేయగా, సభకు అధ్యక్షత వహిస్తున్న జగదాంబికా పాల్, మంత్రి పార్లమెంటరీ పత్రాలను సభలో ప్రవేశపెట్టిన తర్వాత అవకాశం ఇస్తానని చెప్పారు. కానీ ఆ తర్వాత సభ సోమవారం వరకు వాయిదా పడటంతో కాంగ్రెస్ నేత మాట్లాడలేకపోయారు. మరోవైపు రాజ్యసభలో నీట్ పేపర్ లీక్, 'దేశ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, 2026' ప్రవేశపెట్టడం సహా పలు అంశాలపై ప్రతిపక్షాలు నిరసన కొనసాగించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్న భోజనానంతర సమావేశానికి సభ సమావేశమైన వెంటనే మరుసటి రోజుకు సభా కార్యకలాపాలను వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం వరకు రెండుసార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్‌ను 'దేశ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టాలని కోరారు. ప్రతిపక్ష సభ్యులు, ముఖ్యంగా వామపక్ష పార్టీలకు చెందినవారు, ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. అయినప్పటికీ, మూజువాణి ఓటు తర్వాత ప్రతిపాదిత చట్టాన్ని ప్రవేశపెట్టారు. బిల్లుపై చర్చ ప్రారంభించగానే చైర్మెన్ సభను కోరడంతో, ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడంతో సభ వాయిదా పడింది.

## ప్రతిపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్ష సభ్యులు పలు రూపాలుగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. శుక్రవారం కూడా ఆందోళన చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో, పలువురు ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాన్ రాజీనామా చేయాలని, పార్లమెంట్ ఉభయ సభలలో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, 'బర్ఖాస్త్ కరో ప్రధాన్ కో' (ప్రధాన్‌ను బాగు చేయండి) అని రాసి ఉన్న బ్యానర్‌ను కూడా వారు ప్రదర్శించారు. గురువారం అర్ధ రాత్రి సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక వీడియో సందేశం విడుదల చేసిన తర్వాత ఈ నిరసన జరిగింది.

**ప్రధాని క్షమాపణ చెప్పేంత వరకూ చర్చలు జరగవు : రాహుల్**

పరీక్షా పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు, అలాగే ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పేంత వరకు ప్రభుత్వంతో ఎటువంటి చర్చలూ జరగవని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. పార్లమెంట్ భవన సముదాయంలో మీడియాతో మాట్లడుతూ సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వలేదని ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'చర్చను ప్రారంభించాలని కాంగ్రెస్ ఎంపిలను కోరుతూ లోక్‌సభలో (పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్) రిజిజు ఒక ప్రకటన చేశారు. ఎవరి పేరునైనా ప్రస్తావించినప్పుడు, ఆ వ్యక్తి స్పందించాలని కోరడం సహజం. అయితే, రిజిజు వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చేందుకు నేను లేచినప్పుడు, నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు, నా మైక్ కట్‌చేశారు' అని అన్నారు. పరీక్షా పత్రాల లీకేజీ, విద్యార్థుల నిరసన, ఢిల్లీ వీధుల్లో వారిపై పోలీసులు జరిపిన అణచివేత చర్యలకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షం, ప్రభుత్వం మధ్య ప్రతిష్టంభన నెలకొంది. 'ప్రతిపక్షం వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని అనుకున్నాను. విద్యార్థులకు మూడు డిమాండ్లు ఉన్నాయి — అవినీతిపరుడైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకోవాలి; విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి; ప్రధాన మంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. ఇవే ఆ మూడు షరతులు. ప్రధాన్‌ను తొలగించే వరకు మేము ఎటువంటి చర్చ జరపము' అని రాహుల్‌గాంధీ అన్నారు.

---

లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు

## కేంద్ర కేబినెట్ ఆమోదం

దోషులకు పదేళ్ల వరకు జైలు, రూ. 10 కోట్ల వరకు జరినామా



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్‌లకు సంబంధించి కఠినమైన శిక్షలను నిర్ధారించే ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత ఆ బిల్లుకు ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో, ప్రస్తుతం ఉన్న చట్టాల కంటే పేపర్ లీక్‌లలో పాల్గొన్న వారికి కఠినమైన శిక్షలు విధించే ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించిందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు, రూ. 10 కోట్ల వరకు జరినామా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రజా ప్రశ్నపత్రాల లీకేజీ వివాదాలు తీవ్రంగా ఉన్నప్పుడు, 2024లో కూడా కేంద్రం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది.

'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన దాదాపు నాలుగు నెలల తర్వాత, నీట్, నెట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణల కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో, 2024 జూన్‌లో ఈ బిల్లును నోటిఫై చేశారు. ఈ చట్టానికి ముందు, కేంద్ర ప్రభుత్వం, ఏజెన్సీలు నిర్వహించే ప్రజా పరీక్షలలో పాలు పంచుకునే వివిధ సంస్థలు అవలంబించే అనుచిత పద్ధతులు లేదా పాల్పడే నేరాలను ఎదుర్కోవడానికి నిర్దిష్టమైన చట్టం ఏదీ లేదు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి), రైల్వేలు, బ్యాంకింగ్ నియామక పరీక్షలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) వంటి సంస్థలు నిర్వహించే ప్రజా పరీక్షలలో అనుచిత పద్ధతులను నిరోధించడమే ఈ చట్టం లక్ష్యం. మోసాలను అరికట్టడానికి మునుపటి బిల్లులో కనీసం మూడు నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వ్యవస్థీకృత మోస నేరాలలో పాల్గొన్న వారికి ఐదు నుండి పది సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రూ. 1 కోటి జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఈ బిల్లులో 'ప్రజా పరీక్షా ప్రాధికార సంస్థ ద్వారా ఇతర ప్రభుత్వ సంస్థల సేవలను వినియోగించుకోవడం', 'నిబంధనలు, ప్రమాణాలు, మార్గదర్శకాలను రూపొందించడం', 'అనుచిత పద్ధతులు లేదా నేరాల సంఘటనలను నివేదించడం' వంటి నిబంధనలు ఉన్నాయి. ప్రజా పరీక్షా కేంద్రాల పరీక్ష సంసిద్ధత కోసం ప్రీఆడిట్, అభ్యర్థుల చెక్‌ఇన్, బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, భద్రత, స్క్రీనింగ్, సీట్ల కేటాయింపు, ప్రశ్నపత్రాల సెట్టింగ్, లోడింగ్, పరీక్షలో పర్యవేక్షణ, పరీక్షానంతర కార్యకలాపాలు, స్క్రైబ్‌లను అందించడానికి మార్గదర్శకాలు వంటి పరీక్షకు ముందు కార్యకలాపాలు కూడా నిబంధనలలో భాగంగా ఉన్నాయి. ప్రశ్నాపత్రాలను లీక్ చేయడం, ఒఎంఆర్ షీట్లను తారుమారు చేయడం, నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించడం, నకిలీ అడ్మిట్ కార్డులను జారీ చేయడం వంటి 15 చట్టవిరుద్ధమైన చర్యలను ఈ బిల్లు వివరిస్తుంది.

## రేబిస్ నిరోధక వ్యాక్సిన్ కొరతపై కేంద్రానికి ఎలాంటి సమాచారం లేదు

లోక్‌సభకు మంత్రి జెపి నడ్డా వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా రేబిస్ నిరోధక వ్యాక్సిన్ (ఏఆర్‌వి) కొరత ఉందని ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం అందలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి.నడ్డా ఈ విషయాన్ని లోక్‌సభకు తెలిపారు. అయితే, పెరిగిన డిమాండ్, కొనుగోళ్లలో జాప్యం లేదా సరఫరా గొలుసు సమస్యల కారణంగా కొన్ని ఆరోగ్య సౌకర్యాలలో తాత్కాలిక కొరతలు ఏర్పడవచ్చని, అటువంటి పరిస్థితులను సంబంధిత రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు అందుబాటులో ఉన్నటువంటి నిల్వల పున: పంపిణీ, అత్యవసర కొనుగోళ్లు, సప్లయ్ చైన్ నిర్వహణను బలోపేతం చేయడం ద్వారా పరిష్కరిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యం అనేది రాష్ట్ర పరిధిలోని అంశమన్నారు. ప్రజారోగ్య కేంద్రాలలో యాంటీ–రేబిస్ వ్యాక్సిన్, రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్(ఆర్ఐజి)ల సేకరణ, పంపిణీ, నిరంతరాయ లభ్యతను నిర్ధారించే ప్రాథమిక బాధ్యత ఆయా రాష్ట్ర, కేంద్రపాలిత ప్రభుత్వాలదేనని ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా స్పష్టంచేశారు. 'దేశ వ్యాప్తంగా రేబిస్ నిరోధక టీకాల కొరత ఉందని భారత ప్రభుత్వానికి ఎలాంటి నివేదికలు అందలేదని ఆయన చెప్పారు.రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించడం ద్వారా జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం (ఎన్ఆర్‌సిపి) అమలును కేంద్రం నిరంతరం సమీక్షిస్తున్నదని తెలిపారు. నేషనల్ ఫ్రీ డ్రగ్ ఇనిషియేటివ్ (ఎన్ఎఫ్‌డిఐ) కింద కేటాయించిన నిధుల ద్వారా ఏఆర్‌వి, ఆర్ఐజి సప్లయ్‌ని నిరంతరాయంగా కొనసాగించాలని అన్ని రాష్ట్రాలకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తున్నామని మంత్రి నడ్డా తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్రాలు తమ కార్యక్రమ అమలు ప్రణాళికలలో సమర్పించిన ప్రతిపాదనల ఆధారంగా వ్యవస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని వివరించారు.

## ప్రధాన్ ఒక నేరపూరిత మంత్రి

ఆయన భారత విద్యా వ్యవస్థ పతనానికి ప్రతీక
రాహుల్‌గాంధీ మండిపాటు
పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన విద్యార్థిని మీడియా ముందు ప్రవేశపెట్టిన ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** ధర్మేంద్ర ప్రధాన్ ఒక నేరపూరిత విద్యాశాఖ మంత్రి అని, ఆయన భారత విద్యా వ్యవస్థ పతనానికి ప్రతీక అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ నాటి నిరసనల సమయంలో భద్రతా సిబ్బంది జరిపిన పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన విద్యార్థిని ఆయన శుక్రవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. విద్యార్థులపై కాల్పులు జరిపిన, లాఠీచార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. 'నిరసనకారులు పెల్లెట్ గన్ దాడులకు గురయ్యారని మీరు అంటున్నారు. అసలు పెల్లెట్ గన్‌లతో ఎప్పుడు కాల్పులు జరిపారో నేను వివరించాలనుకుంటున్నాను. నా సోదరుడు చేతిలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు పెల్లెట్ గన్ దాడికి గురయ్యాడు' అని రాహుల్‌గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ నివాసం (10, జన్పథ్) బయట మీడియాతో మాట్లాడుతున్నప్పుడు, సాహిల్ అని తనను తాను పరిచయం చేసుకున్న ఆ గాయపడిన నిరసనకారుడు ఆయన పక్కనే ఉన్నారు. ఆ యువకుడి గాయాలను మీడియాకు చూపించడానికి అతని టీషర్ట్‌ను పైకి లేపుతూ, సాహిల్ కన్ను దెబ్బతిన్నదని, ఆ కంటితో అతను చూడలేకపోతున్నాడని రాహుల్ చెప్పారు. 'ఇదే మన దేశ భవిష్యత్తు. వేలాది మంది యువతకు ఇలాగే జరిగింది; వారిపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు, లాఠీచార్జ్‌లో కొట్టారు. వారు ఏం చేస్తున్నారు? వారు శాంతియుత నిరసనలు చేస్తున్నారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. పోలీసు బలగాల్లో నియామకం కోసం సాహిల్ పరీక్ష రాశాడని, అయితే ప్రశ్నపత్రం లీక్ అయిందని రాహుల్ తెలిపారు. 'అతని (సాహిల్) తల్లిదండ్రులు తమ కష్టార్జితంతో అతనికి ఈ అవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం మానేయాలి. ప్రభుత్వం మన భవిష్యత్తుపై దాడి చేసింది' అని అన్నారు. సాహిల్ కన్ను కాపాడగలమో లేదో కూడా గ్యారెంటీ లేదని ఆయన అన్నారు. ఈ సోదరుడిపై కాల్పులు జరగడానికి ప్రధానే కారణం, వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేయడానికి ఆయనే కారణమని మండిపడ్డారు.

**డియుపై రాహుల్ మండిపాటు**

జంతర్ మంతర్ నిరసనలకు దూరంగా ఉండాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులను హెచ్చరించడంతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆ విశ్వవిద్యాలయంపై విరుచుకుపడ్డారు. తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నందుకు విద్యార్థులను బెదిరించడానికి ఎంత ధైర్యం అని ఆయన ప్రశ్నించారు. 'జంతర్ మంతర్‌కు దూరంగా ఉండండి' అని విద్యార్థులకు సలహా ఇస్తున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం సోషల్ మీడియా పోస్ట్‌ను ట్యాగ్ చేస్తూ, 'దయచేసి గమనించండి, సమయం వచ్చినప్పుడు జవాబుదారీగా ఉండవలసింది మీరే' అని అన్నారు. గురువారం రాత్రి ఢిల్లీ విశ్వవిద్యాలయం చేసిన ఒక పోస్ట్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పోస్ట్‌లో, 'ప్రియమైన విద్యార్థులు, అధ్యాపకులారా, మీ భద్రత మాకు ముఖ్యం. దయచేసి గమనించండి, భారత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కఠినంగా నియంత్రించబడే న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ఏవైనా చట్టవిరుద్ధమైన సమావేశాలు లేదా ప్రదర్శనలు చట్టపరమైన చర్యలకు దారితీయవచ్చు' అని ఉంది. ఇలాంటి కార్యకలాపాలు విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగించడమే కాకుండా, వారి విద్యా పురోగతి, వృత్తిపరమైన అవకాశాలపై కూడా గణనీయంగా ప్రభావం చూపుతాయని విశ్వవిద్యాలయం తెలిపింది.

## దేశంలో వైద్య విద్యను విస్తరిస్తున్నాం

లోక్‌సభకు మంత్రి అనుప్రియ పటేల్ వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 2014లో 387 నుంచి 844కు పెరిగిందని, అదే సమయంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 51,348 నుంచి 1,39, 489కి పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ శుక్రవారం లోక్‌సభకు తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా అదే కాలంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు 31,185 నుంచి 86,360కు పెరిగాయని వివరించారు. మారుమూల, వెనకబడిన ప్రాంతాలలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఎంబిబిఎస్ కోర్సుల విస్తరణతో పాటు దేశవ్యాప్తంగా డాక్టర్ల లభ్యత మెరుగుపడి, ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం అవుతాయని ఆశిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఎంబిబిఎస్ పాఠ్య ప్రణాళికలో విలీనం చేయబడిన కుటుంబ దత్తత కార్యక్రమం (ఎఫ్ఏపి) గురించి కూడా పటేల్ ప్రముఖంగా ప్రస్తావించారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) ప్రవేశపెట్టిన జిల్లా రెసిడెన్సీ ప్రోగ్రాం (డిఆర్‌పి) ప్రకారం, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు తమ శిక్షణలో భాగంగా జిల్లా ఆసుపత్రుల్లో మూడు నెలలపాటు పోస్టింగ్ పొందడం తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ, వెనకబడిన ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి వివరించారు.

## రాజ్యసభలో 'వందే మాతరం'

**న్యూఢిల్లీ :** నీట్ యుజి 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం' బిల్లును ప్రవేశపెట్టింది. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్' (సవరణ)2026 పేరిట బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరఫున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని సిపిఐ, సిపిఎం వ్యతిరేకించాయి. అయితే బిల్లు ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు నీట్ అంశంపై నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించడంతో సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపాదిత బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్ 1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణను 'వందే మాతరం' గీతానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షం**

బిల్లు ప్రవేశపెట్టడాన్ని సిపిఐ సభ్యులు పి. సందోష్ కుమార్, జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా వ్యతిరేకించారు. వందే మాతరాన్ని తాను గౌరవిస్తానని పేర్కొన్న సంతోష్ కుమార్, ఈ బిల్లు ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్, బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సభాపతి జోక్యం చేసుకుని బిల్లుకు సంబంధించిన అంశాలకే పరిమితమై మాట్లాడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ఆందోళనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దేశభక్తిని చట్టాల ద్వారా సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు.

## మీడియా కథనాలు బాధ్యతారాహిత్యం

సిజెఐ సూర్యకాంత్
తనకు అందింది వినతిపత్రమే, పిటిషన్ కాదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** జంతర్‌మంతర్ వద్ద జులై 20న విద్యార్థులపై పోలీసులు జరిపిన చర్యను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణను తాను నిరాకరించినట్లు వచ్చిన మీడియా కథనాలను భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శుక్రవారం కొట్టిపారేశారు. ఆ కథనాలను 'బాధ్యతారహిత్యం'అని వ్యాఖ్యానించారు. అది కేవలం ఒక వినతిపత్రం మాత్రమేనని, పిటిషన్ కాదని సిజెఐ స్పష్టంచేశారు. అలాంటి పిటిషన్ ఏదీ దాఖలు కాలేదని ఆయన పేర్కొన్నారు. గత రెండు రోజులుగా, ఒక కేసు దాఖలైందని పూర్తిగా ఒక తప్పుడు ప్రకటన చేశారని, ప్రధాన న్యాయమూర్తి ఆ కేసును విచారణకు స్వీకరించడానికి నిరాకరించారని, మీడియా అన్నివిధాలుగా బాధ్యత వహించకుండా తప్పుగా ప్రచారం చేస్తోందని సిజెఐ సూర్యకాంత్ తెలియజేశారు.

పరీక్ష వివాదాల నేపథ్యంలో...

## అధికారుల వరుస బదిలీలు

విద్యా శాఖ ప్రక్షాళన దిశగా కేంద్రం చర్యలు షురూ

**న్యూఢిల్లీ :** ప్రశ్న పత్రాల లీకులు, సిబిఎస్ఇ డిజిటల్ మూల్యాంకనంలో తలెత్తిన సాంకేతిక లోపాలతో సహా విద్యా శాఖకు సంబంధించిన ఇటీవలి వివాదాల నేపథ్యంలో ఉన్నతాధికారుల వరుస బదిలీల పరంపర చోటుచేసుకుంది. అదే సమయంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. 'నీట్' యుజి పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు ఉధృతం కావడంతో కేంద్రం గురువారం రాత్రి పొద్దుపోయాక ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వినీత్ జోషిని తొలగించింది. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ప్రభుత్వానికి సన్నిహితుడిగా పేరొందిన వినీత్ జోషి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఏజెన్సీ (సిబిఎస్ఇ) చైర్మన్‌గా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) మొదటి డైరెక్టర్ జనరల్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తాత్కాలిక చైర్మన్‌గా సహా భారతదేశ విద్యా వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన కొన్ని పదవులను నిర్వహించారు. జూన్ 30న సంజయ్‌కుమార్ పాఠశాల విద్య కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన తర్వాత, వినీత్ జోషి ఆ పదవీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. జోషి ఎన్‌టిఏలో ఉన్న పదవీకాలంలో కీలకమైన ఆ పరీక్షలో తలెత్తిన సాంకేతికలోపాల కారణంగా ప్రభుత్వం ఎదుర్కొన్న తీవ్ర విమర్శల మధ్య కూడా అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్ల కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సియుఇటి)ని ప్రవేశపెట్టారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో జాతిహింస చెలరేగినప్పుడు, 2023లో ఆయనను ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా నియమించారు. ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా ఆయన్ను బదిలీ చేసిన తర్వాత జోషి పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమితులయ్యారు. నరేష్ కుమార్ గంగ్వార్ ఉన్న త విద్యాశాఖ కార్యదర్శిగా నియమితులు కాగా, టి.కె.అనిల్ కుమార్‌ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా నియమించారు. గంగ్వార్ పశు సంవర్ధక శాఖలో సెక్రటరీగా నియమితులయ్యాక, అక్కడ ఆయన వివిధ కారణాల వల్ల వార్తల్లోకి ఎక్కారు. మీడియా కథనాల ప్రకారం, గంగ్వార్ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు 1994 బ్యాచ్ రాజస్థాన్ కేడర్‌కు చెందిన ఒక ఐఎఎస్ అధికారి జాతీయ ఉద్యానవన బోర్డ్ పథకం కింద ఐదేళ్లలో రూ.1.16 కోట్లకు పైగా సబ్సిడీలను అందుకున్నారు. గంగ్వార్ గతంలో పర్యావరణ. అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు.అక్కడ ఆయన కాలుష్య నియంత్రణ, ప్రమాదకర పదార్థాల వ్యవహారాలను పర్యవేక్షించారు. టికె.అనిల్ కుమార్ గతంలో గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. గ త రెండునెలలుగా వివాదాల కేంద్ర బిందువుగా ఉన్నటువంటి విద్యా మంత్రిత్వ శాఖలో మొదటగా 12వ తరగతి కోసం సిబిఎస్ఇ ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం)లోని లోపాలపై, ఆ తర్వాత నీట్ పేపర్ లీక్ చట్టంపై చెలరేగిన వివాదం కారణంగా ఇటీవలి కాలంలో పలువురు అధికారులను తొలగించారు. గత నెలలో, మంత్రిత్వ శాఖ సిబిఎస్ఇ చైర్మన్ రాహుల్ సింగ్, సెక్రటరీ హిమాంశు గుప్తా ఇద్దరినీ బదిలీ చేసి వారి స్థానంలో లోఖండే ప్రశాంత్ సీతారామ్, వరుణ్ భరద్వాజ్‌ను నియమించారు. సిబిఎస్ఇ 12వ తరగతి బోర్డ్ పరీక్షల కోసం ఉపయోగించే ఒఎస్ఎం సిస్టమ్‌లో సాంకేతిక లోపం, అస్పష్టమైన జవాబు పత్రాలు, మూల్యాంకన లోపాలపై చెలరేగిన భారీ నిరసనల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మీడియా, కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖ చీఫ్‌గా ఉన్న ఆంచల్ కటియార్‌ను కూడా తొలగించారు. కటియార్‌ను పశు సంవర్ధక మంత్రిత్వ శాఖకు బదిలీ చేయగా, ఆమె స్థానంలో రశ్మీ రోజా తుషార నాయర్‌ను నియమించారు. నీట్ యుజి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరసకారులపై పోలీసుల అణచివేత ఆరోపణలు, జవాబుదారీతనం కోసం కొనసాగుతోన్న డిమాండ్ల కారణంగా విద్యార్థుల నేతృత్వంలో జరుగుతున్న నిరసనలు దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి.

**వరంగల్ మహా నగర పాలక సంస్థ**

ప్రకటన

Roc.No. HO/F1/21871/2022-2026 దివి: 23-07-2026

విషయం : వరంగల్ మహా నగర పాలక సంస్థ - ప్రజారోగ్య విభాగం నగర పాలక సంస్థ యందు కోడి మాంస వ్యర్థాలను సేకరించుటకు (కాశీబుగ్గ సర్కిల్ / కాజీపేట్ సర్కిల్ ) యందు విడివిగా సేకరించుటకు ఆసక్తి గల వారు బహిరంగ వేలం ద్వారా దరఖాస్తులు స్వీకరించుటకు గురించి.

-000-

వరంగల్ మహా నగర పాలక సంస్థ కమీషనర్ గారు నగర పాలక సంస్థ యందు కోడి మాంస వ్యర్థాలను సేకరించుటకు గాను అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను దివి. 30-07-2026 సా.4.00 వరకు కోరుచు నిర్ణయించిన బిడ్ మొత్తము పై ఎక్కువ మొత్తం వేలం పాటలో పాల్గొనుటకు దివి. 31-07-2026 నిర్ణయించి తెలియజేయనైనది.

పై విషయముల విధి నియమాల గురించి వరంగల్ మహా నగర పాలక సంస్థ హెడ్ ఆఫీస్ (ప్రజారోగ్య విభాగం) నందు రూ.500/- చెల్లించి పొందగలరు, ఈ కార్యాలయ వెబ్‌సైట్ https://www.gwmc.gov.in/Tenders.aspx

సం/- కమీషనర్
వరంగల్ మహానగర పాలక సంస్థ

DIPR R.O. No. : 6694-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T-0699 | Boddu Rajaiah | TATA LPT 3118 CUMMINS FBT-T | 2016 |
| 2 | TS27B 4815 | Attem Ramesh | ZEST 1.3L XT QUADRAJET 90PS DIESEL 5 SEATER | 2018 |
| 3 | TG25T 0568 | Sunchu Roja | MARUTI DZIRE BS6 PETROL-P | 2022 |
| 4 | TS04UB 6965 | Raghu Ambati | MAHINDRA BOLERO MAXI TRUCK PLUS | 2016 |
| 5 | AP29BP 4288 | Repakula Srinivas Rao | I20 I GEN MAGNA (O) DIESEL 5 SEATER | 2011 |
| 6 | TS12UA 7647 | Marati Madhu | 275IDI07ATYS04360 | 2016 |
| 7 | TS28TA-0277 | Shekar Marapaka | TATA SIGNA 4223.TK FBT | 2019 |
| 8 | TS07ER-1158 | Bonagani Raju | ZEST 1.2L XE REVOTRON 90PS PETROL 5 SEATER | 2015 |
| 9 | TS07EG-2483 | Naresh Gajula | SWIFT DZIRE VXI PETROL 5 SEATER | 2014 |
| 10 | TS10EH-8001 | Pidisilla Veerachari | SCROSS 1.6L ALPHA DIESEL 5 SEATER | 2016 |


AUCTION DATE : 25-07-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
1st Floor H.No. 6-159, Above DCC Bank Reddy Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District - 506169.
Cell : 9849981545, 9949340057

# ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా దాడులు



**జెరుసలేం :** అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా వరుసగా 13వ రాత్రి కూడా ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడులు ముగిసిన కొద్ది గంటలకే బహ్రెయిన్‌లో క్షిపణి లేదా రాకెట్ దాడుల ముప్పు గుర్తించిన అధికారులు హెచ్చరిక సైరన్లు మోగించి, ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. గత వారం రోజులుగా గల్ఫ్ దేశాలు తరచూ దాడుల ముప్పును ఎదుర్కొంటున్నాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం, హోర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించే వాణిజ్య నౌకలు, పౌర నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని బలహీనపరచడమే తాజా దాడుల ప్రధాన ఉద్దేశం. ఈ జలసంధి మీదుగా సాధారణ పరిస్థితుల్లో ప్రపంచ చమురు, సహజవాయు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరుగుతుంది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, అమెరికా క్షిపణి దాడుల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఇదే సమయంలో యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు మరో కీలక సముద్ర మార్గమైన 'బాబ్ ఎల్ మండెబ్' జలసంధిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు.
ఎర్ర సముద్రాన్ని ఏడెన్ అఖాతంతో కలిపే ఈ మార్గం గుండా ప్రపంచ వాణిజ్యంలో సుమారు 12 శాతం, కంటైనర్ రవాణాలో దాదాపు నాలుగో వంతు జరుగుతుంది. ఇప్పటికే హౌతీలు ఎర్ర సముద్రంలో రెండు సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేసినట్లు ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, బాబ్ ఎల్ మండెబ్‌లో కూడా అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య వ్యవస్థలకు తీవ్ర దెబ్బ తగలొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో హౌతీలు నౌకలపై దాడులు కొనసాగిస్తే తీవ్రమైన సైనిక ప్రతిస్పందన ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ హెచ్చరించారు.

## ప్రపంచ దేశాలపై మరోసారి
# ట్రంప్ టారిఫ్ దెబ్బ



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ మరోసారి తన వాణిజ్య విధానాన్ని కఠినతరం చేశారు. ప్రపంచంలోని కనీసం 60 దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను (టారిఫ్‌లు) విధిస్తున్నట్లు ప్రకటించారు. 'బలవంతపు శ్రమ'తో తయారైన వస్తువుల దిగుమతిని అరికట్టడంలో ఆయా దేశాలు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ, ఈ నిర్ణయానికి ఆయన ప్రభుత్వం వివరణ ఇచ్చుకుంది. ఇప్పటికే అమలు చేస్తున్న టారిఫ్ గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికాలో దాదాపు శతాబ్దకాలంగా బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతిపై నిషేధం అమలులో ఉందని, ఇతర దేశాలు కూడా అదే స్థాయిలో చట్టాలను అమలు చేయాలని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. ఈ కొత్త విధానం ప్రకారం, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతిని నిరోధించే చట్టాలు లేని లేదా వాటిని సమర్థంగా అమలు చేయని దేశాలపై 12.5 శాతం సుంకం విధిస్తున్నారు. ఈ జాబితాలో చైనా, ఇజ్రాయెల్, బ్రిటన్, జపాన్ వంటి దేశాలు ఉన్నాయి. మరోవైపు, భారత దేశం, శ్రీలంక, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఇప్పటికే అలాంటి చట్టాలను అమలు చేస్తున్నాయని అమెరికా గుర్తించింది. అయితే, వాటి అమలులో మరింత కఠినత్వం అవసరమని పేర్కొంటూ ఈ దేశాలపై 10 శాతం సుంకాన్ని కొనసాగించింది. అందువల్ల భారతదేశంపై కొత్తగా అదనపు భారం పడలేదు. ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతం సుంకమే కొనసాగుతుంది. కాగా, ఈ నిర్ణయం వెనుక మరో ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక కోణం కూడా ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వారి అభిప్రాయాన్ని అనుసరించి, అమెరికా సుప్రీం కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ గతంలో విధించిన 'లిబరేషన్ డే' టారిఫ్‌లను చట్టపరంగా కొట్టివేయడంతో, వాటికి బదులుగా కొత్త చట్టపరమైన ఆధారాలతో సుంకాలను కొనసాగించే ప్రయత్నం ట్రంప్ ప్రభుత్వం చేస్తోంది. బలవంతపు శ్రమ నిరోధక చట్టాలను ఈసారి ప్రధాన ఆధారంగా ఉపయోగించింది. భారత్‌కు తక్షణంగా పెద్ద నష్టం కనిపించకపోయినా, అమెరికా మార్కెట్‌కు ఎగుమతులు చేసే భారత కంపెనీలు ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతం అదనపు సుంకాన్ని భరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు వంటి రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో చైనాపై 12.5 శాతం సుంకం విధించడం వల్ల కొన్ని ఉత్పత్తుల తయారీలో భారత్‌కు పోటీ ప్రయోజనం లభించే అవకాశాన్ని కూడా కొందరు ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ట్రంప్ ప్రభుత్వం ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. అధిక ఉత్పత్తి సామర్థ్యానికి ప్రభుత్వ సబ్సిడీలు ఇస్తున్న దేశాల నుంచి వచ్చే తక్కువ ధరల వస్తువులపై కూడా మరో విడత సుంకాలు విధించే యోచనలో ఉన్నట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. ఈ చర్యలు ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో కొత్త ఉద్రిక్తతలకు దారితీసే అవకాశముంది. భవిష్యత్తులో అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో కీలక అంశంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

## 14 ఇయు సంస్థలపై చైనా ఎగుమతి నియంత్రణ

**బీజింగ్ :** రష్యాపై ఆంక్షల విషయంలో యూరోపియన్ యూనియన్ (ఇయు), చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రష్యాకు సహకరిస్తున్నాయనే ఆరోపణలతో ఇయు తాజాగా 14 చైనా, హాంకాంగ్‌కు చెందిన సంస్థలపై ఆంక్షలు విధించగా, దానికి ప్రతిస్పందనగా చైనా కూడా 14 యూరోపియన్ సంస్థలపై ఎగుమతి నియంత్రణలు విధించింది. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించిన నిర్ణయం ప్రకారం, ఇకపై ఆ 14 యూరోపియన్ సంస్థలకు 'డ్యూయల్‌యూజ్' ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి చైనా కంపెనీలకు అనుమతి ఉండదు. డ్యూయల్‌యూజ్ ఉత్పత్తులు అంటే పౌర అవసరాలకు, అలాగే సైనిక అవసరాలకు కూడా ఉపయోగపడే వస్తువులు, సాంకేతిక పరిజ్ఞానం. అంతేకాకుండా, విదేశీ కంపెనీలు కూడా చైనాలో తయారైన ఇలాంటి ఉత్పత్తులను ఆయా యూరోపియన్ సంస్థలకు సరఫరా చేయరాదని బీజింగ్ స్పష్టం చేసింది. ఈ ఆంక్షలతో ప్రభావితమయ్యే సంస్థల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన వాహన తయారీ సంస్థ టాట్రా ట్రక్స్, ఇటలీకి చెందిన విద్యుత్ మోటార్ల తయారీ సంస్థ లాఫెర్ట్ ఎస్‌పిఎ, జర్మనీకి చెందిన సింగ్ల్ హౌజర్ మెటీరియల్స్ జిఎంబిహెచ్, ఫ్రాన్స్‌కు చెందిన డ్రోన్ తయారీ సంస్థ కావోక్ యుఎవిఎస్ ఉన్నాయి. ఉక్రేన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు సైనిక, సాంకేతిక సామగ్రి అందుతున్న మార్గాలను అడ్డుకునేందుకు ఇయు ఇటీవల 21వ విడత ఆంక్షలను అమలు చేసింది. ఇందులో రష్యాతో పాటు చైనా, భారత్, టర్కీకి చెందిన కొన్ని సంస్థలు కూడా ఉన్నాయి.

## ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాల సమీపంలో వరుస పేలుళ్లు



**ఇర్బిల్ :** ఇరాక్ ఉత్తర ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరం సమీపంలో శుక్రవారం ఉదయం వరుస పేలుళ్లు సంభవించాయి. అమెరికా సైన్యం ఇరాన్‌పై వరుసగా 13వ రాత్రి వైమానిక దాడులను ముగించినట్లు ప్రకటించిన కొన్ని గంటలకే ఈ ఘటన చోటుచేసుకోవడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఇరాక్‌లోని స్వయంప్రతిపత్తి కలిగిన కుర్దిష్ ప్రాంత రాజధాని ఇర్బిల్‌లో ఉదయం సుమారు 9.30 గంటలకు కనీసం ఏడు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అనంతరం అమెరికా స్థావరం లోపల లేదా సమీప ప్రాంతాల నుంచి నల్లటి పొగలు ఎగసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం విషయంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా తాజాగా ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, తొమ్మిది మంది గాయపడినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మరోవైపు ఈ దాడుల ఉద్దేశం హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని బలహీనపరచడమేనని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ ఉద్రిక్తతల మధ్య బహ్రెయిన్‌లో క్షిపణి హెచ్చరిక సైరన్లు రెండుసార్లు మోగించగా, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఇరాక్ ప్రధాని అలీ అల్ జైదీ శాంతి చర్చల కోసం టెహ్రాన్‌లో పర్యటిస్తూ, ఇరాక్ భూభాగాన్ని ఇరాన్‌పై దాడులకు వినియోగించనివ్వబోమని ప్రకటించారు. ఇదే సమయంలో ఇరాన్ మరో కీలక సముద్ర మార్గమైన బాబ్ ఎల్ మండెబ్ జలసంధిలో కూడా నౌకాయానాన్ని అడ్డుకునే హెచ్చరికలు జారీ చేయడంతో ప్రపంచ వాణిజ్యానికి కొత్త సవాళ్లు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది.

## నిరశన విరమణ
**(మొదటి పేజీ తరువాయి)**

రాజీనామా చేయకపోవడం వల్ల విద్యార్థులకు పెద్దగా నష్టం లేదు. కానీ, ధర్మేంద్రకు ఉన్న గుర్తింపు మాత్రం పోతుంది. ఒకవేళ ఆయన రాజీనామా చేసి ఉంటే, తన పేరు చెడిపోకుండా ఉండేది' అని సోనమ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఉండకూడదని, కేసులు నమోదైతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయం తనకు తెలుసన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని సోనమ్ తెలిపారు. పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని ఆయన వెల్లడించారు. వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించినట్లు ప్రకటించిన తర్వాత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో వైద్యుల సలహా మేరకు సోనమ్ జీ తన దైనందిన జీవనశైలిని పాటించాలని, వీలైనంత త్వరగా తన బరువును తిరిగి పొందాలని కోరుకుంటున్నాన్నారు. కాగా, ఆసుపత్రిలో వాంగ్‌చుక్ భార్య గీతాంజలి అంగ్మో, ఇతరుల సమక్షంలో నడ్డా ప్రభుత్వ హామీలను చదివి వినిపించారు. 'ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఈనెల 20న పార్లమెంటుకు జరిగిన పాదయాత్రలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయకపోవడం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. పరీక్షలకు సంబంధించిన పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలపై పార్లమెంటులో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది' అని తెలిపారు. అంతేకాకుండా, ఇటీవలి నీట్ పేపర్ లీక్ ఘటనల కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితులకు తగిన పరిహారం అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోంని పేర్కొన్నారు. అయితే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మొత్తం 65 మంది పార్లమెంటు సభ్యులు తనను సందర్శించారని లేదా దీక్షను విరమించాలని కోరుతూ లేఖలపై సంతకాలు చేశారని వాంగ్‌చుక్ తెలిపారు. 'వివిధ షరతులపై సుదీర్ఘ చర్చల తర్వాత, దేశంలో హింస చెలరేగే అవకాశం ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆ షరతుల గురించి త్వరలోనే ఒక ప్రత్యేక వీడియోలో వివరంగా వివరిస్తాను. ఈలోగా, ఎక్కడా ఎటువంటి హింసకూ తావు లేకుండా చాలా అప్రమత్తంగా ఉండాలని మీ అందరినీ కోరుతున్నాను' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ప్రధాన్ రాజీనామా చేసే వరకు శాంతియుత నిరసన : సిజెపి**

పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన 26 రోజుల నిరాహార దీక్షను విరమించడం పట్ల 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) శుక్రవారం కృతజ్ఞతలు తెలిపింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ వద్ద తమ శాంతియుత నిరసన కొనసాగుతుందని స్పష్టం చేసింది. వాంగ్‌చుక్ చూపిన 'అసాధారణ ధైర్యసాహసాలకు, త్యాగానికి' ధన్యవాదాలు అని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో వెల్లడించారు. 'సోనమ్ 26 రోజుల తర్వాత తన నిరాహార దీక్షను విరమించడం ఎంతో ఉపశమనం కలిగించింది, మేము కృతజ్ఞతతో ఉన్నాము. మీఅసాధారణ ధైర్యసాహసాలకు ధన్యవాదాలు సార్. మీ ప్రాణాలను పణంగా పెట్టి, యావత్ దేశ మనస్సాక్షిని మేల్కొల్పారు అని దీప్కే అన్నారు.

## రాజీ ప్రసక్తే లేదు
**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. మంత్రులు తమ డిమాండ్లను విన్నారని, తదుపరి వివరాలతో సిజెపిని సంప్రదిస్తామని నడ్డా చెప్పారని, నివారం మళ్లీ సమావేశం అవుతామని దాస్ చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర మంద్రులకు తెగేసి చెప్పినట్లు సమావేశం తర్వాత దాస్ విలేకరులకు వెల్లడించారు. ఈ సమావేశంలో దాస్‌తో పాటు జూన్ 20న జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన నిరసనలకు నాయకత్వం వహిస్తున్న సిజెపి తరపున ఆ పార్టీ ప్రతినిధి అశుతోష్ రంకా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం డిమాండ్‌తో పాటు, నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కూడా సిజెపి డిమాండ్ చేసిందని దాస్ చెప్పారు. రెండు ప్రధాన డిమాండ్లకు కేంద్రం అంగీకరించిందన్నారు. అయితే, మరో ప్రధాన డిమాండ్ విషయంలో కేంద్రం సమయం కోరిందన్నారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ విషయంలో కేంద్రం ఒక రోజు గడువు కోరిందన్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వానికి రాసిన లేఖలో సిజెపి తన వైఖరిని స్పష్టం చేసింది. 'పరస్పర ప్రయోజనకరమైన పరిష్కారాన్ని కనుగొనడంలో ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని గుర్తించిన ఆ పార్టీ, గత కొన్ని రోజులుగా, దేశవ్యాప్తంగా ఉన్న మద్దతుదారులు, సభ్యులు, జంతర్ మంతర్ వద్ద ఉన్న నిరసనకారులతో మేము విస్తృత సంప్రదింపులు జరిపాము. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నీట్ బాధితులకు రూ. 1 కోటి పరిహారం, నిరసనకారులపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అనే మా డిమాండ్ల విషయంలో ఎలాంటి రాజీ లేదనే స్పష్టమైన ఏకాభిప్రాయానికి వచ్చాము' అని పేర్కొంది. అంతేకాకుండా, బలగాల చేతిలో దారుణంగా దాడికి గురైన విద్యార్థులకు భారత ప్రభుత్వం, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) అధిపతి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ డిమాండ్లను వీలైనంత త్వరగా అంగీకరించాలని కూడా ఆ సంస్థ కోరింది. లేనిపక్షంలో, ఈ ఉద్యమం మరింత ఉధృతమై దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని హెచ్చరించింది.
అంతేకాకుండా, పరీక్షల సంస్కరణలపై మా ఐదు సూత్రాల డిమాండ్ల పత్రంపై ప్రభుత్వం స్పందించాలని ఆశిస్తున్నామని తెలిపింది. విద్యా వ్యవస్థలో అవసరమైన పెద్ద నిర్మాణాత్మక సంస్కరణలను తీసుకురావడంలో ఈ పత్రం కీలక పాత్ర పోషిస్తుంది అని ఆ లేఖలో పేర్కొన్నారు. సిజెపికి, ప్రభుత్వానికి మధ్య జరిగిన మూడవ అధికారిక సమావేశం ఇది. 20న మంత్రి నివాసంలో నడ్డా, దాస్, రాంకాలతో వరుసగా రెండు సమావేశాలు నిర్వహించారు. అదే రోజు 'సంసద్ చలో' పిలుపునకు వేలాది మంది నిరసనకారులు స్పందించి పార్లమెంటు వైపు ర్యాలీ ప్రారంభించగా, పోలీసులు లాఠీలు, బాష్ప వాయువుతో వారిని వెనక్కి నెట్టారు. ఈ ఘటనలో అనేక మంది గాయపడ్డారు.

## కేంద్రానికి సమగ్ర నివేదిక
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రస్తుతం డిపిఆర్ ప్రాసెసింగ్ ముందుకు సాగడం లేదని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను ఫ్రీఫ్లో (నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్డీఎస్‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే నివేదికకు జతచేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.
బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదనే విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే నివేదిక అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా స్వయంగా అందజేయాలన్నారు.
కాగా ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డిఎస్‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీఫ్లో విధానంలో కొనసాగించాలనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దీనిపైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం,ఎన్డీఎస్‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు.

**అన్నారం బ్యారేజీలో నీటి నిల్వ సురక్షితం కాదు.. నీటి పారుదల శాఖ అధికారులు**

అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్టు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని నీటి పారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు వివరించారు.కనిపించే నీరు ఒక్కటే ప్రమాణం కాదని, పంపింగ్‌కు శాస్త్రీయ పరిస్థితులు తప్పనిసరిఅని వివరించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నందుకే పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి ప్రకటన
**(మొదటి పేజీ తరువాయి)**

చర్చిస్తాం. సహచర మంత్రుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు. సోమవారం నాడు పార్లమెంటు వర్షాకాల సమావేశాల రెండో వారం ప్రారంభం కానుందని, ఆ సమయంలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకునేలా రూపొందించిన బిల్లును సభలో ప్రవేశపెట్టి, వీలైనంత త్వరగా ఆమోదింపజేసేందుకు ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీకేజీ అనేది చిన్న విషయం కాదని, లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇటువంటి ఘటనలు ఎంతో బాధాకరమని తనకు తెలుసని ప్రధాన మంత్రి అన్నారు. అందుకే, సుమారు రెండున్నర నెలల క్రితం నీట్ పేపర్ లీక్ ఆరోపణలు వెలుగుచూసినప్పటి నుండి అనేక కఠిన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. 'బాధ్యులైన వారిని పట్టుకున్నాం, వారు ఇప్పుడు జైలులో ఉన్నారు. విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా చూడటమే మా అత్యంత ముఖ్యమైన బాధ్యత. పరీక్షను వెంటనే నిర్వహించడం అవసరం. అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించుకుని, 22 లక్షల మంది విద్యార్థులు తిరిగి నిర్వహించిన పరీక్షకు హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది' అని ఆయన చెప్పారు. వైద్య విద్య ప్రవేశ పరీక్ష (రీటెస్ట్) ఫలితాలు 19న వెలువడ్డాయని, ఇందులో విజయం సాధించిన వారి నుంచి దేశవ్యాప్తంగా సంతోషకరమైన స్పందనలు వచ్చాయని మోదీ పేర్కొన్నారు. అయితే, కేవలం ఇంతటితోనే సంతృప్తి చెందే వారిలో తాను లేనని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. 'అందుకే, వేగవంతమైన విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలను (ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు) ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. ఆ మేరకు ఇప్పటికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు అని ఆయన చెప్పారు.

## 'ఎక్స్'లో ప్రకటనలా? (మొదటి పేజీ తరువాయి)

మాధ్యమాల ద్వారా ప్రకటన చేయడం ఏమిటని ప్రధానిని నిలదీశారు. పార్లమెంటుకు వచ్చే ముందే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని సూచించారు. మంత్రిని డిస్మిస్ చేసిన తర్వాతే పార్లమెంటు సమావేశాలకు ప్రధాని హాజరుకావాలని అన్నారు. అదే విధంగా, విద్యార్థులపై లాఠీఛార్జి చేయడానికి, డమ్మీ తూటాలు వాడడానికి ఆదేశాలిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సభా ముఖంగా హామీ ఇవ్వాలని కోరారు. అంతేగాక, విద్యార్థులకు మోదీ క్షమాపణ చెప్పాలని, అప్పుడే విద్యా విధానంపై చర్చకు తాము సహకరిస్తామని ఖర్గే స్పష్టం చేశారు.

## వీకెండ్ టెన్షన్
**(మొదటి పేజీ తరువాయి)**

ఆలస్యంగా నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ధర్నా పరిసరాలలో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగిస్తున్నారు. ఢిల్లీకి చేరుకున్న వారిని జంతర్ మంతర్ వెళ్ళకుండా పోలీసులు ఇప్పటికే నిరుత్సాహపరుస్తున్నారు. ఎలాంటి వాహన, మెట్రో సౌకర్యాలు లేనప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు కాలి నడకనే వ్యయప్రయాసలకోర్చి చేరుకుంటున్నారు. ఇదిలా ఉండగా, శని,ఆదివారాల్లో పెద్ద ఎత్తున జనం వచ్చే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రే తమను అరెస్టు చేసే అవకాశం ఉందని సిజెపి అధ్యక్షుడు అభిజీత్ దిప్కే అనుమానం వ్యక్తం చేశారు. తమను అరెస్టు చేసినా, ధర్నాను కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు.

**ఎన్నడూ లేనంత స్థాయికి ఉద్యమం: అభిజీత్ దిప్కే**

సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల తర్వాత తన నిరశన దీక్షను విరమించడం మాకు ఉపశమనాన్ని కలిగించిందని దీప్కే అన్నారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల్లో నిరసనలు విస్తరించాయని, ఈ ఉద్యమం గతంలో ఎన్నడూ లేనంతగా బలపడిందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, ఆయన రాజీనామా చేసే వరకు దేశ యువత వెనక్కి తగ్గబోరని స్పష్టం చేశారు.

**ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలు ఏర్పాటు**

జంతర్ మంతర్ వద్ద ముఖ గుర్తింపు కెమెరాలను ఏర్పాట్లు చేశారు. 'అసాంఘిక శక్తులు, నేరస్తులు, వాంటెడ్ నేరస్తులు జంతర్ మంతర్ నిరసన ప్రాంతంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి, జంతర్‌మంతర్ చుటూ వివిధ ప్రదేశాలలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసు వర్గాల సమాచారం. గతంలో కూడా ఇలా పెట్టామని, సరిహద్దు ఆవల ఉన్న ఉగ్రవాద సంస్థలు కూడా విద్యార్థుల నిరసనలను గమనిస్తున్నాయని, దేశంలో అశాంతిని సృష్టించడానికి కుట్ర పన్నుతున్నాయని ఢిల్లీ పోలీసులకు, కేంద్ర సంస్థలకు సమాచారం అందిందని అని ఆ వర్గాలు పేర్కొన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

**పోలీసులను గుర్తించేందుకు సిజెపి వెబ్‌సైట్**

జూలై 20న విద్యార్థులపై జరిగిన దాడిలో పాల్గొన్న పోలీసులను గుర్తించి, చట్టపరమైన చర్యలను కోరేందుకు వీలుగా సిజెబి వెబ్‌సైట్‌ను ప్రారంభించనుంది.జూలై 20న జరిగిన 'సంసద్ చలో' మార్చ్ లాఠీఛార్జ్, దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిని గుర్తించేందుకు, నిరసనకారుల నుండి ఫోటోలు, వీడియోలను సేకరించే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నట్లు సిజెపి శుక్రవారం ప్రకటించింది. ఆ అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పార్టీ తెలిపింది. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ పోలీసులు విద్యార్థులపై దాడి చేశారని, మహిళా నిరసనకారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. తాము గతంలోనే విద్యార్థులపై దాడి చేసిన, వారిని గాయపరిచిన, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రతి అధికారిని హెచ్చరించామని, తాము ఊరుకోబోమని, ప్రతి విషయాన్నీ గుర్తుంచుకుంటామని తెలిపారు. దాడి చేసిన పోలీసు సిబ్బందికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తించిన అధికారులపై ఢిల్లీ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోతే, తమ పార్టీ కోర్టులను ఆశ్రయిస్తుందని చెప్పారు.

**డియు, జెఎన్‌యు విద్యార్థులపై ఆంక్షలు**

జంతర్ మంతర్ వద్ద లేదా దాని పరిసరాల్లో జరిగే నిరసన ప్రదర్శనలలో పాల్గొనవద్దని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జెఎన్‌యు) శుక్రవారం ఒక ప్రకటనలో తమ విద్యార్థులను కోరింది.
గతంలోనే ఢిల్లీ యూనివర్సిటీ (డియు) ఇలాంటి ప్రకటన చేసింది. జెఎన్‌యు పరిధిలోని విద్యాసంస్థల భాగస్వాములందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జెఎన్‌యు ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదర్శనలపై భారత సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా, జంతర్ మంతర్ వద్ద లేదా దాని పరిసరాల్లో జరిగే సమావేశాలలో పాల్గొనవద్దని లేదా వాటిని సందర్శించవద్దని విద్యార్థులను కోరారు.

## జనావాసాల్లోనే..
**(మొదటి పేజీ తరువాయి)**

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సిఎం అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు. సంబంధిత నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్, డిజిపి సి.వి. ఆనంద్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, గృహనిర్మాణ శాఖ స్పెషల్ సెక్రెటరీ వి.పి.గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ.5 లక్షల భారీ సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమి ధరను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7 వేల 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీ హిల్స్, కార్వాన్, బహదూర్‌పూరా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది.

## దాడి అమానుషం
**(మొదటి పేజీ తరువాయి)**

విద్యార్థి నాయకులు హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆవేదనను అణచివేయడానికి పోలీసు దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీకి వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు ప్రకటించాయి. ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలు, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన మంత్రిని ఇప్పటికీ పదవిలో కొనసాగిస్తూ ప్రధాని మోదీ ఎందుకు రక్షిస్తున్నారని ప్రశ్నించారు. ఎఐఎస్‌ఎఫ్ కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విశ్వసనీయత కోల్పోయిన ఎన్‌టిఎను వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన, విద్యార్థులకు న్యాయం చేసే ప్రవేశ పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో జరిగిన బంద్ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి, విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు టి.నాగరాజు (ఎస్‌ఎఫ్‌ఐ), ఎస్.అనిల్ (పిడిఎస్‌యు), పి.మహేష్, పి.నాగరాజు (పిడిఎస్‌యు), పల్లె మురళీ, గడ్డం నాగార్జున (ఎఐఎఫ్‌డిఎస్), నవీద్ హకీమ్ (ఎఐఎస్‌బి), గోపాల్ (ఎఐపిఎస్‌యు), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ (డివైఎఫ్‌ఐ), పెద్దింటి రామకృష్ణ (పివైఎల్), వనం సుధాకర్ (ఎఐఎఫ్‌డివై), ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రెహమాన్, చైతన్య అనిల్, జోసెఫ్, అన్వర్, హరీష్, అరుణ్, ఎఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, యువజనులు, అధ్యాపకులు, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పారా స్విమ్మింగ్ ఫైనల్లో కార్తీక్, ఇమామ్

# 90 కిలోలపై సందిగ్ధంలో ఒలింపిక్ విజేత



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్విమ్మర్లు అదరగొడుతున్నారు. పురుషుల పారా 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ ఎస్ 13 విభాగంలో కార్తిక్ బుడిగిన , అలీ ఇమామ్‌లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో సత్తా చాటిన శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. అయితే.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను మూడోసారి పసిడి పట్టేస్తుందనుంటే.. 90 కిలోల విభాగంలో 100 శాతం తన సామర్థ్యాన్ని వినియోగించలేని పేర్కొంది. తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడుతున్న కార్తీక్ బుడిగిన, అలీ ఇమామ్‌లో ఈత కొలనులో మెరిశారు. చూపు సరిగా లేని ఇద్దరూ పారా స్విమ్మింగ్ పోటీల్లో ఫైనల్ చేరి పతకానికి అడుగుదూరంలో నిలిచారు. కార్తిక్ 57.10 సెకన్లలో స్విమ్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలవగా.. ఎస్ 12 ఈవెంట్లో 1:05.32 టైమింగ్‌తో అలీ ఫైనల్ బెర్తు సాధించాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో ఫైనల్ బెర్తు కోసం శ్రీహరి నటరాజ్ శనివారం ఉదయం 12:30గంటలకు ఈతకు సిద్ధమవ్వనున్నాడు.

## 'ఫిడే' సింహాసనంపై భారత చెస్ దిగ్గజం



భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌కు అరుదైన గౌరవం లభించింది. చదరంగం ఆటలో సుదీర్ఘ అనుభవమున్న ఆనంద్ అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) మధ్యంతర అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన.. కొన్ని రోజులు తాత్కాలిక ప్రెసిడెంట్‌గా సేవలందిచనున్నాడు. ప్రస్తుత అధ్యక్షుడు అర్కాడీ ద్వొర్కోవిచ్‌పై యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడంతో తాత్కాలిక ప్రాతిపదికన భారత లెజెండ్‌కు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టింది ఫిడే. ఈ విషయాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా అధికారికంగా వెల్లడించింది సంస్థ.


భారత మొట్టమొదటి గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఫిడే తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. ప్రస్తుతం ప్రెసిడెంట్‌గా ఉన్న అర్కాడీ ద్వొర్కోవిచ్‌పై యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడంతో ఆనంద్ కొన్నిరోజులు ఈ పదవిలో కొనసాగనున్నాడు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్నందున.. రష్యా ఆటగాళ్లను అర్కాడీ లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహించిన యూరోపియన్ యూనియన్ ఆయనపై వేటు వేసింది.

2012 నుంచి 2018 మధ్య కాలంలో రష్యా ఉపప్రధానిగా పనిచేసిన ఆర్కాడీ.. ఆపై ఫిడే అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 2018 ఎన్నికల్లో గెలుపొందిన ఆయన.. 2022లో మళ్లీ విజయం సాధించడంలో ఆనంద్ కీలక పాత్ర పోషించాడు. దాంతో.. భారత దిగ్గజం ఫిడే ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. అయితే.. అర్కాడీపై ఆంక్షల నేపథ్యంలో అధ్యక్ష పదవి ఖాళీ అవ్వడంతో.. డిప్యూటీ ఆనంద్‌ను ప్రమోట్ చేసింది ఫిడే. తనను అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆనంద్ ఫిడేకు ధన్యవాదాలు తెలిపాడు.

## సైన్స్

### జీవ ఆవిర్భావ పరిశోధనల్లో ముందడుగు

అంతరిక్షంలో జీవం ఆవిర్భావ రహస్యాలను ఛేదించే దిశగా శాస్త్రవేత్తలు మరో కీలక ముందడుగు వేశారు. నక్షత్రాల మధ్య ఉన్న అంతరిక్ష వాయు మేఘాల్లో 'ఎరిథ్రులోజ్' అనే నాలుగు కార్బన్ అణువులు కలిగిన 'సుగర్'ను తొలిసారిగా గుర్తించారు. ఈ పరిశోధన ఫలితాలు 'నేచర్ ఆస్ట్రొనమీ' పత్రికలో ప్రచురితమయ్యాయి. జీవం ఏర్పడేందుకు అవసరమైన రసాయన ప్రక్రియల్లో చక్కెరలకు అత్యంత కీలక పాత్ర ఉంది. ముఖ్యంగా ఆర్ఎన్ఏ వంటి జన్యు పదార్థాల నిర్మాణానికి అవసరమైన న్యూక్లియోటైడ్లు ఏర్పడేందుకు ఎరిథ్రులోజ్ వంటి చక్కెరలు ఉపయోగపడతాయని గత ప్రయోగాలు సూచించాయి. ఇప్పటివరకు రైబోజ్, గ్లూకోజ్ వంటి చక్కెరలను గ్రహశకలాలు, ఉల్కల్లో గుర్తించినప్పటికీ, నక్షత్రాల మధ్య అంతరిక్షంలో ఇలాంటి మోనోశాకరైడ్ చక్కెరను గుర్తించడం ఇదే తొలిసారి. పరిశోధకుల అంచనా ప్రకారం, సుమారు 410 కోట్ల నుంచి 390 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఉల్కలు, గ్రహశకలాలు విస్తృతంగా ఢీకొన్న కాలంలో అంతరిక్ష ధూళి ద్వారా ఈ చక్కెర భూమికి చేరి ఉండవచ్చు.



నీటి సమక్షంలో ఇది మరింత సంక్లిష్టమైన జీవరసాయన పదార్థాలుగా మారే సామర్థ్యం కలిగి ఉండటంతో, తొలి జన్యు అణువులు ఏర్పడటంలో ఇది పాత్ర పోషించి ఉండవచ్చు. ఈ ఆవిష్కరణతో అంతరిక్షమే జీవానికి అవసరమైన రసాయన పదార్థాల నిలయమనే అభిప్రాయానికి మరింత బలం చేకూరింది. భూమిపైనే కాకుండా విశ్వంలోని ఇతర గ్రహాలపై కూడా జీవం ఆవిర్భవించడానికి అవసరమైన ప్రాథమిక రసాయనాలు అంతరిక్షం నుంచే అందే అవకాశం ఉందని ఈ అధ్యయనం సూచిస్తోంది. భవిష్యత్తులో జీవం ఆవిర్భావానికి మరింత కీలకమైన రైబోజ్ వంటి చక్కెరలను కూడా అంతరిక్షంలో గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


### అక్కడ.. దట్టమైన వాతావరణం!



భూమికి వెలుపల ఉన్న '55 క్యాన్క్రి–ఇ' అనే అత్యంత వేడిగా ఉండే గ్రహంపై దట్టమైన వాతావరణం ఉండే అవకాశాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ సేకరించిన తాజా పరిశీలనల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ గ్రహంపై ఉష్ణోగ్రతలు రాళ్లు కూడా కరిగిపోయేంత తీవ్రంగా ఉంటాయి. అందువల్ల దీని ఉపరితలం ఎక్కువ భాగం కరిగిన లావాతో కప్పబడి ఉంటుందని భావిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన వేడి ఉన్నప్పటికీ, ఈ గ్రహం చుట్టూ వాయువులతో సమృద్ధిగా కూడిన దట్టమైన వాతావరణం ఉండే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు.

ఈ వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నీటి ఆవిరి వంటి అస్థిర వాయువులు ఉండవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. లావా నుంచి వెలువడే వాయువులే ఈ వాతావరణాన్ని నిరంతరం పునరుద్ధరిస్తూ ఉండవచ్చని వారు భావిస్తున్నారు. భూమికి పూర్తిగా భిన్నమైన పరిస్థితులు ఉన్న గ్రహాలు ఎలా ఏర్పడతాయి? వాటి వాతావరణం ఎలా నిలకడగా ఉంటుంది? వంటి ప్రశ్నలకు ఈ పరిశోధన కొత్త ఆధారాలను అందిస్తోంది. అలాగే సౌర కుటుంబం వెలుపల ఉన్న అతివేడి రాతి గ్రహాల స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో ఇది కీలక ముందడుగుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### మారిన భూమి ముఖచిత్రం!




అపోలో–8 యాత్ర (1968)లో వ్యోమగామి విలియం ఆండర్స్ తీసిన 'ఎర్త్‌రైజ్' చిత్రం అంతరిక్ష చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. చంద్రుడి నిర్జన ఉపరితలం వెనుక నుంచి నీలిరంగు భూమి ఉదయిస్తున్న ఆ దృశ్యం ప్రపంచానికి ఒక కొత్త దృక్పథాన్ని అందించింది. మన గ్రహం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో ఆ చిత్రం మానవాళికి గుర్తుచేసింది. అనంతరం పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు అది ఒక ప్రతీకగా మారి, 1970లో ప్రారంభమైన 'ఎర్త్ డే' ఉద్యమానికి కూడా ప్రేరణనిచ్చింది. దాదాపు 58 సంవత్సరాల తర్వాత, నాసా చేపట్టిన ఆర్టెమిస్ II యాత్రలో వ్యోమగాములు చంద్రుడి సమీపం నుంచి భూమి దిగువకు జారుతున్న మరో అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించారు. దీనిని 'ఎర్త్‌సెట్'గా పిలుస్తున్నారు. ఈ చిత్రాన్ని మొత్తం సిబ్బంది తరఫున విడుదల చేయడం విశేషం. ఆధునిక ఉపగ్రహాలు ప్రతిరోజూ భూమి లక్షలాది చిత్రాలను పంపుతున్నప్పటికీ, ఒక మనిషి కళ్లతో చూసి తీసిన ఈ చిత్రం ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుంది. ఈ రెండు చిత్రాలు కేవలం అందమైన దృశ్యాలను మాత్రమే చూపించడం లేదు. గత ఆరు దశాబ్దాల్లో భూమిపై జరిగిన పర్యావరణ మార్పులకు కూడా సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ కాలంలో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌కు పైగా పెరిగింది. అడవుల నరికివేత, నగరాల విస్తరణ, వ్యవసాయ భూముల పెరుగుదల, ఆరల్ సముద్రం వంటి భారీ జలాశయాల క్షీణత వంటి మార్పులు భూమి రూపురేఖలను మార్చేశాయి. అంతేకాకుండా అంటార్కిటికాలో వేలాది చదరపు కిలోమీటర్ల మంచు ఫలకాలు కూలిపోవడం, రెండు ధ్రువాల్లో సముద్ర మంచు తగ్గిపోవడం వంటి పరిణామాలు వాతావరణ మార్పుల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ మార్పుల్లో అత్యధిక భాగానికి మానవ కార్యకలాపాలే కారణం. అయినప్పటికీ, అంతరిక్షం నుంచి చూస్తే భూమి ఇప్పటికీ అందంగా, ప్రశాంతంగా కనిపిస్తుంది. కానీ ఆ అందం వెనుక దాగి ఉన్న పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించడం కూడా అంతే అవసరం. అందుకే 'ఎర్త్ రైజ్', 'ఎర్త్ సెట్' చిత్రాలు కేవలం అంతరిక్ష ఫోటోలు కాదు; మన గ్రహాన్ని సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేసే శాశ్వత సందేశాలు. చంద్రుడి వరకు ప్రయాణించిన మనిషి చివరికి అత్యంత విలువైన ఆవిష్కరణ భూమేనని ఈ చిత్రాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.

## శ్రీ విష్ణు సరసన సాక్షి మడోల్కర్



హిలేరియస్ బ్లాక్‌బస్టర్ సామజవరగమనను అందించిన తర్వాత శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి జతకట్టారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సాక్షి మడోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమెకు టీమ్‌లోకి వెల్‌కమ్ చెబుతూ విడుదల చేసిన వీడియోలో షూటింగ్ స్పాట్‌లోని ఫన్ వైబ్‌ను చూపించారు. టీమ్ మొత్తం సరదాగా గడిపిన మూమెంట్స్‌తో ఈ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'శ్రీ విష్ణు రామ్ అబ్బరాజు 2' కంప్లీట్ డిఫరెంట్ స్టయిల్ లో కొత్త కథాంశంతో కూడిన ఫ్రెష్ స్క్రిప్ట్. కాన్సెప్ట్, హైవోల్టేజ్ హ్యూమర్ ఎక్కువగా వుండే కథనంతో, ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందించబోతోంది.నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బలమైన తారాగణం, టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సామజవరగమనకి పని చేసిన రైటర్స్ భాను భోగవరపు, నందు సావిరిగణ మరోసారి స్క్రిప్ట్ రాస్తున్నారు.

## ఆగస్ట్ 1న 'రక్త చరిత్ర 2' రీ–రిలీజ్



ఒకప్పుడు రాయలసీమ ఫ్యాక్షనిజంలో బద్ధ శత్రువులైన రెండు వేర్వేరు గ్రూపులకు చెందిన పరిటాల రవి, మద్దెల చెరువు సూరిలకు సంబంధించిన యథార్థ ఘటనల ఆధారంగా రామ్ గోపాల్ వర్మ గతంలో 'రక్త చరిత్ర' చిత్రాన్ని రెండు పార్ట్‌లుగా తెరకెక్కించిన విషయం తెలిసిందే. నటీనటులు తమ, తమ పాత్రలలో ఒదిగిపోయిన విధానం, రామ్ గోపాల్ వర్మ, అప్పట్లో ఆయన ఉపయోగించిన లేటెస్ట్ టెక్నాలజీ ఈ చిత్రాలకు ఆయువు పట్టుగా నిలిచాయి. ఈ రెండు చిత్రాలు ఒకే ఏడాది అనగా 2010లో వరుసగా విడుదలైయాయి. 16 ఏళ్ల తర్వాత 'రక్త చరిత్ర' పార్ట్1 చిత్రాన్ని ఇటీవలే రీ రిలీజ్ చేయగా...హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో మంచి స్పందన రావడంతో ఇప్పుడు 'రక్త చరిత్ర' పార్ట్2 చిత్రాన్ని ఆగస్ట్ 1న థియేటర్స్‌లో రీ– రిలీజ్ చేయబోతున్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రంలో రక్తసిక్త వర్ణమైన తరతరాల రక్తచరిత్ర అంటూ సాగే నేపథ్య గీతంతో పాటు కత్తులతో సావాసం నెత్తుటితో సమాప్తం అనే మరో పాటతో కలుపుకుని కథానుసారం సందర్భానుసారమైన రెండు పాటలు ఉన్నాయి. నేటితరం యూత్ కు కూడా వాస్తవిక కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూపించాలనే ఉద్దేశ్యంతో రామ్ గోపాల్ వర్మ రీ–రిలీజ్ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో హీరో సూర్య పుట్టినరోజు సందర్భంగా తాజాగా 'రక్త చరిత్ర' పార్ట్2 ట్రైలర్ ను రిలీజ్ చేశారు. వంకాయపాటి మురళీకృష్ణ, నట్టి లక్ష్మి కరుణ, నట్టి క్రాంతి నట్టీస్ ఎంటర్టైన్మెంట్స్, క్విటీ ఎంటర్టైన్మెంట్స్, త్రిపుర క్రియేషన్స్ బ్యానర్స్‌పై ఈ సినిమాను రీ– రిలీజ్ చేయనున్నారు.

## '35 – చిన్న కథ కాదు'కు జాతీయ అవార్డు సంతోషంగా ఉంది

### దర్శకుడు నందకిశోర్



2024 సంవత్సరానికి గాను '35 చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రం విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికైంది. అలాగే ఈ చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడు విభాగంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. 2024లో విడుదలైన '35 చిన్న కథ కాదు' చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ ప్రధాన పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సృజన యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. విడుదల సమయంలో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం, ఇప్పుడు జాతీయ చలనచిత్ర పురస్కారాల్లోనూ తన సత్తా చాటింది. ఈ సందర్భంగా '35 చిన్న కథ కాదు' స్క్రీన్ ప్లే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు నందకిశోర్ మాట్లాడుతూ... 2018లో 35 చిన్న కథ కాదు ఒక ఆలోచనతో మొదలైంది. 2026కి ఇక్కడివరకు వచ్చింది. హీరో విశ్వదేవ్, దర్శకుడు సజీవ్ ,చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్ దేవ్ ,దర్శకుడు విద్యాధర్, దర్శకుడు శశాంక్, దర్శకుడు అనురాగ్, మల్లిక్ రామ్, దర్శకుడు వినోద్ పాల్గొన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం'కు యు/ఎ సర్టిఫికెట్

రీల్




క్రిష్ణ మనవడు జై క్రిష్ణ నటించిన శ్రీనివాస మంగాపురం సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా కు సెన్సార్ బోర్డు నుంచి యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. రాష తడాని హీరోయిన్ గా నటిస్తోంది. . జీవీ ప్రకాష్ అద్భుతమైన సంగీతం ఇప్పటికే శ్రోతలను అలరిస్తోంది. యాక్షన్ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్, మంగ అనే ప్రేమికుల మధ్య జరిగే వైవిధ్యమైన గ్రామీణ ప్రేమ కథ చిత్రమని నిర్మాతలు చెప్పారు. కృష్ణ మనవడు కావడం, మహేష్ బాబు అన్న కొడుకు కావడంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరోను స్వాగతించేందుకు ఫాన్స్ సిద్ధంగా ఉన్నారని అభిమానులు అంటున్నారు. చిత్రానికి సంబధించిన అన్ని పనులు పూర్తయ్యాయని, ఈ నెల 30వ తేదీన విడుదల చేస్తున్నామని దర్శకుడు అజయ్ భూపతి తెలిపారు. ఇంతవరకు తాను తెరకెక్కించిన ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాలకు పూర్తి భిన్నంగా శ్రీనివాస్ మంగాపురం సినీ ఉంటుందని తెలిపారు, మోహన్ బాబు విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ అశ్వని దత్, నిర్మాత జెమిని కిరణ్.

## వెంకటేష్- అనిల్ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తి



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమా తొలి షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్‌లో నిర్మించారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్ కృతి శెట్టి షూటింగ్ లో పాల్గొన్నారు.ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌తో పాటు ఓ అద్భుతమైన పాటను చిత్రీకరించారు. చాలా ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ ఎపిసోడ్స్ సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదల చేసిన కళ్యాణ్ రామ్ పోస్టర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే అనిల్ రావిపూడి తనదైన క్రియేటివ్ ప్రమోషన్స్ ఇప్పటికే అంచనాలు పెంచారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం 2027 సంక్రాంతికి రిలీజ్ కానుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సమీర్ రెడ్డి, ఎడిటర్: తమ్మిరాజు.

## 'రాధా రమణ' పాట రిలీజ్

సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'రోమాంచకం' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'రోమాంచకం' సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'రాధా రమణ' రిలీజ్ చేశారు. ఈ పాటకు ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ అందమైన సాహిత్యాన్ని అందించగా...మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ మెమొరబుల్ ట్యూన్ తో కంపోజ్ చేసి శ్రావ్యంగా పాడారు. హీరో హీరోయిన్స్ మధ్య బ్యూటిఫుల్ పొయెటిక్ రొమాంటిక్ మేకింగ్‌తో ఈ పాటను చిత్రీకరించారు. 'రాధా రమణ' పాట ఎలా ఉందో చూస్తే 'రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో..ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..ఓ కన్నా నీ అందమే..అలలై అలలై ముంచే, కన్నుల్లో అందుకే కలలే కథలే పెంచే, ఆవేశమే తెరచాటుగా లాగగా, బిడియాల ఆదేశమే పొరపాటనీ ఆపగా, ఈ ఊగిసలో, ఊయలలో, ఉందనా లేదనా అని సాగుతూ ఈ పాట ఆకట్టుకుంటోంది.'రోమాంచకం' సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు తెరపైకి రాబోతోంది. ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ గా సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రేక్షకుల్ని థియేటర్స్‌లో రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి డిఒపి పవన్ పప్పుల, మ్యూజిక్ వాసుకి వైభవ్.



# హైడ్రా అధికారాలు ఏమిటి?

అన్ని చట్టాలను రద్దు చేయండి
హైడ్రా చట్టమే తీసుకురండి
హైకోర్టు ఘాటు వ్యాఖ్య
ఏజీ వినతితో సైన్యం దించాలన్న ఉత్తర్వులు అమలు నిలిపివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ, పోలీసు, జిహెచ్ఎంసి, ఇరిగేషన్ సహా అన్ని శాఖల అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఎందుకు వెళ్తున్నారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం తీవ్రంగా ప్రశ్నించింది. రెవెన్యూ చట్టంలోనే ఆక్రమణలను తొలగించే నిబంధనలు ఉన్నప్పుడు ప్రతి అంశంలో హైడ్రాను ఎందుకు రంగంలోకి దింపుతున్నారని నిలదీసింది. ఇలా కొనసాగితే రెవెన్యూ, ఇరిగేషన్ వంటి కీలక చట్టాలు నిరర్థకంగా మారిపోతాయని వ్యాఖ్యానించింది. అలాంటప్పుడు అన్ని చట్టాలను రద్దు చేసి హైడ్రా చట్టం ఒక్కటే తీసుకొస్తే సరిపోతుందేమో అని ఘాటుగా వ్యాఖ్యానించింది. కేవలం ఒక జీవో ఆధారంగా ఏర్పాటైన హైడ్రా వెంట అన్ని శాఖల అధికారులు నడవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పేర్కొంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న చేపట్టిన కూల్చివేతలను సవాలు చేస్తూ శాంతా శ్రీరాం కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ మరోసారి విచారణ చేపట్టారు. ఒకే అంశానికి సంబంధించి ఇప్పటికే మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలైనా హైడ్రా తీరు మారలేదని కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారి సమర్పించిన అఫిడవిట్‌లో కనీసం క్షమాపణ కూడా కోరకపోవడం ఆయన అహంకార ధోరణికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హాజరై పిటిషనర్ల స్థలంలోకి హైడ్రా అధికారులు వెళ్లలేదని, అదే విషయాన్ని అఫిడవిట్‌లో పేర్కొన్నామని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, గత రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించారని గుర్తుచేశారు. కోర్టు ధిక్కరణ కేసులో అసలు భూవివాదంపై చర్చ ఉండదని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారా లేదా అన్నదే విచారణ అంశమని స్పష్టం చేశారు. ఆర్మీని రంగంలోకి దింపుతూ గతంలో ఇచ్చిన ఆదేశాలను కేవలం అడ్వొకేట్ జనరల్ అభ్యర్థన మేరకే అమలు చేయకుండా పెండింగ్‌లో ఉంచామని న్యాయమూర్తి వెల్లడించారు. హైడ్రా కమిషనర్ సమర్పించిన అఫిడవిట్‌ను పూర్తిగా పరిశీలించిన తర్వాత ఆ ఉత్తర్వుల అమలుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పిటిషనర్ల భూమికి సంబంధించిన రిట్ పిటిషన్లు, అప్పీలు, సివిల్ సూట్లు, మొదటి కోర్టు ధిక్కరణ పిటిషన్‌లలో హైడ్రా ప్రతివాదిగా కూడా లేదని, అలాంటి పరిస్థితిలో రెండో కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో అన్నీ తన పరిధిలోనే ఉన్నట్లుగా వ్యవహరించడం న్యాయపాలనలో జోక్యం చేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా వ్యవహరించడం హైకోర్టు చరిత్రలోనే కనీవినీ ఎరుగని పరిణామమని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తక్కువ సమయంలో కౌంటర్ సమర్పించామని, తర్వాత పూర్తి కౌంటర్ దాఖలు చేస్తామని హైడ్రా పేర్కొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దశలో కోర్టు ధిక్కరణ జరిగిందా లేదా అన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడిన వ్యక్తి కనీస మర్యాదగా క్షమాపణ చెప్పకపోవడం గమనార్హమని, ఇది మొండి వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో పిటిషనర్ల స్థలంలో జోక్యం చేసుకోబోమని హామీ ఇచ్చిన తర్వాత కూడా అక్కడికి ఎందుకు వెళ్లారని, నిర్మాణాలను కూల్చివేయాలని ఎవరు ఆదేశించారని హైడ్రా అధికారులను ప్రశ్నించారు. కోర్టులు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని, వాటిని ధిక్కరించి ఏ అధికారంతో నిర్మాణాలను కూల్చివేశారని నిలదీశారు. ఈనెల 20న జరిగిన పరిణామాల గురించి ఇప్పుడు ప్రశ్నించడం లేదని, ఈ నెల 18న జరిగిన కోర్టు ధిక్కరణ అంశంపైనే వివరణ ఇవ్వాలని ఆదేశించారు.


ఒక శాఖ నుంచి లేఖ వస్తే వెంటనే పదుల సంఖ్యలో వాహనాలు, జెసిబిలు, పోలీసు బలగాలతో వెళ్లిపోవడం ఏ అధికార పరిధిలో జరుగుతోందని కూడా కోర్టు ప్రశ్నించింది. పోలీసులను, ప్రభుత్వ వాహనాలను ఎప్పుడు వినియోగించాలో కూడా తెలియదా అని నిలదీసింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికే ఇలాంటి చర్యలేమో అన్న సందేహం వ్యక్తం చేసింది. నగరంలో చేయాల్సిన పనులు అనేకం ఉన్నప్పటికీ ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశమేమిటని ప్రశ్నించింది. చెరువుల పరిరక్షణ అవసరమే అయినప్పటికీ చట్టపరమైన విధానాలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. గత ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లే హైడ్రా అధికారులు చట్టానికి అతీతులు కారని, కోర్టు పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని న్యాయమూర్తి గుర్తుచేశారు.

కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారిని ఉపేక్షిస్తే చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రం దెబ్బతింటుందని, న్యాయస్థానాల గౌరవానికి భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్వొకేట్ జనరల్ విజ్ఞప్తిని గౌరవించి మాత్రమే ఇప్పటివరకు సంయమనం పాటించామని, లేదంటే అధికారిని అదుపులోకి తీసుకునే పరిస్థితి వచ్చేదని స్పష్టం చేశారు. ఇకపై పిటిషనర్ల స్థలంలో ఎలాంటి జోక్యం చేసుకోబోమని హామీ ఇవ్వడంతో పాటు హైడ్రా కమిషనర్ తప్పనిసరిగా క్షమాపణ చెప్పాలని తేల్చిచెప్పారు. ఈనెల 23న ఆర్మీని రంగంలోకి దింపాలని జారీ చేసిన ఉత్తర్వులు రికార్డుల్లో ఉన్నాయని, హైడ్రా కమిషనర్ 27న దాఖలు చేసే అఫిడవిట్‌ను పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు.

---

## హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు

# సిఎస్ఆర్ నిధులు అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కోసం హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులను అందించాయి. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో శుక్రవారం హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, దివీస్, అరబిందో ఫార్మా కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కోసం సిఎస్ఆర్ నిధుల కింద దివీస్ సంస్థ రూ.12.18 కోట్లు, అరబిందో ఫార్మా రూ.10కోట్లకు సంబంధించిన చెక్కులను సిఎం సమక్షంలో ఫౌండేషన్‌కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తోంది. ఈ పథకం కోసం సిఎస్ఆర్ నిధులను అందించిన దివీస్, అరబిందో సంస్థలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

**రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు చర్యలు**

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తద్వారా పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడమే కాకుండా రైతులకు లాభాలను అందించవచ్చని సిఎం అన్నారు. బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు కోసం హరే కృష్ణ ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసిన చోట సమీప ప్రాంతాల రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఈ సందర్భంగా ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. అవసరమైన కూరగాయలు, బియ్యం ఇతర సామగ్రిని నేరుగా రైతుల నుంచి తీసుకునేలా, రైతులను ఆర్గానిక్ పంటల వైపు ప్రోత్సహించాలని భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు మధు బాబు, అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

---

## ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ..

# కార్మికులు, వినియోగదారులకు భారమే

హమాలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి
మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం చెల్లించాలి: ఎస్.బాల్‌రాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో పంపిణీ చేయాలనే నిర్ణయం హమాలీ కార్మికులు, రేషన్ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ అన్నారు.

తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్, జనరల్ మేనేజర్ అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలల రేషన్‌ను ఒకే నెలలో పంపిణీ చేయడం అత్యంత కఠినమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. హమాలీ రేట్లు పెంచి ఏడు నెలలు గడిచినా సంబంధిత జిఓ విడుదల కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో మూడు నెలల రేషన్ పంపిణీ సమయంలో ప్రమాదాలకు గురై మరణించిన సుమారు పది మంది హమాలీ కార్మికుల కుటుంబాలకు ఇప్పటివరకు ప్రభుత్వం, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు వెంటనే రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, బిఆర్‌ఎస్‌కెవి నాయకుడు శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సూర్యంతో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

---

## ఆరోగ్య శాఖకు

# రూ.740 కోట్లు విడుదల

రాష్ట్రవ్యాప్తంగా 1,569 కొత్త ఆరోగ్య సబ్ సెంటర్ల నిర్మాణం,
పల్లెల్లోనే ఉచిత నిర్ధారణ పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా గ్రామీణ ప్రజలకు ఉచిత, మెరుగైన వైద్యాన్ని అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పల్లెవాసుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా, సేవలను వారి ముందుకు చేర్చాలనే దృఢ సంకల్పంతో వైద్య ఆరోగ్య శాఖకు రూ.740 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు గాను 1,569 నూతన ఆరోగ్య సబ్ సెంటర్ల భవన నిర్మాణాలను చేపట్టనున్నారు. సాధారణ వైద్య పరీక్షల కోసం గ్రామీణ ప్రజలు ఇకపై పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉచిత డయాగ్నోస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలోనే వ్యాధులను త్వరగా గుర్తించి సత్వర చికిత్స అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అయ్యే వైద్య ఖర్చుల భారాన్ని ప్రభుత్వం గణనీయంగా తగ్గించనుంది. వైద్యాన్ని పేద ప్రజల హక్కుగా మారుస్తూ, పల్లెల్లో ఆరోగ్య రంగానికి కొత్త ఊపిరి పోస్తున్నదని, ఈ నిధుల విడుదల ద్వారా గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా వైద్య సేవల అందుబాటు, నాణ్యత గణనీయంగా పెరగనున్నాయని ప్రభుత్వం తెలియజేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

---

# ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి

అద్దె బస్సు యజమానులకు టిజిఎస్ ఆర్‌టిసి సూచన
ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయాలు..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్ ఆర్‌టిసి పరిధిలో సేవలు అందిస్తున్న అద్దె బస్సు యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. అద్దె బస్సుల కొనసాగింపు, నిర్వహణకు సంబంధించిన అన్ని నిర్ణయాలు ప్రభుత్వ ఆదేశాలు, సంస్థ నిబంధనల మేరకు పూర్తిస్థాయి పారదర్శకతతో తీసుకుంటామని తెలిపింది. యజమానులు ఎలాంటి అభద్రతాభావానికి గురికావద్దని సూచించింది. కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం అద్దె బస్సు యజమానులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు, ప్రభుత్వం, ఆర్‌టిసి అధికారులను మేనేజ్ చేయడానికి డబ్బు అవసరమంటూ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని యాజమాన్యం వెల్లడించింది. ఇటువంటి వదంతులు, దుష్ప్రచారాలు యజమానుల ప్రయోజనాలకే తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆర్‌టిసిలో అన్ని నిర్ణయాలు పారదర్శకంగా తీసుకుంటున్నందున అద్దె బస్సు యజమానులు అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక ప్రచారాలు లేదా సంఘాల పేరుతో జరుగుతున్న ప్రచారాలను నమ్మి ఎవరూ మోసపోవద్దని కోరింది. సంస్థ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్నే ప్రామాణికంగా పరిగణించాలని సూచించింది. అనవసర ప్రచారాలకు లోనై సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అందుకు సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాల్సి ఉంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది.

## బెల్లంపల్లి గురుకుల ఫుడ్ పాయిజన్ ఘటనపై హెచ్ఆర్‌సి సుమోటో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బిసి బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆహార విషబాధకు గురైన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి) సుమోటోగా కేసు నమోదు చేసింది. ఓ దినపత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఉన్న కమిషన్ ఈ అంశాన్ని స్వయంగా స్వీకరించింది. ఘటనపై సమగ్ర నివేదికను సమర్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. విచారణ కోసం కేసును ఆగస్టు 25కు వాయిదా వేసింది.

## సాంకేతిక పోలీసింగ్‌తోనే సైబర్ నేరాలకు చెక్ : డిజిపి సి.వి.ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టాలంటే సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి పోలీసు యూనిట్ లక్ష్యబద్ధంగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి సైబర్ సెక్యూరిటీ, ఈజీరో ఎఫ్ఐఆర్, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సిసిటిఎన్ఎస్) అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 'ప్రగతి' వేదిక ద్వారా సైబర్ భద్రత అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నిర్దేశించిన తొమ్మిది కీలక పనితీరు సూచికల్లో తెలంగాణ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని డిజిపి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయి శ్రీతో పాటు రాష్ట్రంలోని వివిధ పోలీసు యూనిట్ల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

---

# గ్లోబరీనా సంస్థతో మీకు సంబంధం లేదా?

కెటిఆర్ నీ కొడుకు మీద ఒట్టేసి చెప్పు
ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ విమర్శించారు. కెటిఆర్ తన కుమారుడిపై ఒట్టు వేసి గ్లోబరీనా సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో గ్లోబరీనా సంస్థకు టెండర్ కట్టబెట్టడంలో కెటిఆర్ పాత్రపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులు నమోదైన, బ్లాక్ లిస్ట్‌లో ఉండాల్సిన సంస్థకు టెండర్ ఎలా అప్పగించారని నిలదీశారు. నిధుల విడుదల విషయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు చేస్తున్నా కెటిఆర్ ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ విద్యార్థుల సమస్యలపై నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. బిజెపి పాలనలో గత 12 ఏళ్లలో 112 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నిరంతరం డిమాండ్ చేస్తోందన్నారు. మరోవైపు బిఆర్ఎస్ పాలనలోనే పేపర్ లీకుల ఘటనల్లో తెలంగాణ దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని ఆరోపించారు. నల్ల చొక్కాలు వేసుకుని నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నంత మాత్రాన గత తప్పులు చెరిగిపోవని, కెటిఆర్ ముందుగా గ్లోబరీనా వ్యవహారంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

---

# మీడియా సిబ్బందిపై భౌతిక దాడులకు ఐజెయు ఖండన

**చండీగఢ్ /విజయవాడ :** విద్యార్థుల నిరసనల నేపథ్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద , ఇతర నగరాల్లో విధి నిర్వహణలో ఉన్న మీడియా సిబ్బందిపై జరిగిన భౌతిక దాడులను, బెదిరింపులను ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) ఖండించింది. ఒకపక్క నిరసనకారులు మరోపక్క, భద్రతా సిబ్బంది విధి నిర్వహణలో ఉన్న మీడియా సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడటం గర్హనీయమని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ, సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ శుక్రవారం విడుదల చేసిన మీడియా ప్రకటనలో ఖండించారు. జాతీయ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్న విద్యార్థి నిరసనల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం మీడియా సిబ్బంది బాధ్యత కాగా అలాంటి బాధ్యత నెరవేరుస్తున్న రిపోర్టర్లపై, వీడియో జర్నలిస్టులపై జరిగిన దాడుల దృశ్యాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఐజెయు ఆందోళన వ్యక్తం చేసింది.

ఆందోళనలను, నిరసనలను కవర్ చేయడానికి వచ్చిన విలేకరులపై, విడియో జర్నలిస్టులపై నిరసనకారులు, భద్రతా సిబ్బంది దాడులు చేయడం అప్రజాస్వామికమని, ఇలాంటి చర్యలను మీడియా స్వేచ్ఛపై దాడిగానే భావిస్తున్నామని ఐజెయు ఆ ప్రకటనలో పేర్కొన్నది. న్యూస్ కవరేజీలో ప్రభుత్వానికి అనుకూలంగా నిరసనకారులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కుంటున్న కొన్ని న్యూస్ చానళ్ల, మీడియా సంస్థల సిబ్బంది మాత్రమే దాడులకు గురైన వాస్తవాన్ని గమనంలోకి తీసుకోవాలని అభిప్రాయ పడింది. ప్రజల ఆందోళనల కవరేజీకి సంబంధించి సంపాదక విధానాలను నిర్ణయించడంలో క్షేత్రస్థాయి జర్నలిస్టుల పాత్ర ఏమీ ఉండదని, యాజమాన్యాల వైఖరులను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయి సిబ్బందిపై దాడులకు పూనుకోవడం నిరసనకారులకు తగదని ఐజెయు హితవు పలికింది.

అయితే కొన్ని మీడియా సంస్థల యాజమాన్యాలు తీసుకుంటున్న ధోరణులు మీడియా విశ్వసనీయతను, జర్నలిజం స్థాయిని ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఐజెయు ఆందోళన వ్యక్తం చేసింది.

---

## పేపర్ లీక్ వెలుగులోకి వచ్చిన వెంటనే.. విద్యాశాఖమంత్రి

# క్షమాపణలు చెప్పి స్వయంగా సిబిఐకి లేఖ

కేంద్ర మంత్రి బండి సంజయ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేపర్ లీక్ వెలుగులోకి వచ్చిన వెంటనే సిబిఐ 11 మంది ఫ్యాకల్టీతో సహా మొత్తం 17 మందిని అరెస్టు చేసిందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పి సిబిఐకి స్వయంగా లేఖ రాశారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా 40 రోజుల్లోనే పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని, రేపటి నుంచి కౌన్సెలింగ్ కూడా ప్రారంభం కానుందన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందని, ఈ అంశాన్ని రాజకీయం చేస్తూ విద్యార్థుల ముసుగులో కొందరు అసాంఘిక శక్తులు ఢిల్లీలో అల్లర్లు సృష్టించాయన్నారు. ఈ అలజడికి పాకిస్తాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్‌లను ఢిల్లీ పోలీసులు బ్లాక్ చేశారని, దేశ వ్యతిరేక శక్తుల హస్తం ఉందని అనుమానిస్తున్నామని చెప్పారు. గత యుపిఎ హయాంలో, అలాగే రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో అనేకసార్లు పేపర్ లీకేజీలు జరిగినా అక్కడి ముఖ్యమంత్రులు ఎవరూ రాజీనామా చేయలేదని, మరి ఇప్పుడు మాత్రం ప్రధానిని రాజీనామా అడగడం ద్వంద్వ ప్రమాణాలేనని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో ఎంసెట్, టిఎస్‌పిఎస్‌సి, పదో తరగతి పరీక్షల పేపర్లు లీక్ అయినా ఆయన ఎన్నడూ రాజీనామా చేయలేదని, గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, అంజి రెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

---

## రైస్‌మిల్లర్ల వివాదాన్ని మీడియేషన్‌తో పరిష్కరించండి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2022–23 రబీ సీజన్‌లో అప్పగించిన ధాన్యానికి క్వింటాలుకు రూ.2,236.81 చెల్లించాలని జారీ చేసిన డిమాండ్ నోటీసులపై తలెత్తిన వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే అవకాశాన్ని పరిశీలించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రైస్‌మిల్లర్లు, ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదం మీడియేషన్ ద్వారా పరిష్కారమైతే ఇరుపక్షాలకు సమయం, న్యాయ వ్యయం రెండూ ఆదా అవుతాయని అభిప్రాయపడింది. ప్రభుత్వ నిర్ణయం తెలియజేయాలని సూచిస్తూ విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. మే 8న జారీ చేసిన జీవో నంబర్–7తో పాటు దాని ఆధారంగా 2022–23 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యానికి క్వింటాలుకు రూ.2,236.81 చెల్లించాలని జారీ చేసిన డిమాండ్ నోటీసులను సవాలు చేస్తూ రైస్‌మిల్లర్లు దాఖలు చేసిన వందకు పైగా పిటిషన్‌లపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. ధాన్యం నిల్వతో నాణ్యత తగ్గడం, గోదాముల అద్దెలు, నిల్వ వ్యయాలు, అన్‌లోడింగ్ ఛార్జీలు వంటి అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ల వాదన. మీడియేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి కూడా మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కారమైతే దీర్ఘకాలిక వివాదానికి ముగింపు లభిస్తుందని, ఇరుపక్షాల సంబంధాలు కూడా మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అభిప్రాయం తెలియజేస్తామని అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి కోర్టుకు తెలియజేయడంతో విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు.

## పార్కు జాగాలో నిర్మాణాలు ఆపండి :హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని సువర్ణవ్యాలీ ఆర్టీసీ కాలనీలో పార్కు కోసం కేటాయించిన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని హైకోర్టు మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదిక సమర్పించాలని సూచిస్తూ కేసు విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది. పార్కు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఎం. చంద్రశేఖర్‌తో పాటు మరో ముగ్గురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రజల వినియోగానికి కేటాయించిన పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రైవేటు వ్యక్తులతో పాటు సంబంధిత ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 7కు వాయిదా వేశారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఒకే నాణేనికి బొమ్మ–బొరుసు : ఎన్.రామచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రతిపక్షాలు విద్యార్థులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశవ్యతిరేక శక్తులు చేపడుతున్న నిరసనలకు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మద్దతు తెలపడం సిగ్గుచేటని, ఇది అసలైన నిరసన కానేకాదని వ్యాఖ్యానించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్ నేడు విద్యా వ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఒకే నాణేనికి బొమ్మబొరుసుగా అభివర్ణించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు మద్దతు తెలపడం, మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించడంలో ఈ రెండు పార్టీల వైఖరి ఒకేలా ఉందన్నారు. ధరణి పోర్టల్‌లో అక్రమాలు జరిగాయని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి'ని తీసుకొచ్చినా, మారింది కేవలం పేరు మాత్రమేనని, అవినీతి యథాతథంగా కొనసాగుతోందని రాంచందర్ రావు ఆరోపించారు.



## 'సర్' ఫారంతో ఓటు హక్కుకు భరోసా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సర్ ఫామ్‌లను సకాలంలో సమర్పించడం ద్వారా ఓటు హక్కుకు భరోసా కలుగుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 13, 21, 40 వార్డుల సర్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి అర్హత ఓటరు సర్ ఫామ్‌ను తప్పని సరిగా నింపి సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు సక్రమంగా నమోదై ఉండేందుకు సర్ ఫామ్‌లు కీలకమన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, దానిని ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. బిఎల్‌ఓ, బిఎల్‌ఏలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్లు భూక్య కౌసల్య, వీణా బాలు గౌడ్, కొణతం రాజేష్ రెడ్డి, కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

## రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

### డిఎస్‌పి ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** హైవేలపై రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత తీవ్రతరం చేయాలని డిఎస్‌పి ప్రసన్న కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సిఐ గోదాం జంక్షన్ వద్ద బ్లాక్ స్పాట్‌ను పరిశీలించారు. అంతకుముందు డిఎస్‌పి కార్యాలయం నందు ఎస్‌ఐ యాదవేందర్, నేషనల్ హైవేస్ అథారిటి అధికారులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, సూర్యాపేట టౌన్ పోలీసులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వాహనదారులు తమ వాహనాలను రహదారి పక్కన నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అలాంటి వారిపై తక్షణమే చాలాన్లు విధించడానికి ఒక ప్రత్యేక వాట్సాప్/ కమ్యూనికేషన్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు పక్కన వాహనాలను ఆపకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సమావేశ అనంతరం హైవే పరిధిలోని పలు ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆ గుంతలను 24 గంటల్లోపు పూడ్చివేసి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది, హైవే అథారిటి ప్రతినిధులు, హైవే పెట్రోలింగ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారులు, పోలీసుల విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలో ఫుడ్ సేఫ్టి అధికారులు, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కీతవారిగూడెం గ్రామంలో ఫేమస్ బేకరీలో కుళ్లిపోయిన కేక్ విక్రయించిన ఘటన వార్తల్లో రావడంతో అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. ముందుగా కీతవారిగూడెం గ్రామంలోని ఫేమస్ బేకరిని పరిశీలించిన అధికారులు, ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. బేకరీకి ఫుడ్ సేఫ్టి లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించి రూ.5వేలు జరిమాన విధించారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రంలోని పంజాబీ ఫ్యామిలి దాబాలో తనిఖీలు నిర్వహించార. అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించి వారికి రెండువేల జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టి అధికారి ప్రభాకర్, ఎస్‌ఐ బత్తిని శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఆహార వ్యాపారులు తప్పని సరిగా ఫుడ్ సెఫ్టి నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు జానకి, నాగేశ్వరరావు, బిల్ కలెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

## మల్లమ్మ మరణం బాధాకరం



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన మల్లమ్మ మరణం చాలా బాధకరమైన విషయం అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మాజీ సిపిఐ నాయకులు , బిఆర్ఎస్ చండూరు మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న తల్లి బొమ్మరబోయిన మల్లమ్మ గురువారం రాత్రి మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం కస్తాల గ్రామంలో మల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి మృతదేహం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మల్లమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బొమ్మరబోయిన మల్లమ్మకు నివాళులర్పించిన వారిలో సిపిఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేపల్లి ఆదిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , గురిజ రామచంద్రం , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి, బోయపల్లి బిక్షమయ్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ ,ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి జిల్లా యాదయ్య పాల్గొన్నారు.


## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తూ, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మిర్యాలగూడ ప్రతినిధులు రఫీ, అనిల్, సంతోష్, మణి, సోహైల్ పాల్గొన్నారు.

# రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం

### కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశ వ్యాప్త ఆందోళన నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో జరిగిన సిపిఐ దేవరకొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ పార్టీ నిర్ణయించింది మార్పు నినాదంతో నేడు దేశం తీవ్రమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం గుండా పయనిస్తుందని ఒక వైపు నిరుద్యోగం, ధరల పెరుగుదల, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక అసమానతలు, జీవనోపాధి సమస్య నిరంతరం పెరుగుతున్నాయని ఆరోపించారు. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థలను స్వయం ప్రతిపత్తి విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ ప్రపంచలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గొప్పగా చెప్పుకుంటుందని వాస్తవంగా అభివృద్ధి ఫలాలు సమాజంలో మెజార్టీ ప్రజలకు చేరడం లేదని అర్థిక అభివృద్ధి ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని ఆర్థిక వైఫల్యాలతో పాటు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా నిరంతరం ఒత్తిడికి గురవుతుందన్నారు. పార్లమెంట్ సామర్థ్యం క్షీణిస్తుందని రాజ్యాంగ సంస్థల నిష్పక్షపాత ప్రశ్నార్థంగా మారిందని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, సమాజంలో మతపరమైన విభజన ప్రోత్సహిస్తున్నారని ఈధోరణుల వలన ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా మారిందని తెలిపారు. సమస్యల చుట్టూ విస్తృత ప్రచారం ప్రజా చైతన్యం ఉమ్మడి పోరాటం ఆవశ్యకత గతం కంటే ఎక్కువ పెరుగుతుందని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి రాజ్యాంగ విలువలు కాపాడటానికి సామాజిక న్యాయం లౌకికవాదం ఆర్థిక సమానత్వం సాధించడానికి ప్రజల పక్షాన సిపిఐ తన రాజకీయ సందేశాన్ని నేరుగా ప్రజలను తీసుకెళ్ళి ప్రజాపోరాటం విస్తృత పరచాలని అన్నారు. ఈమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, రైతాంగం అప్పుల ఊబిలో కూరుకపోయిసమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేక వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని యువతకు సరైన ఉపాధి లేక వలస కూలీలుగా మా రుతున్నారని, రాష్ట్రంలో అర్హులైన వారందిరికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. నిరుద్యోగ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఆయన అన్నారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దీన్, సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకట య్య, రామస్వామి, వెంకటయ్య, ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, రామాంజనేయులు, శైలేష్, పాండురంగారెడ్డి, వెంకట్‌రాములు, వెంకటేశ్వర్లు, శేఖరాచారి, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యాధికారంలో మహిళలు వెనుకంజ

### రాష్ట్ర మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 27న హుజూర్‌నగర్ పట్టణంలో జరుగు తెలంగాణ రాష్ట్ర మహిళా సమైక్య 4వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళ సమైక్య నియోజక వర్గ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు రాజ్యాధికారంలో వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం జాతీయ మహిళా సమైక్య నాయకురాలు మాజీ ఎంపి గీత ముఖర్జీ గతంలో అనేక సంవత్సరాలు పార్లమెంట్‌లో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా వ్యవహరించిందో ప్రస్తుతం బిజెపి కూడా అదే పద్ధతులు అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్లు వానాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని ఆమె అన్నారు. ఈనెల 20న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ విద్యార్థులు ధర్నా చేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా మహిళలపై లాఠీచార్జి చేయడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై వెంటనే కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో జరిగే మహిళా సమాఖ్య జిల్లా మహాసభలకు సూర్యాపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సూర్యాపేట నియోజక వర్గ నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా దంతాల పద్మరేఖ, ప్రధాన కార్యదర్శిగా పొదిలి వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలుగా మోర్తాల లింగమ్మ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుతన కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, అనంతుల మల్లేశ్వరి, పొదిల వెంకటమ్మ, ఎం. లింగమ్మ పాల్గొన్నారు.



## రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు

### పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో ఆగిపోయిన రోడ్డు పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు చేసి ఇతరులతో పనులు చేయిస్తాం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం నుంచి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే ఆగి పరిస్థితిని పరిశీలించారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కూడా రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, పనులు ఎందుకు నిలిచిపోయాయనే విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు మంత్రి ఫోన్ ద్వారా వివరణ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పనులను తిరిగి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లోనే రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

## కోడిగుడ్డు ధర వ్యత్యాసంతో వంట కార్మికుల జేబులకు గండి

### ధర పెరుగుదలను కార్మికులపై రుద్దడం అన్యాయం
### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మార్కెట్ రేటు ప్రకారంగా వంట కార్మికులకు కోడిగుడ్డు ధర చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఏఓ అంజి రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో ఒక్క కోడిగుడ్డుకు రూ.6 మాత్రమే కేటాయిస్తుండగా, ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్డు ధర రూ.8.00 వరకు ఉందని తెలిపారు. దీంతో ఒక్కో కోడిగుడ్డుపై రూ.2.00 వరకు అదనపు భారం వంట కార్మికులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నెలకు 3వేల వేతనంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పెరిగిన ధరల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్ ధరలకు అనుగుణంగా కోడిగుడ్డు ధరను సవరించి, అవసరమైన నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం, సామాజిక భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని, వంట సామగ్రి, గ్యాస్ తదితర అవసరాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజనం పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి ముం తాజ్ బేగం నాయకులు రాజమణి, బుచ్చయ్య, శ్యామ్, గీత, బాలమణి, నీలమ్మ, పుష్ప, లలిత, అరుణ, రాజమణి, అండాలు, వాణి, సుగుణ పాల్గొన్నారు.

## బయోమెడికల్ వ్యర్థాలను పారిశుద్ధ్య చెత్తలో కలపొద్దు

### మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ పారిశుద్ధ్య చెత్తలో కలపడం చట్టరీత్యా నేరమని మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష అధ్యక్షతన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులతో సాలిడ్ వేస్ట్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్2016 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రులు,నర్సింగ్ హోమ్‌లు,క్లినిక్‌లు, దయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు,డెంటల్ క్లినిక్‌లు,వెటర్నరీ ఆసుపత్రులు తదితర వైద్య సంస్థల నుంచి వెలువడే బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య చెత్తలో కలపడం చట్ట విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.ఇటువంటి చర్యలు నిబంధనలకు వ్యతిరేకమని,ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతాయని తెలిపారు.బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా అధీకృత ఏజెన్సీల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో సేకరించి,రవాణా చేసి,శుద్ధి చేసి, నిర్వీర్యం చేయాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో కలిపే ఆసుపత్రులు,క్లినిక్‌లు లేదా ఇతర వైద్య సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు, జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.ప్రదీప్ రెడ్డి,ఐఎంఎ ప్రతినిధులు డాక్టర్ రమేష్,డాక్టర్ పుల్లారావు,డాక్టర్ ప్రదీప్, తదితర వైద్యులు పాల్గొన్నారు.

## పక్కాగా ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ శరవేగంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాను పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా, డిజిటలైజేషన్ పురోగతిపై ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సర్ ప్రక్రియ ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10,08,252 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 9,34,581 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. అంటే దాదాపు 92.69 శాతం పని పూర్తయిందని, మిగిలిన 73,671 మంది ఓటర్ల డేటాను కూడా త్వరలోనే సిస్టమ్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సరిగ్గా ఉండేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1,205 పోలింగ్ కేంద్రాలకు గాను, ప్రతి బిఎల్ఓ తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన వారు, శాశ్వతంగా ఇళ్లు మారిన వారి వివరాలను ఒకటి కంటే ఎక్కువ చోటూ ఓటు ఉన్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి నమోదు చేస్తున్నారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా ఓటరు కార్డుల్లో తప్పులు దొర్లకుండా, డూప్లికేట్ ఓట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నామని వెల్లడించారు.

## దళిత నియోజకవర్గంపై మీ పెత్తనం చెల్లదు

### ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** దళిత నియోజక వర్గంపై కోమటిరెడ్డి బ్రదర్స్ మీ పెత్తనం చెల్లదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజక వర్గ రాజకీయాలపై వ్యాఖ్యానించే నైతిక హక్కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు లేదన్నారు. నియోజక వర్గం గురించి గాంధీభవన్‌లో రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. ముందు నీ మునుగోడు సమస్యలు, మీ మునుగోడు మురికిని చూసుకోమని హితవు పలికారు. బిజెపి నుంచి వచ్చిన నీతోపాటు వచ్చిన నాయకులకే మండల పార్టీ అధ్యక్ష పదువులు ఇప్పించలేకపోయావని ఎద్దేవా చేశారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రూ.32 కోట్లతో బిక్కేరు వాగుపై 6 చెక్ డ్యాంలను పూర్తి చేస్తే నేడు సుమారు 12వేల ఎకరాల సాగు భూమి సస్యశ్యామలం అయిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.170 కోట్లతో సిసి రోడ్లు వేయించినట్లు తెలిపారు. 30 గ్రామాలకు నూతన గ్రామ పంచాయితీ బిల్డింగ్‌లను నిర్మించినట్లు వివరించారు. సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తిరుమలగిరి మండల కేంద్రంలో జూనియర్ కాలేజి, రూ.16కోట్లతో తుంగతుర్తి మెయిన్ రోడ్డు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. తిమ్మాపురం నుండి వెంకేపల్లి గ్రామం వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్లు వేయించామన్నారు. అదే విధంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భుదాని గాని కాలువను మంజూరి చేయించినట్లు తెలిపారు. తిరుమలగిరి మండల కమిటి అధ్యక్షుడు జనార్ధన్‌తోపాటు 8 మండలాల అధ్యక్షులు, పిఏసిఎస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్' పోస్టర్ ఆవిష్కరణ

### 28న నల్లగొండలో యువతకు 8 రకాల పోటీలు : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నషా ముక్త్ యువ వికసిత్ భారత్ కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28నుంచి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ నందు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.యువతలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించడమే ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.కార్యక్రమంలో భాగంగా యువతకు 8 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్యాన్స్, మ్యూజిక్,వ్యాసరచన,కవిత్వం,పెయింటింగ్,స్లోగన్స్,రీల్స్,నుక్కడ్ నాటక్జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.కావున యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మై భారత్ జిల్లా అధికారి గౌతమ్ రెడ్డి,డివైఎస్ఓ అక్బర్ అలీ,ఎంకె నాయక్,ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
శనివారం
25-07-2026
www.prajapaksham.in

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.


హైదరాబాద్...

## వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో

# రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

### నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై విచారణ జరపాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, ఎఐఎస్‌బి జిల్లా నాయకులు తాజ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా శుక్రవారం వరంగల్ జిల్లా వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యం లో వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రంగశాయపేట డిగ్రీ, జూనియర్ కళాశాల తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్‌బి, ఎఐవైఎఫ్ నాయకులు కంజర్ల లక్కీ, జీలకర్ర కార్తీక్, మేకల అభిరామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వసీమ్, సమీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల్ రూరల్ :** ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం జరిపిన లాఠీచార్జీకి నిరసనగా శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్, వామపక్ష విద్యార్థి నాయకులు దేవేందర్, శంకర్, వామన్‌పల్లి రంగస్వామి, హలీం పాషా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వగా కరీంనగర్‌లో బంద్ విజయవంతమైంది. నగరంలో విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఎఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిక రాజశేఖర్, ఎఐఆఫ్‌డిఎస్ శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి హేమంత్, సన్నీ, సందీప్, రాకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** నీట్ పరీక్ష పత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థి యువతనుపై అమానుషంగా లాఠీచార్జ్ చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతాల్లో విజయవంతం అయ్యిందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గాప్రసాద్, డివైఎఫ్ఐ కొంటు సాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్, తడిగొప్పుల అనుప్ సాయి, అభి, గోడిసెల ప్రణీత్, డివైఎఫ్ఐ నాయకులు ముగిలిచల్ల సురేష్ వీర సూర్య సత్య, విష్ణు ,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్‌టౌన్ :** దేశంలో విద్యారంగాన్ని నాశనం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు మరియు ప్రాణాలతో ఆడుకుంటున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన నిర్మల్ జిల్లా విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనతో కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని, న్యాయం కోసం నిరసన తెలుపుతున్న వారిపై లాఠీచార్జ్ చేయించడం అత్యంత దారుణమని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఉపాధ్యక్షులు తోటకూరి శేఖర్, నాయకులు కోనేరి శ్రీనివాస్, రవికుమార్, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** శుక్రవారం దేశ వ్యాప్త వామపక్ష, విద్యార్థి సంఘాల బంద్ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగిన సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు రాకేష్, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, డివైఎఫ్ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడారు. ప్రదర్శనకు సిపిఎ నాయకులు రవి మారుత్, ఐవి రమణారావు, విజయ్ సంఘీభావం తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మద్దోజు శ్రవణ్ కుమార్, భరత్, నాగరాజు, నాగులమీరా, మనోజ్, సాయి, రాజు, భాను, త్రినాథ్, లోకేష్, లక్ష్మ ణ్, వినయ్, సురేష్, సిద్దు, వెంకటేష్, గాంధీ, శ్రీకాంత్, ఈశ్వరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేద్ర సింగ్ ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా అమర వీరుల స్థూపం వద్ద కేంద్ర విద్యాశాఖా మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి గణేష్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు అరుణ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజయ్,జీవన్ ప్రేమ్ వినయ్ ప్రవీణ్ మాణిక్యాల వినయ్ గుండాల సుజన్ సాయి సంతోష్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు : నీట్, సిబిఎస్ఇ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బందు మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి.అమీర్, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు స్టాలిన్ అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను ఖండిస్తూ దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. అనంతరం తొర్రూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఖమ్మం, వరంగల్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు పేరబోయిన కిరణ్‌కుమార్, విక్రమ్, నవీన్, పవన్‌కుమార్, వినయ్, సురేందర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ డిమాండ్ చేశాడు. విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జీని ఖండిస్తూ దేశావ్యాప్తంగా నిర్వహించిన విద్యా సంస్థల బంద్ జిల్లాలో విజయవంతం అయ్యింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక విద్యార్థులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణ కేంద్రంలోని గడియారం సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్, ఇందూరి సాగర్, అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాదెపాక సూర్య తేజ, జిల్లా యశ్వంత్, జాను, పవన్, కిరణ్, నవదీప్, అడిల్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు


భద్రాచలం...


నల్లగొండ...


పెద్దపల్లి...


గద్వాల...


నిర్మల్....


తొర్రూర్..


యాదగిరిగుట్ట...


వరంగల్...


ఖమ్మం...


కరీంనగర్....


సిరిసిల్ల...

## పనివేళలు, రద్దీ సమయాల్లో

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు



### సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని చెప్పారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో శుక్రవారం తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఉన్నతాధికారులతో సిఎం సమీక్షించారు. ప్రతీ 2 లేదా 3 నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని ఈ సందర్భంగా అధికారులకు సిఎం చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం సూచించారు. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్ఆర్‌పై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకు రావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాల్సిన అవసరం ఉందని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సూచించారు.

సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సిపిఐ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పాల్గొని జాతీయ రాజకీయ పరిస్థితులు వివరించినట్లు ఆయన తెలిపారు. పరీక్షా పత్రాల లీకేజీలు, యువ అభ్యర్థులను నిరాశలోకి ఆత్మహత్యలకు పురిగొల్పి, దురదృష్టకర ప్రాణ నష్టానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

### ఆగస్టు 6 నుండి 14 వరకు పాద యాత్రలు, ప్రచార యాత్రలు, సెప్టెంబరు 1న ఛలో ఢిల్లీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో పాదయాత్రలతో పాటు పలు నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా పాదయాత్రలు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు జరుగుతాయని, సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీకి పిలుపు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. ఉద్యమ కార్యక్రమం రూపొందించుకుని విస్తృతంగా పర్యటన చేయాలని, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు.

### సెప్టెంబరు 11 నుండి 17 వరకు తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాలు

సెప్టెంబరు 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాపితంగా తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, సెప్టెంబరు 17న పెద్ద ఎత్తున సభ నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు సాంబశివరావు తెలిపారు.

## సైబర్ మోసాలపై సిట్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. ఈ రెండు కేసుల ఆధారంగా బ్యూరో కొత్తగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. డిఎస్‌పి కె.వి.మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును విచారించనుంది. సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, మనీలాండరింగ్ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేపట్టాలని, ప్రతి వారం దర్యాప్తు పురోగతి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దర్యాప్తు సంస్థల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో నిరుద్యోగులను నమ్మించి వారి పేర్లపై బ్యాంకు ఖాతాలు తెరిపించి, ఆ ఖాతాల నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకున్న నిందితులు దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ మోసాల సొమ్మును ఈ ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఖాతాల ద్వారా దాదాపు రూ.1,000 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు సమాచారం. ప్రధాన నిందితుడిగా పోత్రు ప్రవీణ్ ఉండగా, పోత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవరావు, జన్నునూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ తదితరులు కూడా నిందితుల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన నిందితులు, వారికి సహకరించిన వ్యక్తులు, కంపెనీలు, బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్‌పై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. కొంతమంది నిందితులకు అధికార పార్టీకి చెందిన మంత్రి స్థాయి నాయకుల అనుచరులుగా గుర్తింపు ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఈ అంశంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

## కొత్త గనులొస్తలేవ్!

(మొదటి పేజీ తరువాయి)

రావడం లేదని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం 31 డిమాండ్ లతో సమ్మె నోటీసు ఇచ్చామని, దీని పై ఈ నెల 28 న చర్చలు జరుగనున్నాయని, ఒక వేళ చర్చలు విఫలమైతే ఆర్.ఎల్.సి నుండి ఫెయిల్యూర్ రిపోర్ట్ తీసుకొని ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా సమ్మె లోకి వెళ్తామని, ఈ సమ్మె ను విజయవంతం చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని జి.ఎం ఆఫీస్ గ్రౌండ్ లో జరిగిన సింగరేణి కార్మికుల కవాతులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థలో ఎనబై ఏళ్ల చరిత్ర కలిగిన సంఘం ఎఐటియుసి అని అందుకు కార్మికులు గర్వపడాలన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ చట్టం వల్ల సింగరేణి కి కొత్త గనులు రాకుండా పోయిందని దీనికి అనుకూలంగా పార్లమెంటు లో ఆనాడు టిఆర్ఎస్ ఎంపి కవిత తదితరులు ఓటు వేసారని ఆయన ఆరోపించారు. అలాంటి సంఘానికి కార్మికుల గురించి, ఎఐటియుసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. గోదావరిఖని లో జరుగుతున్న కార్మికుల కవాతు ద్వారా కార్మిక వర్గ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడగా, నాయకులు వై.వి.రావు, వీరభద్రం, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, బాజీసైదా,గంధం సాంబశివరావు, మందల రాంచంద్రారెడ్డి, సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే.కనకరాజ్, కార్పొరేటర్ సూర్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం ఎ గౌస్,వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, క్రాంతి కిరణ్ లు పాల్గొన్నారు. ఈ కవాతు కార్యక్రమానికి అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆహ్వానం పలికారు. అంతకు ముందు అమరజీవి కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు గారి విగ్రహం కు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ప్రదర్శన గా జి.ఎం.కాలనీ గ్రౌండ్ కు వచ్చారు. కవాతు లో అర్జీ వన్, టూ, త్రీ బ్రాంచి ల ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సభా కార్యక్రమానికి ముందు కళాకారులు ఎజ్జ రాజయ్య, చీకటి అంజన్న, వై.లెనిన్ లు కార్మిక గేయాలు ఆలపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com